Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం, అక్టోబర్ 11, 2025 | సంపుటి - 21 | సంచిక 31 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

### మరియాకొరీనానువరించిన
# నోబెల్ శాంతి పురస్కారం

ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటంతో పురస్కారం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శాంతి ఆశలు గల్లంతు



స్వీడన్ : ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి 2025 మరియా కొరీనా మచాడోను వరించింది. ఈ విషయాన్ని నార్వే నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. వెనెజువెలాకు చెందిన మరియా కొరీనా ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడినందుకు గానూ ఈ పురస్కారం లభించింది. అయితే, ఈ అత్యున్నత పురస్కారం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. మిగతా 2లో

# హైడ్రా చర్యలతో అక్రమణదారుల్లో దడ

## మంచి ఫలితాలు ఇస్తోందన్న డిప్యూటీ సిఎం

## హైటెక్స్ ప్రాపర్టీ షో ప్రారంభించిన భట్టి విక్రమార్క




హైదరాబాద్ : గత రెండేళ్లలో రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. మూసీ నది సుందరీ కరణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుతో నగర ముఖ చిత్రం మార్చ బోతున్నట్లు వివ రించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను కలిసేలా దీని నిర్మాణం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వనరులు, అవకా శాలపై ప్రచారం బాధ్యత నరెడ్కోపై ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అన్నివైపులా హైదరాబాద్ అభివృద్ధి చెందేలా మిగతా 2లో

హైడ్రాతో కొంత భయం ఏర్పడినా ఫలితాలు కనిపిస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలు, చెరువులను హైడ్రా కాపాడుతోందని వివరించారు. దీంతో ఆక్రమణదారుల్లో భయం పెరిగిందని, ప్రభుత్వ భూములకు భరోసా దక్కిందని అన్నారు. ఇకపోతే హైదరాబాద్ అభివృద్ధికి ఏటా రూ.10 వేల కోట్లు కేటా యిస్తున్నట్లు తెలిపారు.



# హైడ్రా భారీ ఆపరేషన్

## బంజారాహిల్స్ వద్ద 5 ఎకరాల్లో ఆక్రమణల తొలగింపు

## భూమి విలువ 750 కోట్లు ఉంటుందని అంచనా

**హైడ్రా మరో భారీ ఆక్రమణను తొలగించింది. బంజారా హిల్స్‌లో ఆక్రమణలను హైడ్రా తొలగించి, 5 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. రూ.750 కోట్ల విలువైన భూమిగా అధికారులు గుర్తిం చారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో ఆక్రమణ లను గుర్తించిన హైడ్రా శుక్రవారం బారీ బందోబస్తు మధ్య తొలగించింది.**

హైదరాబాద్ : గతంలో ప్రభుత్వం 5 ఎకరాల్లో 1.20 ఎకరాలను జలమండలికి కేటాయించింది. ఈక్రమంలో 1.20 ఎకరాలతో పాటు మొత్తం 5 ఎకరాల భూమి తనదంటూ పార్థసారథి అనే వ్యక్తి కోర్టు కెక్కాడు. చుట్టూ ఫెన్సింగ్ వేసి బౌన్సర్లతో పాటు వేటకుక్కలతో కాపలా పెట్టాడు. కోర్టులో వివాదం ఉండగా మొత్తం భూమిని తన అధీనంలోకి తీసుకొని అందులో షెడ్లు నిర్మించాడు. ప్రభుత్వ భూమిని అడ్డాగా చేసుకుని భయ భ్రాంతులకు గురి చేస్తున్నట్లు జలమండలి, రెవెన్యూ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ వాటర్ రిజర్వాయర్ నిర్మించాలనే జలమండలి ప్రయత్నాలను పార్థసారథి అడ్డుకున్నాడు. ఫేక్ సర్వే నంబర్ (403/52)తో ప్రభుత్వ భూమిని 2లో



## బిసి రిజర్వేషన్ల బిల్లులో అసలు దోషి బిజెపి

### బిల్లుకు అడ్డుపడిందే బిజెపి అన్న కూనంనేని

హైదరాబాద్ : బీసీ రిజర్వేషన్ల అంశంలో అసుల దోషి బిజెపి అని సిపిఐ ఆరోపించింది. ఈ బిల్లును తొక్కి పెట్టడంలో బిజెపి పాత్ర ఉందన్నారు. దీనిపై హైకోర్టు స్టే ఇవ్వడంతో భాజపా, భారత రాష్ట్ర సమితి నేతలు సంబరాలు చేసుకుం టున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు.

---

## పాక్‌కు కొత్తగా ఆయుధ సరఫరా ఏదీ లేదు

పాత ఒప్పందాల్లో ఏవైనా ఉంటే అందిస్తున్నాం

అగ్రరాజ్యం అమెరికా స్పష్టీకరణ 2లో

### సంక్షేమ హాస్టళ్లలో
# సమస్యలకు చెక్

రూ. 60 కోట్ల ఎమర్జెన్సీ ఫండ్స్ విడుదల

సిఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం

హైదరాబాద్ : సంక్షేమ హాస్టళ్లలో తరచూ వస్తున్న సమస్యలకు తక్షణం చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే రెసి డెన్షియల్ స్కూళ్లు, కాలేజీల్లో తరచూ ఏదో ఒక సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ నేపథ్యంలో వాటికి చెక్ పెట్టేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శు క్రవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా ప్రభుత్వ వెల్ఫేర్ సొసైటీ స్థాయి హాస్టల్స్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు గాను రూ. 60 కోట్ల ఎమర్జెన్సీ ఫండ్స్‌ను ఆయన విడుదల చేశారు. ఒక్కో ఎస్సీ, బీసీ సొసైటీకి రూ. 20 కోట్లు.. అలాగే మిగతా 2లో





### బిసిలను మోసం చేసిన
# కాంగ్రెస్, బిఆర్ఎస్

మోసం చేయడంలో ఇద్దరి జీన్స్ ఒక్కటే

జూబ్లీహిల్స్‌లో గెలిచి మోడీకి గిఫ్ట్‌గా ఇస్తాం

పార్టీ నేతల సమావేశంలో బిజెపి అధ్యక్షుడు రామ్

హైదరాబాద్ : బీసీలను బిఆర్ఎస్, కాంగ్రెస్ మోసం చేశాయని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్, బీ ఆర్ఎస్ జీన్స్ ఒక్కటేనని ఎద్దేవా చేశారు. నాంపల్లి లోని పార్టీ రాష్ట్ర కార్యాల యంలో గ్రేటర్ పరిధి జిల్లాల సమావేశం నిర్వ హించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రచారం, అనుస రించాల్సిన వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాజపాతోనే బీసీలకు న్యాయం జరుగుతుందనే నిర్ణయానికి ప్రజలు కూడా వచ్చా రన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుస్తామనే నమ్మకం తమకు ఉందని చెప్పారు. మిగతా 2లో

### బిసి రిజర్వేషన్లపై
# చిత్తశుద్ధిలేని కాంగ్రెస్

ప్రజాక్షేత్రంలో పరువు తీసుకుందన్న ఈటెల



కరీంనగర్ : బీసీల పట్ల కాంగ్రెస్‌కు నిజాయితీ, చిత్తశుద్ధి లేదని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లా డుతూ.. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పరువు తీసుకుందన్నారు. కాంగ్రెస్ ఇంత మూర్ఖంగా వ్యవహరిస్తుందని ఎవరూ అనుకోలేదని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజలను రేవంత్ రెడ్డి వంచించారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు సలహాలు ఇచ్చింది ఎవరో అర్థం కాలేదని తెలిపారు. బీసీ రిజర్వేషన్ అంశం రాజ్యాంగానికి సంబంధించినదన్నారు. రేవంత్ రెడ్డికి సత్తా ఉంటే.. మిగతా 2లో

# గాజా శాంతి ప్రణాళికకు ఓకే

## ఆమోదించిన ఇజ్రాయిల్ కేబినేట్

ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో ప్రసంగానికి ట్రంప్‌కు ఆహ్వానం

న్యూఢిల్లీ : గాజా శాంతి ప్రణాళికను ఇజ్రాయిల్ కేబినెట్ శుక్రవారం తెల్లవారు జామున ఆమోదించింది. ఇది మధ్య ప్రాచ్యాన్ని అస్థిరపరిచిన రెండేళ్ల వినాశకరమైన యుద్ధాన్ని ముగించే దిశగా కీలకమైన అడుగుగా భావించాలి. బందీలను విడుదల చేసే ఒప్పందం మేరకు క్యాబినెట్ ఆమోదించిందని ప్రధాని నెతన్యాహూ కార్యాలయం నుండి విడుదలైన సంక్షిప్త ప్రకటన తెలిపింది. అయితే ఈ ప్రణాళికలోని ఇతర అంశాలను ప్రస్తావించలేదు. మిగతా 2లో

### శబరిమల బంగారం
# మాయం ఘటన

దృష్టి మరల్చేందుకు సినీ ప్రముఖుల ఇళ్లపై దాడులు

కేంద్రమంత్రి సురేశ్ గోపి సంచలన వ్యాఖ్యలు



తిరువనంతపురం : కేరళలోని శబరిమల ఆలయంలోని బంగారు విగ్రహాల తాపడం బరువు తగ్గడంఇటీవల వివాదాస్పదమైన నేపథ్యంలో, ఈ ఘటనపై నటుడు, కేంద్ర మంత్రి సురేశ్ గోపి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. శబరిమల అంశం నుంచి దృష్టి మళ్లించేందుకే సినీ ప్రముఖుల ఇళ్లపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. పాలక్కడ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సురేష్ గోపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఎదురైన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆయన ఈ ఆరోపణలు చేశారు. శబరిమల బంగారు సమస్య నుంచి దృష్టిని మరల్చేందుకు ఇద్దరు సినీ నటులను లక్ష్యంగా చేసుకున్నట్లు ఆయన వ్యాఖ్యానించారు. మిగతా 2లో

### వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను
# గట్టెక్కించాం



వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకునేందుకు చాలా రకాలుగా ప్రయత్నాలు చేసామని సీఎం చంద్రబాబు తెలిపారు. అందుకే.. దానిని మూత పడకుండా చేయగలి గామని చెప్పారు.

**ముంబై తరహాలో విశాఖ అభివృద్ధి**

**రైల్వే జోన్, గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టులు**

**2028 నాటికి దేశంలో ఒక ప్రత్యేక సిటీగా వైజాగ్**

**రూరల్, అర్బన్ పంచాయితీల ఏర్పాటుకు నిర్ణయం**

**కేబినేట్ భేటీలో మంత్రులతో సిఎం చంద్రబాబు వివరణ**

అమరావతి : ఏపీ కేబినెట్ భేటీలో ఆయన మాట్లాడారు. స్టీల్ ప్లాంట్‌ను నష్టాల నుంచి బయటకు తీసుకుని రాగలిగామని పేర్కొన్నారు. వైజాగ్‌కు రైల్వే జోన్, గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టులను తీసుకు వచ్చామని పేర్కొన్నారు. 2028 నాటికి వైజాగ్ దేశంలో ఒక ప్రత్యేక సిటీగా ఉండబోతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఐటీ రంగంలో లక్షలాది ఉద్యోగాలు రాబోతున్నాయని పేర్కొన్నారు. వెస్ట్‌లో ముంబై తరహాలో ఈస్ట్‌లో విశాఖ అభివృద్ధి చెందబోతుందన్నారు. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఆర్సెలార్ మిత్తల్ ప్లాంట్‌కు త్వరలో శంకుస్థాపన చేయబోతున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. విశాఖను ముంబై లాగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పంచాయితీ రాజ్‌లో పంచాయతీలు రేషనలైజేషన్ చేసి రూరల్, అర్బన్ పంచాయితీలుగా చేయాలని తెలిపారు. తన 15 ఏళ్ల సీఎం ప్రస్థానంలో ఎప్పుడూ ఇన్ని పెట్టుబడులు రాలేదని చంద్రబాబు వివరించారు. ప్రస్తుతం వర్క్ ఫ్రమ్ హోమ్‌లో 4 లక్షల 70 వేల మంది ఆంధ్రాలో పని చేస్తున్నారని తెలిపారు. దీనిని 10 లక్షలకు పెంచాలని అధికారులకు చెప్పినట్లు చంద్రబాబు స్పష్టం చేశారు. మిగతా 2లో

## వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను గట్టెక్కించాం

మంత్రులు, సెక్రటరీలకు చెప్పినప్పటికీ శాఖను నడిపించాల్సిన బాధ్యత మంత్రులదే అని తెలిపారు. శాఖలో పని చేయకపోతే వారిని పిలిచి మందలించాల్సింది మంత్రులే అని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయాల్సింది మంత్రులే కానీ అధికారులు కాదనే విషయం గుర్తు పెట్టుకోవాలని సీఎం చెప్పారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గూగుల్ డేటా సెంటర్ మనకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెద్ద ఎత్తున రావడంపై పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఇదంతా విజినరీ సిఎం చంద్రబాబు వల్లనే సాధ్యం అయ్యిందన్నారు.

## సంక్షేమ హాస్టళ్లలో సమస్యలకు చెక్

ఎస్టీ, మైనార్టీ సొసైటీలకు రూ. 10 కోట్ల చొప్పున ఫండ్స్ రిలీజ్ చేశారు. ఈ ఎమర్జెన్సీ ఫండ్స్ వినియోగించే అధికారాన్ని సొసైటీ సెక్రటరీకి దాఖలు పడేలా జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టం చేశారు. హాస్టల్స్‌లోని సమస్యల సత్వర పరిష్కారం కోసం ఈ తరహా ప్రత్యేక ఫండ్స్‌ను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ గురుకులాలు, హాస్టళ్లలో తరచూ సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. అవి మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో ప్రతిపక్షాలు స్పందించి.. నిధుల లేమి వల్లే ఈ తరహా ఘటనలు చోటు చేసుకుంటున్నాయంటూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. అంటే ఫిజికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫుడ్, హెల్త్, టీచింగ్ తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వైపు నుంచి నిధులు కోసం ఎదురు చూడకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఈ వినూత్న ఆలోచన చేసినట్లు తెలుస్తుంది.

## బిసి రిజర్వేషన్ల బిల్లులో అసలు దోషి బిజెపి

వారికి కనీసం బాధ కూడా లేదని విమర్శించారు. ఇది ప్రభుత్వంపై ద్వేషమా.. బీసీలపై ప్రేమ లేదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడారు. అసెంబ్లీలో మద్దతు తెలిపి ఇప్పుడు సన్నాయి నొక్కులు ఎందుకన్నారు. బీసీ బిల్లుకు మేం మద్దతిచ్చాం.. కేసులో కూడా ఇంప్లీడ్ అయ్యాం. మీరెందుకు కాలేదని కూనంనేని ప్రశ్నించారు. సుప్రీంలో 50శాతం దాటొద్దని తీర్పు ఉంది. 9వ షెడ్యూల్‌లో పెట్టడం ద్వారా తమిళనాడులో ప్రత్యేక పరిస్థితుల్లో అంతకంటే ఎక్కువ రిజర్వేషన్లు అమలుచేశారు. రాజ్యాంగాన్ని సవరించే అవకాశం కేంద్రానికి ఉన్నా చేయడం లేదు. దీనికి బాధ్యత మొత్తం భాజపా పైనే ఉందన్నారు. కానీ డొంకతిరుగుడు రాజకీయాలతో ప్రజలను పార్టీ నేతలు గందరగోళానికి గురిచేస్తున్నారని కూనంనేని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో దోషి భాజపా.. వాళ్లకు మద్దతిస్తోంది భారత రాష్ట్ర సమితి. అన్ని పార్టీల నేతలను దిల్లీకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉంది. అవసరమైతే.. అన్ని పార్టీలతో జంతర్ మంతర్ వద్ద ధర్నా ఏర్పాటు చేయాలన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే రిజర్వేషన్ల విషయంలో దేశవ్యాప్తంగా ముందడుగు పడుతుందని కూనంనేని సాంబశివరావు అన్నారు. అలాగే బిజెపి నయవంతచక రాజకీయాలను ఎండగట్టాల్సి ఉందన్నారు.

## పాక్‌కు కొత్తగా ఆయుధ సరఫరా ఏదీ లేదు

న్యూఢిల్లీ,అక్టోబర్10 : పాక్‌కు కొత్తగా ఎలాంటి ఆయుధాలను సరఫరా చేయడం లేదని అమెరికా తెలిపింది. గతంలో చేసుకున్న ఒప్పందాల్లో మిగిలినవి ఏవైనా ఉంటే సరపరా చేస్తున్నామని పేర్కొంది. గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే అధునాతన ఏఐఎం-120 క్షిపణుల విషయంలో పాకిస్థాన్‌కు ఆయుధశక్తిని కొత్త పెంచింది లేదని అమెరికా స్పష్టం చేసింది. అత్యాధునిక క్షిపణులను పాక్‌కు ఇచ్చేందుకు అగ్రదేశం ఆమోదం తెలిపిందంటూ మీడియాలో వెలువడిన కథనాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. వాటిపై భారత్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం స్పష్టత ఇచ్చింది. అవన్నీ తప్పు అని తేల్చింది. గతంలో చేసుకొన్న ఒప్పందంలో ప్రస్తావించిన ఇప్పటికే ఉన్న సామర్థ్యాలకు అనుగుణంగానే డెలివరీలు ఉంటాయని.. తాజాగా ఇచ్చే ఆయుధాల్లో కొత్తగా సామర్థ్యం పెంచినవి లేవని స్పష్టం చేసింది. అమెరికా-పాకిస్థాన్ రోజురోజుకూ చేరువవుతోన్న సంగతి తెలిసిందే. ఈ సమయంలోనే గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే అధునాతన ఏఐఎం-120 క్షిపణుల ఆయుధశక్తిని పెంచి పాక్‌కు అందించేలా అమెరికా రక్షణశాఖ ఒక నోటిఫికేషన్ జారీ చేసినట్లు మీడియా కథనాలు వచ్చాయి. పాక్ వాయుసేనకు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానాలను అగ్రరాజ్యం ఆధునికీకరించే అవకాశం ఉందన్న ఊహాగానాలకు ఇది తావిచ్చింది. ఈ క్రమంలోనే అమెరికా నుంచి స్పందన వచ్చింది.

## బిసి రిజర్వేషన్లపై చిత్తశుద్ధిలేని కాంగ్రెస్

ఢిల్లీలో ధర్నా ఎందుకు చేశారో తెలియదన్నారు. కాంగ్రెస్ నేతలు చెంపలేసుకుని.. ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే జరిపించాలని పట్టుబడ్డారు. హామీ ఇచ్చే ముందు కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉందో తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లోపు పాత సర్పంచ్‌లకు వెంటనే బిల్లులు చెల్లించాలని ఎంపీ డిమాండ్ చేశారు. 'హుజురాబాద్‌లో బీ ఫామ్స్ నేనే ఇస్తా.. ఇక్కడ నేను 25 ఏళ్లుగా లీడర్‌ను.. నేను కాకుండా బీ ఫామ్స్ ఇంకెవరు ఇస్తారు' అని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ ప్రశ్నించారు.

## పెన్షన్ అంటూ.. వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ఫిర్యాదుతో దొంగను పట్టుకునే పనిలో పోలీసులు

పెద్దపల్లి,అక్టోబర్10(ఆర్ఎన్ఎ):తెలంగాణ వ్యాప్తంగా చైన్ స్నాచింగ్ కేసులు ఎక్కువవుతున్నాయి. ఒంటరిగా వెళ్తున్న మహిళలను, వృద్ధురాళ్లను టార్గెట్ గా చేసుకుని చైన్లు లాక్కెళ్ళుతున్నారు. కొందరు మాయమాటలు చెప్పి నమ్మించి బంగారు చైన్లు లాక్కెళ్తున్నారు. తాజాగా శుక్రవారం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలిని పెన్షన్ వచ్చిందని నమ్మించి మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లాడు ఓ దుండగుడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా ధర్మారంలో చోటు చేసుకుంది. ధర్మారం మండల కేంద్రానికి చెందిన బుదారపు శంకరమ్మ(67) ఉదయం ధర్మారం మెయిన్ రోడ్డులో నడుచుకుంటూ వెళుతుండగా ఓ వ్యక్తి వచ్చి పరిచయం చేసుకున్నాడు. నీకు రూ. 4000 రూపాయల పెన్షన్ మంజూరు అయ్యిందని ఫోటో అప్లోడ్ చేయాలని నమ్మించి వృద్ధురాలిని పక్కకు తీసుకెళ్లాడు. మెడలోని బంగారు పుస్తెల తాడు ఫోటోలో కనిపిస్తే పెన్షన్ రాదని చెప్పడంతో శంకరమ్మ తన పుస్తెల తాడు తీసి అతని చేతిలో పెట్టింది. దీంతో ఒక్కసారిగా సదరు వ్యక్తి బంగారు పుస్తెల తాడు తీసుకుని పరారయ్యాడు. దీంతో లబోదిబోమంటూ మోసపోయిన వృద్ధురాలు ధర్మారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అక్కడ ఉన్న మొబైల్ షాపులోని సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## లిక్కర్ స్కామ్ కేసులో ఊరట

న్యూఢిల్లీ : ఏపీ పాలిటిక్స్ లో తీవ్ర దుమారం రేపిన లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఎ 39గా ఉన్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది సుప్రీంకోర్టు. మోహిత్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ పై శుక్రవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ క్రమంలో ఏపీ సర్కార్ కు నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# హైడ్రా చర్యలతో ఆక్రమణదారుల్లో దడ

ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందని చెప్పారు. నరెడ్కో ఆధ్వర్యంలో హైటెక్స్‌లో ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నారు. కార్యక్రమాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి భట్టి విక్రమార్క శుక్రవారం ప్రారంభించారు. నరెడ్కో బ్రౌచర్‌ను వారు ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు ప్రాపర్టీ షో కొనసాగనుంది. ఇందులో పలు స్థిరాస్తి సంస్థల స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయిందని ప్రచారం చేశారు. రాయదుర్గంలో ఎకరా రూ.177 కోట్ల ధర పలకడంతో నగర అభివృద్ధి ఎలా దూసుకుపోతుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పర్యావరణ పరిరక్షణ కోసం హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సులను నడిపిస్తున్నాం. భవిష్యత్తులో అన్నీ ఇవే ఉంటాయి. వీటికి పన్ను మినహాయింపులు కూడా ఇచ్చాం. మురుగునీటిని శుద్ధి చేయడానికి రూ.4 వేల కోట్ల వ్యయంతో ఎస్టీపీలను నిర్మించబోతున్నాం. నగరం నలువైపులా మెట్రోను విస్తరిస్తున్నాం. విద్య, వైద్య రంగంపై మరింత దృష్టిసారిస్తున్నాం. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో 100 స్కూళ్లను నిర్మించబోతున్నాం. ఇప్పటికే ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయి. నరెడ్కో ప్రతినిధులు సీఎస్ఆర్ నిధులను విద్య, వైద్య రంగంపై పెద్దమొత్తంలో ఖర్చు చేయండి. విల్లాలు, హై రైజ్ బిల్డింగులకే పరిమితం కావొద్దు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేయండి. సంపద సృష్టికర్తలుగా రియల్టర్లు, బిల్డర్లను రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుంది. మీ సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క తెలిపారు.

## హైడ్రా భారీ ఆపరేషన్

కొట్టేసే ప్రయత్నం చేశాడు. ఈ మేరకు పార్థసారథిపై బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో 4 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి 403 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఉంటే.. 403/52తో ఆక్రమణలకు పాల్పడినట్లు అధికారులు నిర్ధరించారు. అన్ రిజిస్టర్డ్ సేల్ డీడ్‌తో 5 ఎకరాల ప్రభుత్వ భూమి తనదంటూ పార్థసారథి క్లెయిమ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఈక్రమంలో షేక్‌పేట రెవెన్యూ అధికారుల లేఖ మేరకు భారీ బందోబస్తు మధ్య శుక్రవారం హైడ్రా అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణదారు వేసిన ఫెన్సింగ్‌తో పాటు లోపల ఉన్న షెడ్లను హైడ్రా తొలగించింది. 5 ఎకరాల చుట్టూ కొత్తగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి.. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులను ఏర్పాటు చేసింది. బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో ఆక్రమణకుగురైన ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని హైడ్రా గుర్తించింది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన అధికారులు స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో, శుక్రవారం ఉదయం హైడ్రా అధికారులు అక్కడికి చేరుకుని అక్రమ నిర్మాణాలను తొలగించారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ హైడ్రా సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు. కాగా, వీఆర్ ఇన్‌ఫ్రా పార్థసారథి, ఆయన కుమారుడు విజయ్ భార్గవా భూమిని కబ్జా చేసినట్టు తెలిసింది.

## బిసిలను మోసం చేసిన కాంగ్రెస్, బిఆర్ఎస్

నగరాన్ని ప్రపంచానికే తలమానికంగా మారుస్తామని భారత రాష్ట్ర సమితి గతంలో చెప్పింది.. కానీ అందుకు అనుగుణంగా ఎలాంటి ముందడుగు పడలేదు. కాంగ్రెస్ కూడా అధికారంలోకి రావడానికి ఎన్నో హామీలు ఇచ్చింది. ఓట్ల కోసం ఈ రెండు పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు దిగాయి. రెండు మూడు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేస్తాం. ఈ ఉప ఎన్నికలో గెలిచి ప్రధాని మోదీకి గిఫ్ట్‌గా ఇవ్వాలి. రేపటి నుంచి కార్యకర్తలు, నేతలు జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేయాలి. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి లోపాయికారీ ఒప్పందాన్ని తిప్పికొట్టాలని రామచందర్‌రావు కోరారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందని రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలంగాణ రాష్ట్రంలో సిద్ధంగా ఉన్నామని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో తాము గెలుస్తామని పూర్తి నమ్మకం ఉందని, ప్రజలపై విశ్వాసం ఉందని ఉద్ఘాటించారు. విశ్వనగరం పేరుతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నగర ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్నాయని ఆక్షేపించారు. వర్షం వస్తే ప్రాణాలు పోయే పరిస్థితులు నగరంలో ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఎర్రగడ్డలో కాలనీల మధ్య ముస్లింలకు శ్మశాన వాటికలు ఎలా కేటాయిస్తున్నారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. హిందూ దేవాలయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూల్చేస్తోందని ఆరోపించారు. నగరంలో హిందువులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రేపటి నుంచి బీజేపీ శ్రేణులు ప్రతి ఒక్కరూ జూబ్లీహిల్స్‌లో గ్రౌండ్ లేవల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్గనిర్దేశం చేశారు. బీసీలను బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసం చేశాయని ధ్వజమెత్తారు. బీజేపీ వల్లే బీసీలకు న్యాయం జరుగుతోందని ప్రజలు కూడా ఈ నిర్ణయానికి వచ్చారని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తాము గెలుస్తామనే పూర్తి నమ్మకం ఉందని రాంచందర్ రావు ఉద్ఘాటించారు. ఈ సమావేశానికి రాంచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, అభయ్ పాటిల్, చంద్రశేఖర్ తివారీ, ఎంపీలు, ఎమ్మెల్సీలు, గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీల సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపిక, ప్రచార కార్యక్రమాలు, గెలుపు వ్యూహాలపై చర్చించారు.

## శబరిమల బంగారం మాయం ఘటన

అయితే, ఆ నటుల పేర్లను ఆయన ప్రస్తావించలేదు. శబరిమల బంగారు కవచాలకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ లు ముమ్మర దర్యాప్తు చేస్తున్నాయన్నారు. కేంద్రమంత్రిగా దీనిపై తాను ఇంతకుమించి వ్యాఖ్యానించలేనన్నారు. ఇలాంటి ఘటనలు సాధారణమేనన్నారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే సంఘటనలు జరిగినప్పుడు.. ప్రముఖులే లక్ష్యంగా పోలీసులు చర్యలు తీసుకోవడం మామూలే అన్నారు. ఇలాంటివి మరిన్ని చూడాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి ఆ నటుల పేర్లు చెప్పనప్పటికీ.. భూటాన్ నుంచి లగ్జరీ కార్లను అక్రమంగా దిగుమతి చేసుకున్నారన్న కేసులో ఇటీవల పలువురి నటుల ఇళ్లల్లో కస్టమ్స్ అధికారులు దాడులు చేసిన సంగతి తెలిసిందే. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఆఫీసుతో పాటు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్, అమిత్ చకల్‌కల్ ఇళ్ల పైనా ఈ దాడులు జరిగాయి. దీంతో వీరిని ఉద్దేశించే సురేష్ గోపి తాజా వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.

## ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్

### డ్రగ్స్‌ముఠా నుంచి 3కోట్ల హవాలా డబ్బు పట్టివేత

హైదరాబాద్,అక్టోబర్10 : రాష్ట్రంలో డ్రగ్స్‌ను కట్టడి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్ మరో ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించింది. నైజీరియా డ్రగ్స్ ముఠా డబ్బు బదిలీ నెట్‌వర్క్‌ను ఛేదించింది. డ్రగ్స్ దందాకు సంబంధించి రూ.3 కోట్ల హవాలా డబ్బును ముంబయిలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ ముఠాల డబ్బు బదిలీ చేస్తున్న దగ్గారం ప్రజాపతి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు 25 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నకిలీ పాస్‌పోర్టులతో విదేశీయులు భారత్‌లోకి వస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్ మనీ లాండరింగ్ చేస్తున్న కింగ్‌పిన్ దర్గారం ప్రజాపతిని ఈగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముంబైలో రూ.3 కోట్ల హవాలా డబ్బును ఈగల్ బృందం స్వాధీనం చేసుకుంది. నైజీరియా డ్రగ్ క్వారంటెల్‌కు డబ్బు సరఫరా చేసిన నెట్వర్క్‌ని పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. నకిలీ పాస్‌పోర్టులతో విదేశీయులు భారత్‌లోకి వస్తున్నట్లు ఈగల్ పోలీసులు గుర్తించారు.

## డిజిపి ఎదుట మావోయిస్టుల లొంగుబాటు

### ముగ్గురు కీలక నేతలు లొంగినట్లు వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్10 : తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట మావోయిస్టు కీలక నేతలు లొంగిపోయారు. కుంకటి వెంకటయ్య అలియాస్ వికాస్, మొగిలిచర్ల వెంకట్రాజు అలియాస్ చందు, తోడెం గంగ అలియాస్ సోనీ (ఛత్తీస్‌గఢ్) మావోయిస్టు పార్టీ నుంచి బయటికొచ్చి జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నారు. ఈ ముగ్గురూ మావోయిస్టు పార్టీలో రాష్ట్ర కమిటీ స్థాయి నాయకులు. సిద్దిపేట జిల్లాకు చెందిన కుంకటి వెంకటయ్య 1990లో పీడబ్ల్యూడీ ఏర్పాటు చేసిన రైతు కూలీ సభలకు హాజరై.. అదే ఏడాది అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ వివరాలు వెల్లడించారు. పిడబ్ల్యూడీ కమాండర్ బాలన్న ఆధ్వర్యంలో దళంలో చేరారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి 35 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపును అందుకుని.. జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగరం మండలం తాటికాయల గ్రామానికి చెందిన మొగిలిచర్ల వెంకటరాజు(45) .. 11 ఏళ్ల వయసులోనే విప్లవగీతాలకు ఆకర్షితుడై మావోయిస్టు ఉద్యమంలో చేరారు. 1993లో నర్సంపేట దళంలో రిక్రూట్ అయి రాష్ట్రస్థాయి కమిటీలో వివిధ హోదాల్లో పనిచేశారు. మావోయిస్టులతో వచ్చిన సైద్ధాంతిక విభేదాల కారణంగా, పోలీసులు ఇచ్చిన పిలుపును అందుకుని అతని భార్య తోడెం గంగతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఇటీవల కాలంలో 403 మంది మావోయిస్టులు పోలీసులు ఎదుట లొంగిపోయారని డీజీపీ తెలిపారు.

## మరియా కొరీనాను వరించిన నోబెల్ శాంతి పురస్కారం

ఈ ఏడాది మొత్తం 338 మంది ఈ శాంతి పురస్కారానికి నామినేట్ అవ్వగా.. అకాడమీ సభ్యులు మరియా వైపు మొగ్గుచూపారు. వెనెజువెలా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకు గాను మచాడోకు ఈ పురస్కారం ఇస్తున్నట్లు నోబెల్ కమిటీ వెల్లడించింది. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్య సాధన కోసం శాంతి మార్గంలో ఆమె విశేష కృషి చేశారని తెలిపింది. ఈ క్రమంలో మచాడో ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నారని.. గత ఏడాది కాలంగా అజ్ఞాతంలో జీవించాల్సి వచ్చిందని పేర్కొంది. ఆమె వెనెజువెలా పార్లమెంట్ సభ్యురాలిగా, దేశ విపక్ష నేతగా పనిచేశారు. వెనెజువెలా సైనికీకరణను తీవ్రంగా వ్యతిరేకించిన ఆమె.. శాంతియుత మార్గంలో ప్రజాస్వామ్యం కోసం కృషిచేసి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని నోబెల్ కమిటీ వెల్లడించింది. నోబెల్ శాంతి బహుమతిని 1901 నుంచి 105 సార్లు ప్రకటించారు. ఇందులో 111 మంది వ్యక్తులు, 31 సంస్థలు ఇప్పటివరకు ఈ పురస్కారాన్ని అందుకున్నాయి. ఈ అవార్డు అందుకున్న అతిపిన్న వయస్కురాలిగా పాకిస్థాన్‌కు చెందిన హక్కుల కార్యకర్త మలాలా యూసఫ్‌జాయ్ నిలువగా.. జోసెఫ్ రాట్‌బ్లాట్ 86 ఏళ్ల వయసులో దీనిని అందుకున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి వెనెజులా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడోను వరించింది. ఆ దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కుల కోసం చేసిన పోరాటానికి గాను ఆమెను ఈ బహుమతికి ఎంపిక చేశారు. నోబెల్ శాంతి బహుమతికి మరియా కొరినా ఎంపిక కావడంతో.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ బహుమతిపై పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. నోబెల్ శాంతి బహుమతి అందుకోవాలని ట్రంప్ అధ్యక్ష పీఠంపై ఎక్కిన నాటి నుంచి తహతహలాడిపోతున్నారు. ఆ క్రమంలోనే పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో పీవోకేతోపాటు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం దాడులు చేపట్టింది. కొన్ని గంటల తర్వాత ఈ దాడులు ఆగిపోయాయి. దీంతో ఈ దాడులు తన ఆదేశాలకు అనుగుణంగానే ఆగిపోయాయంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వివిధ వేదికల మీద నుంచి పలు సందర్భాల్లో ప్రపంచానికి చాటే ప్రయత్నాన్ని చేశారు. కానీ ట్రంప్ చేసిన ఈ తరహా వ్యాఖ్యలను భారత్ నిర్ద్వంద్వంగా తొసిపుచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా గాజా-హమాస్ యుద్ధవిరమణకు ఒత్తిడి తెచ్చారు. అయినా ఆశలు దక్కలేదు.

## గాజా శాంతి ప్రణాళికకు ఓకే

గత 24 గంటల్లో సుమారు 11 మంది పాలస్తీనియన్లు మరణించగా, 49మంది గాయపడి ఆస్పత్రులను చేరుకున్నారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత రెండేళ్లుగా ఇజ్రాయిల్ గాజాపై జరిపిన దాడిలో 67,000 మంది పాలస్తీనియన్లు మరణించారు. సుమారు 1,70,000 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. మృతుల్లో అత్యధికశాతం మంది మహిళలు, చిన్నారులే పేర్కొంది. ఇకపోతే చరిత్రాత్మక గాజా శాంతి ప్రణాళిక విజయవంతం కావడానికి కృషి చేసినందుకు గాను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పై ఇజ్రాయెల్ ప్రశంసలు కురిపించింది. తమ పార్లమెంట్ కు వచ్చి ప్రసంగించాల్సిందిగా ఇజ్రాయెల్ పార్లమెంట్ స్పీకర్ అమిర్ ఒహన అమెరికా అధ్యక్షుడిని ఆహ్వానిస్తూ లేఖ రాశారు. అందులో ట్రంప్‌ను యూదులకు గొప్ప మిత్రుడిగా అభివర్ణించారు. ట్రంప్‌ను ఆహ్వానిస్తూ.. వైట్‌హౌస్‌కు రాసిన లేఖను అమిర్ ఒహన సోషల్ మీడియాలో పంచుకున్నారు. హమాస్ చెరలో బందీలుగా ఉన్న తమ పౌరులు విడుదలయ్యే విషయంలో ట్రంప్ చూపిన చొరవను అమిర్ ఒహన ప్రశంసించారు. తమ సైనికుల త్యాగం, ప్రధాని నెతన్యాహు సంకల్పం, ఆయనకు ట్రంప్ ఇచ్చిన మనోధైర్యం వల్లే ఈ విజయం సాధించామన్నారు. ట్రంప్ నాయకత్వంలో అమెరికా మిలిటరీ నైతిక విలువల్లోనూ సూపర్ పవర్‌గా నిలిచిందని కొనియాడారు. బలంతో శాంతిని సాధించొచ్చని అమెరికా అధ్యక్షుడు నిరూపించారన్నారు. 2008లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ ఇజ్రాయెల్‌లో పర్యటించిన అనంతరం.. అమెరికా అధ్యక్షుడి స్థానంలో ఉన్నవారు తమ దేశానికి వచ్చి, ప్రసంగించడం ఇదే మొదటిసారని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య ఉన్న బలమైన బంధాలకు ఈ ఆహ్వానం నిదర్శనమన్నారు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య సుదీర్ఘ యుద్ధాన్ని నిలిపివేసేందుకు ఇజ్రాయెల్- హమాస్ తాజాగా అంగీకరించాయి. బందీలు, ఖైదీల విడుదలకు సమ్మతించాయి. ఇజ్రాయెల్, హమాస్ ఒప్పందంపై తొలుత ట్రంప్ ప్రకటన చేశారు. యుద్ధం ముగింపు తొలి దశ ప్రణాళికకు ఆ రెండు వర్గాలు అంగీకరించాయని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ ఒప్పందం ప్రకారం- హమాస్ చెరలోని బందీలంతా అతి త్వరలో విడుదలవుతారు. గాజా నుంచి ఇజ్రాయెల్ క్రమంగా తన బలగాలను ఉపసంహరించుకుంటుంది. బలమైన, మన్నికైన, శాశ్వత శాంతికి ఈ చర్యలు తొలి అడుగులవుతాయని ట్రంప్ పేర్కొన్నారు. ఒప్పందం విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ధ్రువీకరించారు. గాజాలో యుద్ధం ముగింపునకు బాటలు పరిచే ఒప్పందానికి తాము సమ్మతి తెలిపామని హమాస్ సైతం స్పష్టం చేసింది.

## గవాయ్‌పై దాడికి ముందే దళిత ఐపిఎస్ ఆత్మహత్య

### ఇలాంటి పరిస్థితులు ఎక్కడివంటూ..ఎక్స్‌లో కేజ్రీవాల్ ప్రశ్న

న్యూఢిల్లీ,అక్టోబర్10 : సిజెఐ గవాయ్‌పై జరిగిన దాడి మరువకముందే తాజాగా హర్యానా సీనియర్ దళిత ఐపిఎస్ అధికారి పురాన్ కుమార్ తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పురాన్ ఆత్మహత్యపై ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆవేదన చెందారు. కుల వేధింపుల వల్లే ఐపిఎస్ అధికారిని ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించాయని కేజ్రీవాల్ ఆరోపించారు. దోషులకు వీలైనంత త్వరగా కఠిన శిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టులో చేశారు. ఈ సందర్భంగా ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై చెప్పు విసరబోయిన ఘటనను కేజ్రీవాల్ తీవ్రంగా ఖండించారు. గవాయ్‌పై దాడికి సంబంధించిన ఘటనపై సోషల్‌మీడియాలో దళితుల్ని, భారత రాజ్యాంగాన్ని రచించిన బాబాసాహెబ్ అంబేద్కర్‌ని అవమానిస్తూ ట్రోల్ చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులు ఈరోజు భారతదేశాన్ని ఎక్కడికి తీసుకువచ్చారనొ ఎక్స్ పోస్టులో కేజ్రీవాల్ ప్రశ్నించారు.

## కఫ్ సిరప్ మరణాలపై జ్యుడీషియల్ కమిషన్

### విచారణ కోరుతూ వేసిన పిల్ కొట్టివేత

న్యూఢిల్లీ,అక్టోబర్10 : దగ్గు సిరప్ మరణాలపై జ్యుడీషియల్ కమిషన్ లేదా నిపుణుల కమిటీతో స్వతంత్ర దర్యాప్తు కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను తోసిపుచ్చింది. న్యాయవాది, పిటిషనర్ విశాల్ తివారీ తన కెరీర్‌లో ఎన్నిసార్లు పిల్‌లు దాఖలు చేశారని ప్రశ్నించింది. ప్రస్తుతం నిషేధించబడిన కోల్డ్రిఫ్ సిరప్ తయారీ సంస్థ ఉన్న మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు పరస్పరం నిందించుకుంటూ, విమర్శలకు దిగుతున్నాయని, వాటి దర్యాప్తులో ఎటువంటి గణనీయమైన చర్యలు తీసుకోకుండానే సమయం వృధా అవుతోందని తివారీ అన్నారు. తివారీ కేంద్రీకృత దర్యాప్తును కోరారు. ఎఫ్ఐఆర్‌లను సిబిఐకి బదిలీ చేయాలని న్యాయవాది పిటిషన్‌లో కోరారు. పరిశ్రమల్లో వినియోగించే విషపూరిత రసాయనమైన డైఇథిలిన్ ÷-లగైకాల్ కలిగిన కలుషితమైన దగ్గు సిరప్‌ల తయారీ, నియంత్రణ, పరీక్ష మరియు పంపిణీపై సమగ్ర విచారణ జరపాలని, ఔషదాల తయారీకి తగిన సూచనలు జారీ చేయాలని పిటిషన్ కోరింది. కోల్డ్రిఫ్ స్టాక్‌ను స్వాధీనం చేసుకోవాలని, వాటి పంపిణీ, విక్రయాలను నిలిపివేయాలని కోరింది. మధ్యప్రదేశ్‌లో కోల్డ్రిఫ్ దగ్గు సిరప్‌తో 22మంది మరణించిన సంగతి తెలిసిందే. ఆ సిరప్‌ను సూచించిన ప్రభుత్వ వైద్యుడిని ఇటీవల పోలీసులు అరెస్ట్ చేశారు. అతనిపై మరియు తమిళనాడుకి చెందిన సిరప్ తయారీదారుపై కేసు నమోదు చేశారు.

# కొట్లాడడమే జాగృతి లక్ష్యం

### ఇచ్చిన హామీల కోసం ప్రభుత్వంతో పోరాటం

### జాగృతి అధ్యక్షురాలు కవిత పిలుపు

హైదరాబాద్,అక్టోబర్ 10 : జాగృతిలో చేరడమంటే బతుకమ్మ ఆడినట్లు ఉంటుందని.. అదే విధంగా పిడికిలెత్తి పోరాటం చేయాల్సి ఉంటుందని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పోరాటాలు జాగృతి రక్తంలోనే ఉన్నాయని అన్నారు. తెలంగాణ పోరాటంలో అగ్రభాగాన నిలబడ్డామని అన్నారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో పలువురు తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి తమ సంస్థలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు రూ.2,500 నెలకు ఇస్తామని మోసం చేసిందని.. అందుకోసం కొట్లాడాలంటూ సంస్థలోని సభ్యులకు ఆమె పిలుపు నిచ్చారు. ప్రసవం కోసం ఆస్పత్రులకు వెళ్లిన మహిళలకు గతంలో కేసీఆర్ కిట్ వచ్చేదని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అది కూడా ఆగిపోయిందంటూ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. అడబిడ్డలకు కిట్ల సాధన కోసం ప్రభుత్వంపై కొట్లాడాలని సూచించారు.



పేదింటి బిడ్డ పెళ్లికి ఇస్తానన్న తులం బంగారం కోసం కొట్లాడుదామన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలంటూ గద్దెనెక్కి కనీసం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ముఖ్యంగా బీసీ బిల్లు తెస్తామని.. తీసుకు రాలేనందుకు కు జాగృతి ఆధ్వర్యంలో కొట్లాడదామని పేర్కొన్నారు. జాగృతి అంటేనే పోరాటాల జెండా.. జాగృతి అంటేనే విప్లవాల జెండా అంటూ ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభివర్ణించారు. ప్రజా సమస్యల పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు.

## స్టాల్ ఇన్ మాల్‌తో గ్రామీణ హస్తకళాకారులకు చేయూత

**స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం**

**పట్టణ ప్రాంత ప్రజల అభిరుచులకు తగ్గట్లు అందుబాటులో ఉత్పత్తులు**

**జనవరి 9 వరకు స్టాల్ ఇన్ మాల్ ద్వారా ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు**

**నగర ప్రజలు హస్తకళాకారులను ప్రోత్సహించేందుకు ముందుకు రావాలి**

**నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంఎం బెహ్రా**

విజయవాడ,అక్టోబర్ 10 : స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ హస్తకళాకారులు తయారుచేసిన ఉత్పత్తులకు సరైన మార్కెట్ సౌకర్యం కల్పించి ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలనే లక్ష్యంతో ప్రైవేటు షాపింగ్ మాల్స్‌లోనూ స్టాల్ ఇన్ మాల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) ఎంఎం బెహ్రా అన్నారు. ÷ాబార్డ్ ఆర్థిక సహాయంతో నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పీవీపీ మాల్‌లో ఏర్పాటుచేసిన స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శనను శుక్రవారం నాబార్డ్ నాబార్డ్ డీజీఎం ఎంఎం బెహ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ హస్తకళాకారులు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి, వారి జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు కళాత్మక సంపదను భావితరాలకు అందజేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన చేనేత వస్త్రాలు, జ్యూట్ బ్యాగులు, కలంకారి వస్త్రాలు, కొండపల్లి బొమ్మలు, ముత్యాల దండలు వంటి ప్రదర్శన, అమ్మకాలు వినియోగదారులను ఎంతగానో ఆకట్టుకోవడంతో మంచి సత్ఫలితాలనిచ్చాయన్నారు. ప్రస్తుతం ఏర్పాటుచేసిన స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శన జనవరి 9 వరకు ఉంటుందని.. మన రాష్ట్రంతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి కూడా కళాకారులు తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతారన్నారు. పీవీపీ మాల్‌లో ఏర్పాటుచేసిన స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శనను తిలకించి స్వయం సహాయక బృందాల మహిళల ఆర్థిక పురోగతికి చేస్తున్న ప్రయత్నంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంఎం బెహ్రా కోరారు. నేస్తం సంస్థ సీఈవో వి.సురేష్ మాట్లాడుతూ నాబార్డ్ సహకారంతో విశాఖపట్నం, విజయవాడ పట్టణాలలో స్టాల్ ఇన్ మాల్స్ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని, ఒక్కో ప్రదర్శన 90 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. హస్తకళాకారులు, చేతివృత్తిదారులకు 15 రోజులపాటు ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంత ప్రజలకు గ్రామీణ హస్తకళారూపాలను తయారీ ధరలకే అందించాలనే లక్ష్యంతో పాటు కళాకారులకు మరింత ఆర్థిక ప్రయోజనం చేకూర్చేలా స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్ కల్లేష్, నేస్తం స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, గ్రామీణ హస్తకళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## సిఐ విధులకు ఆటంకం

**మాజీమంత్రి పేర్నినానిపై చర్యలు: ఎస్పీ**

మచిలీపట్నం,అక్టోబర్ 10 : ఆర్‌పేట సీఐపై మాజీ మంత్రి, వైకాపా నేత పేర్ని నాని వ్యవహరించిన తీరుపై జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐ విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించిన పేర్ని నానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటీవల మెడికల్ కాలేజీవద్ద జరిగిన నిరసన కేసులో కొంత మందికి నోటీసులు ఇచ్చి విచారిస్తున్నాం. అందులో భాగంగా ఏ8గా ఉన్న మేకల సుబ్బన్నను కూడా స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నాం. ఆ సమయంలో పేర్ని నాని.. వైకాపా కార్యకర్తలతో కలిసి స్టేషన్‌కు వచ్చారు. ఎస్‌హెచ్‌వో ఛాంబర్‌లోకి వచ్చి విచారణ అధికారి అయిన సీఐను బెదిరించేలా మాట్లాడారు. దీన్ని పోలీస్ శాఖ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం. సీఐ విధులకు ఆటంక పరచడమే కాకుండా దురుసుగా ప్రవర్తించడం సరైన పద్ధతి కాదు. పోలీస్ స్టేషన్‌కు రావడంలో తప్పులేదు. ఎవరైనా వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చు. అంతేగానీ, విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తిని విడిపించుకొని వెళ్లిపోతా అనడం సరికాదు. పోలీసులతో మాట్లాడేటప్పుడు గౌరవంగా మాట్లాడాలి. మేం కూడా అదే గౌరవంతో మాట్లాడుతాం. గ్రూపులుగా వచ్చి గలాటా సృష్టించడం మంచి పద్ధతి కాదు. దీనిపై తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని ఎస్పీ తెలిపారు.

## పిపిపి మోడల్ కూడా తెలియని మాజీ సిఎం

**జగన్ తీరుపై మండిపడ్డ పట్టాభి**

అమరావతి,అక్టోబర్ 10 : మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం వెళ్లి గోడలు, ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు చూసి వచ్చారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. వాటిని చూసి ఆహా.. ఓహో.. అంటూ ప్రజల్ని మోసం చేసే విధంగా డ్రామాలు ఆడారని ఆరోపించారు. పీపీపీ మోడల్ అంటే ప్రైవేట్‌కి అమ్మేయడం కాదు.. పనుల్లో ప్రైవేట్ సహకారం మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. కాలేజీల నియంత్రణ అంతా ప్రభుత్వం చేతుల్లోనే ఉంటుందని పట్టాభిరామ్ స్పష్టం చేశారు. వైద్య విద్యలో నాణ్యత పెంచడం, పేదలకు అవకాశం ఇవ్వడమే పీపీపీ మోడల్ ఉద్దేశ్యమని కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. పీపీపీ పద్ధతిలో ప్రతి మెడికల్ కాలేజీలో 50? సీట్లు పేద విద్యార్థులకే కేటాయిస్తా మని పేర్కొన్నారు. అలాగే.. పేద విద్యార్థులకు అదే కేటాగిరి కింద రూ.15 వేల కేటాయించబడతాయని చెప్పారు. పీపీపీ పద్ధతిని నేషనల్ మెడికల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ అభిజాత్ సేట్ సమర్థించారని గుర్తు చేశారు. వైద్య విద్యను ముందుకు తీసుకువెళ్లాలంటే పీపీపీ సరైన దారి అని ఎన్ఎంసీ స్పష్టం చేసిందని వెల్లడించారు. పీపీపీ కాలేజీల ద్వారా పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో మెడికల్ చదివే అవకాశం కలుగుతోందని పట్టాభిరామ్ ఆశాభావం వ్యక్తం చేశారు. జీవో నెం.108 విడుదల చేసింది జగన్ ప్రభుత్వమే అని గుర్తు చేశారు.

## నోబెల్ శాంతి బహుమతి ట్రంప్‌కు అంకితం

**తమ పోరాటానికి దన్నుగా నిలబడ్డందుకు కృతజ్ఞతలు**

**నోబెల్ పురస్కారం పొందిన వెనిజులా నాయిక మరియా కొరీనా మచాడో**

న్యూఢిల్లీ,అక్టోబర్ 10 : ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతినిఅమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అంకితం ఇస్తున్నట్లు వెనిజులా పోరాటయోధురాలు మరియా కొరీనా మచాడో ప్రకటించారు. ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికీ.. చివరకు వెనెజువెలా హక్కుల కార్యకర్త మరియా కొరీనా మచాడోను ఈ పురస్కారం వరించింది. దీనిపై తాజాగా మచాడో తన సోషల్ మీడియా ఖాతాలో స్పందిస్తూ.. ట్రంప్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ పురస్కారాన్ని వెనెజువెలా ప్రజలతోపాటు తమ ఉద్యమానికి మద్దతుగా నిలుస్తోన్న డొనాల్డ్ ట్రంప్‌నకు అంకితం ఇస్తున్నానని చెప్పారు. వెనెజువెలా ప్రజలు పడుతున్న కష్టాలను గుర్తించడం మా పోరాటం ముగింపునకు ఊతమిస్తుంది. స్వేచ్ఛ పొందేందుకు దోహదపడుతుంది. విజయానికి దగ్గరలో ఉన్నాం. గతంలో లేనంతగా అధ్యక్షుడు ట్రంప్, అమెరికా, లాటిన్ అమెరికా ప్రజలపై ఆధారపడతాం. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలు మాకు ప్రధాన మిత్రులు. ఈ పురస్కారాన్ని కష్టాల్లో ఉన్న వెనెజువెలా ప్రజలతోపాటు మా పోరాటానికి నిర్ణయాత్మక మద్దతు ఇస్తున్న అధ్యక్షుడు ట్రంప్‌నకు అంకితం చేస్తున్నా అని మరియా పేర్కొన్నారు. అంతకుముందు నార్వే నోబెల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ క్రిస్టియన్ బ్రెగ్ హార్ప్‌క్వెన్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. శాంతి పురస్కారాన్ని ఇవ్వనున్న విషయాన్ని ఆమెకు ముందుగానే తెలియజేశారు. నాకు ఈ పురస్కారం రావడం నమ్మలేకపోతున్నా. మాటలు రావట్లేదు. వెనెజువెలా ప్రజల తరఫున ధన్యవాదాలు. మేము సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. ఇందుకోసం తీవ్రంగా కృషి చేస్తున్నాం. తప్పకుండా విజయం సాధిస్తాం. ఇదో ఉద్యమం అని మీరు అర్థం చేసుకున్నారని భావిస్తున్నా. అయితే, ఇది నా ఒక్కరి గెలుపు కాదు. వ్యక్తిగతంగా నేను దీనికి అర్హురాలిని కాదని అనుకుంటున్నా. ఇది సమాజం మొత్తం సాధించిన విజయం. మా ప్రజలకు లభించిన అతిపెద్ద గుర్తింపు అని మరియా కొరీనా పేర్కొన్నారు. వెనెజువెలా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకు గాను మరియా కొరీనాకు ఈ పురస్కారం ఇస్తున్నట్లు నార్వే నోబెల్ కమిటీ వెల్లడించింది. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్య సాధన కోసం శాంతి మార్గంలో ఆమె విశేష కృషి చేశారని తెలిపింది. ఈ క్రమంలో ఆమె ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నారని.. ఏడాది కాలంగా అజ్ఞాతంలో ఉండాల్సి వచ్చిందని పేర్కొంది.

## నోబెల్ శాంతి పురస్కార ఎంపికలో లోపాలు

**రాజకీయ వివక్ష చూపారని వైట్‌హౌజ్ విమర్శలు**

వాషింగ్టన్,అక్టోబర్ 10 : నోబెల్ శాంతి బహుమతి అందుకోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కల నెరవేరలేదు. ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారానికి వెనెజువెలా విపక్ష నేత మరియా కొరీనాను ఎంపిక చేసినట్లు శుక్రవారం అకాడమీ ప్రకటించింది. దీనిపై తాజాగా అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం స్పందించింది. ఈ పురస్కార విజేత ఎంపికలో రాజకీయ వివక్ష చూపించారని విమర్శించింది. తాజా పరిణామాలపై వైట్‌హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చుయెంగ్ మాట్లాడారు. 'నోబెల్ కమిటీ మరోసారి శాంతి స్థాపన కంటే రాజకీయాలకే అధిక ప్రాధాన్యమిచ్చింది. ప్రపంచ శాంతి కోసం నిజమైన నిబద్ధత చూపించిన వారిని పక్కనబెట్టి రాజకీయ వివక్షను ప్రదర్శించింది. అయినప్పటికీ అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలను ఆపేందుకు తన ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటారు. శాంతి ఒప్పందాల తో ప్రాణాలు నిలబెడుతారు. ఆయన మానవతావాది. తన సంకల్ప శక్తితో పర్వతాలను కదిలించే ఆయనలాంటి వ్యక్తి మరొకరు ఉండరని చుయెంగ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అటు ట్రంప్‌నకు మద్దతిచ్చే 'మాగా వాయిస్' కూడా తన ఎక్స్ ఖాతాలో దీనిపై స్పందించింది. నోబెల్ శాంతి బహుమతి ఓ జోక్‌గా మారింది. తెలివి ఉన్నవారు ఎవరైనా ట్రంప్‌నకే నోబెల్ రావాల్సిందని అనుకుంటారని విమర్శలు గుప్పించింది. ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కల ఈనాటిది కాదు. గతంలోనూ చాలా సార్లు ఆయన తన ఆకాంక్షను బయటపెట్టారు. అయిత, రెండోదఫా అధికారంలోకి వచ్చిన తర్వాత తనకు నోబెల్ వచ్చి తీరాల్సిందే అన్న స్థాయిలో ప్రచారం చేసుకున్నారు. ఎన్నో యుద్ధాలను ఆపానని, ప్రపంచ శాంతిని కోరుకుంటున్న తనకు ఇచ్చి తీరాల్సిందేనంటూ బహిరంగ ప్రకటనలు ఇచ్చారు. తాను ఎన్ని మంచి పనులు చేసినా.. నోబెల్ మాత్రం ఇవ్వరంటూ ఓ సందర్భంలో అక్కసు కూడా వెళ్లగక్కారు. అయితే, ట్రంప్ మాటలను నోబెల్ అకాడమీ పరిగణనలోకి తీసుకోలేదు.

## మానసిక ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దాం..

**సమష్టి భాగస్వామ్యంతో ఆరోగ్య ఆంధ్ర దిశగా అడుగులేద్దాం**

**టెలీ మానస్ ద్వారా అత్యంత నాణ్యమైన మానసిక ఆరోగ్య సేవలు**

**మానసిక ఆరోగ్య రంగంలో ఇండ్లాస్ సేవలు ప్రశంసనీయం**

**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

విజయవాడ,అక్టోబర్ 10 : మానసికంగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషిచేద్దామని.. దేశంలో ఎక్కడాలేని విధంగా కేంద్రం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మానసిక ఆరోగ్యానికి భరోసా కల్పించే వివిధ కార్యక్రమాలతో పాటు వైద్య సేవలు అందిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలో ఇండ్లాస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాలులో 'అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సంరక్షణ' అంశంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత మంత్రి, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులతో కలిసి 'మెంటల్ హెల్త్ వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. 'అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లతో ప్రజల్లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని.. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 97 కోట్ల మంది వివిధ రకాల మానసిక రుగ్మతలకు గురైనట్లు వెల్లడించారు. మానసిక ఆరోగ్య సమస్యల వల్ల ప్రపంచ ఆరోగ్య వ్యవస్థకు ఏటా ట్రిలియన్ డాలర్లు మేర నష్టం వాటిల్లుతోందన్నారు. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా ప్రజలు మానసిక ఆరోగ్య సమస్యల బారినపడుతున్నారని.. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో 14-24 శాతం మంది గురవుతున్నట్లు తెలిపారు. మానసిక రుగ్మతలు, ఒత్తిళ్ల వల్ల ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయన్నారు. సమాజానికి వెలకట్టలేని వైద్యసేవలందిస్తున్న మానసిక వైద్యులు, క్లినికల్ సైకాలజిస్టుల కొరత వుందని, ఆ కొరత తీర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని.. ఇండ్లాస్ హాస్పిటల్‌లో క్లినికల్ సైకాలజీ కోర్సులు ప్రారంభమైనట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో లేని విధంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో టెలీ మానస్ ద్వారా మానసిక ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రతి జిల్లాలోనూ మెంటల్ హెల్త్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. దేశ వ్యాప్తంగా 27 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు ఇస్తే మన రాష్ట్రానికి ఒక కేంద్రం వచ్చిందని, విశాఖపట్నంలోని ప్రభుత్వ మానసిక వైద్యశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అప్‌గ్రేడ్ అయిందన్నారు. మానసిక ఆరోగ్య రంగంలో నిపుణుల కొరత తీర్చేందుకు కోర్సులు, ప్రవేశాలపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సకాలంలో మానసిక రుగ్మతలను గుర్తించి.. సరైన చికిత్స అందించడం ముఖ్యమని, ఈ దిశగా సమష్టి కృషి, భాగస్వామ్యం అవసరమని, మానసిక వైద్య రంగంలో డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి చేస్తున్న కృషిని అభినందిస్తున్నామని, ఆయన అనుభవాన్ని, సేవలను ప్రభుత్వం ఉపయోగించుకుంటుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ÷ల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర సాకారానికి ఆరోగ్యాంధ్ర కీలకమని, ప్రజలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లోనూ సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ప్రజలు మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడే యోగాపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం యోగాంధ్ర మాసోత్సవాలు నిర్వహించిందని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఇండ్లాస్ డైరెక్టర్ డా. విశాల్.. ప్రజల్లో మానసిక సమస్యలు పెరుగుతుండటానికి కారణాలు, వాటిని ఎదుర్కొంటూ ఆరోగ్యకర జీవితాన్ని సొంతం చేసుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ తాము ఈ రంగంలో ప్రామాణిక వైద్య సేవలు అందించే దిశగా ముందడుగు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. వి.రాధికారెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డా. శ్రీహరిరావు, లండన్‌కు చెందిన ప్రముఖ ఈఎన్‌టీ సర్జన్ డా. కృష్ణారెడ్డి, కంటి వైద్య నిపుణులు డా. ఇండ్ల స్వప్న, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఐఎంఏ - విజయవాడ అధ్యక్షులు డా. హనుమయ్య, పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## దీపావళికి బాణాసంచా కాల్చనివ్వండి

**సుప్రీంను అభ్యర్థించిన రాష్ట్రాలు**

న్యూఢిల్లీ,అక్టోబర్ 10 : ఢిల్లీ ఎన్సీఆర్ పరిధిలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలోనే ఉన్నందున బాణసంచా విక్రయాలను నిషేధిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం గత ఏప్రిల్ 3న తీర్పునిచ్చింది. ఈ విషయంపై పలు రాష్ట్రాలు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీపావళి కోసం పిల్లలు ఎదురుచూస్తారని.. పర్యావరణహితమైన బాణసంచాతో వారిని పండగ చేసుకోవడానికి అనుమతించాలని న్యాయస్థానాన్ని కోరాయి. దీపావళి రోజున రాత్రి 8 నుంచి 10 వరకు రెండు గంటలపాటు పర్యావరణ హితమైన బాణసంచా కాల్చడానికి అనుమతివ్వాలని ఎన్సీఆర్ రాష్ట్రాల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనాన్ని కోరారు. కొన్ని షరతుల కింద రాష్ట్రాల్లో బాణసంచా వాడకాన్ని అనుమతించవచ్చని, జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ ఆమోదించిన పర్యావరణహిత బాణసంచా మాత్రమే తయారు చేసి, విక్రయించేలా సూచించాలని తుషార్ మెహతా పేర్కొన్నారు. అత్యధిక పేలుడు స్వభావమున్న టపాసులు తయారు చేయకుండా రాష్ట్రాలు, ఢిల్లీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటాయని ధర్మాసనానికి తెలియజేశారు. అదే విధంగా వ్యాపారులు అనుమతి పొందిన క్రాకర్లను మాత్రమే విక్రయించాలని.. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ మొదలైన ఏ ఇతర ఇ-కామర్స్ వెబ్‌సైట్లు కూడా బాణసంచాను ఆన్‌లైన్‌లో విక్రయించవద్దని సూచించారు. ఈ విషయంపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది.

## ఎనిమిదేళ్ల చిన్నారిపై యువకుడి అత్యాచారం

హైదరాబాద్,అక్టోబర్ 10 : హైదరాబాద్‌లో దారుణ ఘటన చోటు చేసుకుంది. గంజాయి మత్తులో ఓ దుండగుడు 8 ఏళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దంపతులు హైదరాబాద్ సైదాబాద్ పరిధిలోని సింగరేణి కాలనీలో కూతురు(8), కుమారుడు(7) లతో నివసిస్తూ, కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. దంపతులిద్దరు కూలీ పనులకు వెళ్లిన సమయంలో ఇద్దరు చిన్నారులను ఇంటికి పిలిచాడు ఓ యువకుడు. సోదరుడి ముందే బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. బాలిక అనారోగ్యానికి గురవ్వగా, తల్లిదండ్రులు చిన్నారి తమ్ముడిని నిలదీశారు. దీంతో ఆ బాలుడు జరిగిన విషయాన్ని చెప్పాడు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సహాయంతో సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి చేసిన పోలీసులు పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## వసతిగృహంలో బాలురకు అస్వస్థత

**ఆస్పత్రిలో పరామర్శించిన మంత్రి సవిత**

గుంటూరు,అక్టోబర్ 10 : పెదనందిపాడు మండలంలోని అన్నపర్రు బీసీ బాలుర వసతి గృహంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను మంత్రి సవిత పరామర్శించారు. విషయం తెలియగానే అధికారులు అప్రమత్తమై విద్యార్థులకు సత్వరమే వైద్యం అందించే ఏర్పాట్లు చేశారన్నారు. 17 మంది కోలుకొని ఇళ్లకు వెళ్లిపోయారని, పెదనందిపాడులో 17 మంది విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారని వివరించారు. జ్వరంతో బాధపడుతున్న 16 మందిని జీజీహెచ్‌కు తీసుకొచ్చి వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. ఘటనపై విచారణ జరుపు తున్నామని.. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. హాస్టల్లో సౌకర్యాల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు. రాత్రి సమయంలో వసతి గృహంలో ఉండాల్సిన వా÷-డ్గ÷న్ లేరని.. అయినా సిబ్బంది స్పందించారని పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు.

## బ్రిటన్ మాజీ ప్రధాని రిషీ సునాక్ కొత్త అవతారం

**మైక్రోసాఫ్ట్ సలహాదారుగా బాధ్యతలు**

లండన్,అక్టోబర్ 10 : భారత సంతతికి చెందిన బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ తాజాగా మైక్రోసాఫ్ట్ సలహాదారుగా నియమితులయ్యారు. మైక్రోసాఫ్ట్‌తో పాటు ఏఐ సంస్థ ఆంత్రొపిక్‌కు కూడా ఆయన సలహాదారుగా వ్యవహరించనున్నారు. ఏఐ రంగంలో రెండు సంస్థలకు మార్గనిర్దేశనం చేసినందుకు గానూ పారితోషికం కూడా తీసుకోనున్నారు. బ్రిటన్ ప్రధాని బాధ్యతల నుంచి తప్పుకున్న తర్వాత.. టెక్ రంగంవైపు రిషి సునాక్ మళ్లడం ఇదే తొలిసారి. ఇక రిషి సునాక్ నియామకానికి బ్రిటన్‌కు చెందిన అడ్వైజరీ కమిటీ ఆన్ బిజినెస్ అపాయింట్‌మెంట్స్ (ఏసీఓబీఏ) అనుమతించింది. బ్రిటన్ ప్రధానిగా ఉన్న సమయంలో ఆయన 2023లో ఏఐ భద్రతకు సంబంధించి గ్లోబల్ సమావేశాన్ని నిర్వహించారు. ఇక బ్రిటన్ ప్రధానిగా సేవలందించినందుకు రిషి సునాక్ విధులకు సంబంధించి ఏసీఓబీఏ పలు నిబంధనలు విధించింది. వీటి ప్రకారం, ఆయన మైక్రోసాఫ్ట్, ఆంత్రోపిక్ తరఫున బ్రిటన్ ప్రభుత్వంతో చర్చలు, లాబీయింగ్ వంటివి చేయకూడదు. బ్రిటన్ ప్రధానిగా చేసిన సమయంలో తనకు తెలిసిన కీలక సమాచారాన్ని ప్రస్తుత విధుల్లో వినియోగించకూడదు. బ్రిటన్ ప్రభుత్వ పరిధిలోని మైక్రోసాఫ్ట్ లేదా ఆంత్రోపిక్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదు. బ్రిటన్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన వారు ప్రైవేటు రంగంలోకి ప్రవేశించినప్పుడు ఎలాంటి చిక్కులు రాకుండా ప్రభుత్వం ఈ నిబంధనలను రూపొందించింది.

# సంపాదకీయం

## శాంతికాముకులు ట్రంప్‌లాగా ఉండరు!

ప్రపంచ ప్రజలు ఎవరు కూడా యుద్ధాలను కోరుకోవడం లేదు. ఘర్షణలను ఆహ్వానించడం లేదు. ప్రశాంతంగా బతకాలని కోరుకుంటున్నారు. ఇస్లామిక్ ఉగ్రవాదులు తప్ప మిగతా ప్రపంచమంతా ఇదే కోరుకుంటోంది. ఈ క్రమంలో కేవలం ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి కోసమే ట్రంప్ ప్రయత్నించడం వెర్రితనం తప్ప మరోటి కాదు. వాణిజ్య సుంకాలతో ప్రజలను అస్థిరంలోకి నెట్టిన ట్రంప్ ఎప్పిటకీ శాంతి కాముకుడు కాదు. బలవంతంగా గాజా, హమాస్ మధ్య శాంతి కుదిరినా అది ట్రంప్ ఖాతాలో వేయలేం. తనను తాను శాంతిదూత అని చెప్పుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కేవలం నోబెల్ ప్రైజ్ కోసమే విన్యాసాలు చేస్తున్నారు. యుద్ధాలే కాదు..ఆర్థిక యుద్ధాలు కూడా యుద్ధం కిందకే వస్తాయని ట్రంప్ తెలుసుకోవాలి. భారత్, పాక్ యుద్ధం సహా ఏడు యుద్ధాలు ఆపానని, ఈ ఏడాది తనకు నోబెల్ బహుమతి రావలని, లేదంటే అమెరికాను అవమానించినట్లేనని బెదిరింపులకు దిగుతున్నారు. అమెరికాకు రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే తనకు పీస్ ప్రైజ్ ఎందుకు దక్కదంటూ, తాను అన్ని విధాల అర్హుడినని ప్రకటిస్తూ వస్తున్నారు. ఈ ఏడాదికి నోబెల్ బహుమతుల ప్రకటన మొదలైన తర్వాత ట్రంప్ మరింత బలంగా డిమాండ్ వినిపించారు. గాజాలో శాంతికి అమెరికా ప్రతిపాదించిన 20 సూత్రాల ప్రణాళికను ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయని, కాల్పుల విరమణకు సంతకాలు చేసిన తర్వాత నోబెల్ శాంతి బహుమతికి తన పేరు ముందు వరుసలో ఉంటుందని చెప్పారు. పాక్, ఇజ్రాయెల్ వంటి దేశాలు ట్రంప్‌ను శాంతి బహుమతికి నామినేట్ కూడా చేశాయి. అయితే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ బహుమతికి ట్రంప్ అసలు అర్హుడేనా అన్న చర్చ సర్వత్రా జరుగుతున్నది. ఎందుకంటే పాలస్తీనా దురాక్రమణకు ఇజ్రాయెల్‌ను ఎగదోస్తున్నదే అమెరికా కాబట్టి ప్రపంచ ప్రజలకు అనుమానాలు ఉన్నాయి.. ఇక రష్యాపై పోరుకు ఉక్రెయిన్‌కు పెద్ద ఎత్తున ఆయుధాలు సరఫరా చేస్తున్నది కూడా అగ్రరాజ్యమే కావడం గమనార్హం. అదేవిధంగా అఫ్ఘానిస్థాన్‌లో తాము నిర్మించిన ఎయిర్ బేస్‌ను బలవంతంగానైనా ఆక్రమిస్తామని, కెనడా కూడా అమెరికా భూభాగమేనని, దానిని తమ దేశంలో మరో రాష్ట్రంగా గుర్తిస్తామని ట్రంప్ ఇప్పటికే ప్రకటనలు చేశారు. ఇవన్నీ ఒక ఎత్తయితే వాణిజ్య సుంకాలతో ప్రపంచానికి కంటిమీద కునుకు లేకుండా చేశారు. అలాగే వీసాల విషయంలోనూ, గ్రీన్ కార్డుల విషయంలోనూ నానా గడ్డీ కరుస్తున్నారు. అలాంట ప్పుడు ట్రంప్ శాంతిదూత ఎప్పటికీ కాలేడు. అయితే హమాస్, ఇజ్రాయిల్ ఒప్పందం వల్ల శాంతి నెలకొంటే ప్రపంచానికి అంతకన్నా కావాల్సింది ఏమీ లేదు. వేలాదిగా ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అందుకే శాంతి ప్రణాళిక అమలుకు హమాస్, ఇజ్రాయిల్ చేసుకున్న ఒప్పందాన్ని భారత్‌సహా పలు ప్రపంచ దేశాలు స్వాగతించాయి. ఇయు, బ్రిటన్, కెనడా, బ్రిటన్, న్యూజిలాండ్, ఇరాన్, ఇటలీ, లెబనాన్, రష్యా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్ సహా పలు దేశాలు ఈ ఒప్పందాన్ని స్వాగతిం చిన వాటిలో ఉన్నాయి. మారణకాండకు స్వస్తి చెప్పే చొరవను, కార్యాచరణను ఎల్లప్పుడూ స్వాగతిస్తామని ఇరాన్ పేర్కొంది. గాజాలో శాంతి స్థాపనకు ఇదొక విశిష్ట అవకాశమని ఇటలీ ప్రధాని మెలొని వ్యాఖ్యానిం చారు. శాశ్వత కాల్పుల విరమణ దిశగా ఈ తొలి ఒప్పందం ముందడుగు అని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ స్పందిస్తూ రాజకీయ పరిష్కారానికి ఈ శాంతి ప్రణాళిక మార్గం వేస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఒప్పందం కుదరడం ఆనందించదగ్గ విషయమే కానీ, ఈ ఒప్పందం అమలు ఎలా వుంటుందో చూడడమే చాలా కీలకమని రష్యా పేర్కొంది. ఈ ప్రయత్నాలకు కచ్చితంగా మద్దతిస్తామని క్రెమ్లిన్ తెలిపింది. తాజా పరిణామాలను సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ స్వాగతిస్తూ న్యాయమైన, సమగ్రమైన శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నాయి. ఈ మేరకు సౌదీ, యుఎఇ విదేశాంగ శాఖలు ప్రకటనలు జారీ చేశాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్వాగతిస్తూ ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ, గాజా ప్రజానీకా నికి మూడు మాసాలకు సరిపడా ఆహార నిల్వలు తమ వద్ద వున్నాయని తెలిపింది. బందీల విడుదల, గాజా ప్రజలకు మానవతా సాయం పెంపు వంటి చర్యలు ఊరట కలిగిస్తాయని, దీర్ఘకాలిక శాంతికి దోహదపడ తాయని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం నెతన్యాహూ బలమైన నాయకత్వానికి అద్దం పట్టిందని కొనియాడారు. తన రాజకీయ అవసరాల కోసం, పదవిని కాపాడుకోవడం కోసం చిన్నారులు, మహిళలుసహా 70 వేల మందికిపైగా పాలస్తీనియన్లను బలిగొన్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును ప్రధాని మోడీ ప్రశంసించడం గమనార్హం.ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. గాజాలో కాల్పుల విరమణ జరపాలని, తన వద్ద బందీలుగా ఉన్న వారిని హమాస్ తక్షణమే విడుదల చేయాలని, నిరాటంకంగా మానవతా సాయాన్ని అందిం చాలని కోరుతూ ఈ ఏడాది ప్రారంభంలో ప్రతిపాదించిన తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితిలో మూడో వంతు సభ్యులు సమర్థించగా, భారత్ గైర్హాజరైంది. ప్రత్యక్ష చర్చల ద్వారానే శాంతి నెలకొంటుందని అభిప్రాయపడింది. ఇకపోతే ఇజ్రాయిల్, హమాస్ ఆమోదించిన శాంతి ప్రణాళిక తొలి దశలో భాగంగా హమాస్ 20 మంది బందీలను విడుదల చేస్తుంది. చనిపోయిన 27 మంది మృతదేహాలు కూడా అప్పగిస్తుంది. అటు ఇజ్రాయిల్ చెరలో ఉన్న రెండు వేల మంది పాలస్తీనా ఖైదీలు కూడా విడుదలవుతారు. ఇజ్రాయిల్ విడుదల చేయాల్సిన ఖైదీల జాబితాను ఇప్పటికే హమాస్ అందజేసింది. బలమైన, సుస్థిరమైన, దీర్ఘకాలిక శాంతి స్థాపన దిశలో తొలి చర్యగా ఇజ్రాయిల్ గాజా నుండి తన దళాలను ఉపసంహరించు కుంటుందన్నారు. మధ్యవర్తిత్వం నెరపిన ఖతార్, ఈజిప్ట్, టర్కీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్యం÷-ర కల్పించేందుకు కట్టుబడి వున్నామని హమాస్ పునరుద్ఘాటించింది. పాలస్తీనా వాసుల త్యాగాలు వృథా పోవని పేర్కొంది. మధ్యవర్తులకు, ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపింది. ఇది ఇజ్రాయిల్‌కు గొప్ప రోజని ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ వ్యాఖ్యానించారు. ఒప్పందం కుదరడంలో కీలక పాత్ర పోషించిన ట్రంప్‌నకు ధన్యవాదాలు తెలిపారు. గాజాలో శాంతి ఒప్పందం కుదిర్చేందుకు అమెరికా, ఖతార్, ఈజిప్ట్, టర్కీ దేశాల మధ్యవర్తిత్వ ప్రయత్నాలను ఐక్యరాజ్య సమితి (యుఎన్‌ఒ) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కొనియాడారు. ఒప్పందాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ఐక్యరాజ్య సమితి మద్దతు ఇస్తుందని, మానవతా సాయాన్ని పర్యవేక్షిస్తుందని ఆయన తెలిపారు. మొత్తంగా గాజాలో శాంతిని అందరూ కోరుకుంటున్నారు. గాజాను అడ్డం పెట్టుకుని ట్రంప్ మాత్రం నోబెల్ బహుమతి కోరుకుంటున్నారు.

# ఓట్ల చోరీలో జాతీయ పార్టీలు




కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్‌గాంధీ 'రాజ్యాంగాన్ని సంరక్షిస్తా', 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తా' అని చెప్తూ రాజ్యాంగ ప్రతిని చేతుల్లో పట్టుకొని దేశమంతా కలియతిరుగుతున్నారు. కేంద్రంలోని అధికార బీజేపీ ఓటుచోరీకి పాల్పడుతున్నదని, లోక్‌సభ ఎన్నికలతోపాటు వివిధ రాష్ట్రాల్లో ఆ పార్టీ ఈ విధంగానే గెలుస్తున్నదని ఆయన గత కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. కేంద్రం చెప్పుచేతల్లో ఎలక్షన్ కమిషన్ పని చేస్తున్నదని, బీజేపీకి అనుబంధంగా మరో మోర్చాగా మారిపోయిందని కూడా రాహుల్ ఆరోపిస్తున్నారు. అయితే, దేశమంతా శోధిస్తూ, అధ్యయనాలు చేస్తూ బీజేపీ చేస్తున్న ఓటుచోరీని బయటపెడుతున్న ఆయనకు తెలంగాణలో అధికారంలో ఉన్న సొంత పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఓటు చోరీ కానరాకపోవడం ఓ వింత. సొంత పార్టీ నేతలు చేసే ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు మాత్రం ఆయనకు కనిపించకపోవడం విడ్డూరం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఓటరు గుర్తింపు కార్డులు పంచిపెట్టడంపై రాహుల్‌గాంధీ ఇప్పటివరకు కనీసం స్పందించలేదు. సొంత పార్టీ చేస్తున్న ఉల్లంఘనలపై ఆయన నోరు ఎందుకు మూతబడిందో సమాధానం చెప్పాలి. ప్రజాపాలనకు మారుపేరుగా కాంగ్రెస్ పార్టీ గొప్పగా చెప్పుకొంటున్న ఇందిరాగాంధీ హయాం నుంచే దేశం లో ఎన్నికల కమిషన్ భ్రష్టుపట్టిపోయింది. ఆ తర్వాత వచ్చిన రాజీవ్‌గాంధీ, ఇతర కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ దుష్ట సంప్రదాయాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లాయి. ఇప్పుడు నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ పాలన లో ఎన్నికల కమిషన్ ప్రతిష్ఠ మరింత దిగజారింది. ఎన్నికల కమిషన్‌లో పారదర్శకత లోపించిందని, అదొ క బీజేపీ అనుబంధ సంస్థగా మారిపోయిందన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతుండటమే అందుకు నిదర్శనం. ఇలాంటి తరుణంలో ఓటు చోరీపై ఉద్య మం చేస్తున్న రాహుల్‌గాంధీ.. ఓటర్లకు గుర్తింపు కార్డులను ఎన్నికల కమిషన్ తన యంత్రాం గం ద్వారా స్వయంగా పంపిణీ చేస్తుంది. రిప్రెజెంటేషన్ ఆఫ్ ది పీపుల్ యాక్ట్-1950లోని సెక్షన్ 23 ప్రకారం.. ఓటరు గుర్తింపు కార్డులను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో), లేదా బీఎల్వోల ద్వారా సంబంధిత ఓటర్లకు నేరుగా అందించాలి. ప్రైవేట్ వ్యక్తులు, పార్టీలు లేదా ఇతర సంస్థలు వీటిని పంపిణీ చేయడానికి అనుమతి ఉండదు. అలా పంపిణీ చేయ డం ఎన్నికల నియమావళి ప్రకారం నేరంగా పరిగణిస్తారు. పైగా ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో నవీన్ యాదవ్ ఓటర్ కార్డులను పంపిణీ చేయడం కండక్ట్ ఆఫ్ ఎలక్షన్స్ రూల్స్-1961, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) ఉల్లంఘన అవుతుంది. అంతేకాదు, అధికార పార్టీ అభ్యర్థి స్వయానా కార్డులు పంపిణీ చేయడమంటే ఓటర్లపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఒక విధంగా ఇది ఓటర్ల ను ప్రలోభాలకు గురిచేయడమే. ఓటరు కార్డులను పంచడం ద్వారా నవీన్ యాదవ్ రిప్రెజెంటేషన్ ఆఫ్ ది పీపుల్ యాక్ట్, 1950లోని సెక్షన్ 23బీ ఇండియన్ పీనల్ కోడ్- సెక్షన్ 420 (ఓటర్లను మోసం చేసి కార్డులు పంచడం)బీ రిప్రెజెంటేషన్ ఆఫ్ ది పీపుల్ యాక్ట్ 1951లోని సెక్షన్ 128 (ఓటర్ గుర్తింపు కార్డు వంటి అధికారిక గుర్తింపు కార్డులను అనధికారికంగా ఉపయోగించడం) తదితర చట్టాల ఉల్లంఘనకు పాల్పడ్డారు. వాస్తవానికి ఓటర్ ఐడీ కార్డులను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచి సంబంధిత ఓటరు నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అయితే, అలా చేయాలంటే ఓటరు ఫోన్ నెంబర్‌కు వచ్చిన ఓటీపీని నిర్ధారించాల్సి ఉంటుంది. ఇంత పెద్ద తతంగముండగా, 200-300 మంది ఓటరు గుర్తింపు కార్డులు నవీన్ యాదవ్ చేతికి ఎలా వచ్చాయి? ఓటర్ల ఫోన్ నంబర్, ఓటీపీ లేకుండా ఎలా డౌన్‌లోడ్ చేశారు? ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేశారా? ఎన్నికల కమిషన్ అధికారులే సహకరించారా? లేదా జాతీయస్థాయిలో రాహుల్‌గాంధీ పోరాడుతున్న బోగస్ ఓట్లను ఇక్కడి కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహిస్తున్నదా? అన్నది దర్యాప్తు జరిపి నిగ్గుతేల్చాలి. నాలుగైదు రోజుల కిందటే నవీన్ యాదవ్ ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఆ విషయాన్ని ఆయన అనుచరగణం సగర్వంగా సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. పలు పత్రికల్లోనూ ఈ విషయమై వార్తలు వచ్చాయి. కాలయాపన చేయకుండా, తూతూమంత్రంగా విచారణ జరిపి చేతులు దులుపుకోకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. ఎన్నికల చట్టాలు, నియమాలను ఉల్లంఘించిన నవీన్ యాదవ్‌ను రిప్రెజెంటేషన్ ఆఫ్ ది పీపుల్ యాక్ట్-1951లోని సెక్షన్ 8 ప్రకారం ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుడిగా ప్రకటించాలి. బీజేపీ ఓటు చోరీపై పోరాటం చేస్తున్న రాహుల్‌గాంధీ.. తెలంగాణలో కాంగ్రెస్ చేస్తున్న ఈ రకం ఓటుచోరీపై వెంటనే స్పందించాలి. తమ పార్టీ నేత చేసిన తప్పును అంగీకరించి, సదరు నాయకుడిపై చర్యలు తీసుకోవాలి. పోటీ నుంచి తప్పించి తన నిజాయితీని చాటుకోవాలి. అప్పుడే ఆయన పోరాటానికి విలువ ఉంటుంది.

## చెరువులో దూకి బిజెపి కార్యకర్త ఆత్మహత్య

యాదాద్రి భువనగిరి,అక్టోబర్10 : యాదాద్రి జిల్లాలో ఓ బీజేపీ కార్యకర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బీబీనగర్ పెద్ద చెరువులో దూకి ఉప్పల్ కు చెందిన బీజేపీ కార్యకర్త రెవల్లి రాజు ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఈ ఆత్మహత్యకు గల కారణం అతను తన తల్లిని కొట్టడమే. కుటుంబంలో తలెత్తిన వివాదం కారణంగా రాజు తల్లిపై భౌతిక దాడికి పాల్పడ్డాడు. తన తల్లి కొట్టొద్దని వేడుకున్నా సరే విచక్షణ కోల్పోయి తల్లిని చెంప మీద కొట్టాడు. కాలితో తన్నాడు. అయితే ఈ సమయంలో అక్కడున్న వారు వారిస్తున్నా రాజు మాత్రం పట్టించుకోలేదు. ఈ తతాంగాన్నంతా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో క్షణాల్లోనే వైరల్ గా మారింది. వీడియో వైరల్ కావడంతో తన పరువు పోయిందని.. తాను నలుగురిలో తల ఎత్తుకుని తిరగలేనంటూ మనోవేదనకు గురయ్యాడు. సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు బీజేపీ కార్యకర్త రాజు. ఆయన మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని భువనగిరి ఏరియా హాస్పిటల్ కు తరలించారు. ఉప్పల్ పోలీస్ స్టేషన్లో మృతుడి భార్య మహిమ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## ఎసిబి దూకుడుతో ఉద్యోగుల పరేషాన్

**వలలో చిక్కిన లాలాగూడ విద్యుత్ అధికారి**

**15వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**

హైదరాబాద్,అక్టోబర్10 : తెలంగాణలో ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. అవినీతికి పాల్పడిన ప్రభుత్వ అధికారులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంటున్నారు. తాజాగా శుక్రవారం హైదరాబాద్ లాలాగూడ సబ్‌డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్ భూమిరెడ్డి సుధాకర్ రెడ్డిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రూ.15 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ సిటీ రేంజ్ యూనిట్-2 అధికారుల చేతిలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబట్టారు. సింగిల్ ఫేజ్ మీటర్ నుంచి త్రీ ఫేజ్ మీటర్ అప్‌గ్రేడ్ కోసం ఓ వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేశాడు సుధాకర్ రెడ్డి. దీంతో ఏసీబీని ఆశ్రయించాడు బాధితుడు. పక్కా ప్లాన్ ప్రకారం.. ఫిర్యాదు దారు నుంచి లంచం స్వీకరించిన వెంటనే ఏసీబీ అధికారులు నగదు స్వాధీనం చేసుకున్నారు. భూమిరెడ్డి సుధాకర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. అలాగే శుక్రవారం ఉదయం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్‌లో ఇందిరమ్మ బిల్లు శాంక్షన్ కోసం పంచాయతీ సెక్రటరీ అనిల్ 10 వేలు డిమాండ్ చేశాడు. మధురానగర్‌లో ఉండే శ్రీకాంత్ నుంచి 10 వేల రూపాయలు పంచాయతీ సెక్రటరీ తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గురువారం నల్గొండ జిల్లాలో కూడా ఏసీబీ రైడ్స్‌లో ఏకంగా తహసీల్దార్ దొరికిపోయాడు. భూమిని మ్యుటేషన్ చేసేందుకు రూ. 10 లక్షలు డిమాండ్ చేసి.. మొదటి విడత కింద రూ. 2 లక్షలు తీసుకున్న నల్గొండ జిల్లా చిట్యాల తహసీల్దార్ కృష్ణను ఏసీబీ ఆఫీసర్లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సంగతి తెలిసిందే.


## ఫిలిప్పీన్స్‌లో భారీ భూప్రకంపనలు

**సునామీ హెచ్చరికలను జారీ**

న్యూఢిల్లీ,అక్టోబర్10 : ఫిలిప్పిన్స్‌లో భారీ భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. భూ ప్రకంపనల తీవ్రత రిక్టార్ స్కేలుపై 7.4 మాగ్నిట్యూడ్‌గా నమోదు అయింది. శుక్రవారం ఉదయం ఫిలిప్పిన్స్ దేశంలోని పలు ప్రాంతాల్లో భూప్రకంపనలు వచ్చాయి. మిండనావోలోని కోస్టల్ ఏరియాలోనూ వరసగా భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వాటి తీవ్రత రిక్టార్ స్కేలుపై 2.6 మాగ్నిట్యూడ్, 4.9 మాగ్నిట్యూడ్‌గా నమోదు అయింది. భూప్రకంపనలకు ముందు 'ది పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్' ఫిలిప్పిన్స్‌కు సునామీ హెచ్చరికలను జారీ చేసింది. 10 అడుగుల మేర అలలు ఎగసిపడే అవకాశం ఉందని తెలిపింది. అయితే, భూప్రకంపనలు రావటంతో సునామీ హెచ్చరికలను ఎత్తివేసింది. ప్రస్తుతం భూప్రకంపనలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓ వీడియోలో.. భూప్రకంనల కారణంగా రోడ్డుపై ఉన్న వాహనాలు, స్థంభాలపై ఉన్న తీగలు వేగంగా ఊగుతూ ఉన్నాయి. జనం వాహనాలు ముందుకు పోనివ్వకుండా రోడ్డుపైనే నిలిపేశారు. ఫిలిప్పిన్స్‌లో భూప్రకంపనల కారణంగా ఇండోనేషియాలోని తలౌద్ ఐలాండ్స్, నార్త్ సులవేసిలలో మైనర్ సునామీలు వచ్చాయి. మైనార్ సునామీల కారణంగా అలలు 3.5 సెంటీ మీటర్ల నుంచి 17 సెంటీ మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడ్డాయి. ఈ విషయాలను ఇండోనేషియా ఎర్త్‌క్వాక్ అండ్ సునామీ సెంటర్ అధికారికంగా వెల్లడించింది.

## భక్తులకు అండగా పరమాత్ముడు!

తిరుమల : భగవంతుడు ఎల్లవేళలా తనయందు భక్తి కలిగిన వారికి ఏదో రూపంలో అండగా ఉంటూనే ఉంటారు. శరణాగతి కోరుకుంటే అభయం ఇస్తుంటాడు. భక్తితో తనను శరుణు వేడుకున్న వారికి అండగా ఉంటానని మన పురాణాలు, ఉపనిశత్తులు చెబుతున్నాయి. పురాణాలు, ఇతిహాసాల్లో ప్రహ్లాదాదులంతా ఇలాగే భక్తిని చాటారు. భగవంతుడు వారికి అండగా నిలిచాడు. అంటే భక్తికి భగవంతుడు వశమవుతాడన్నది సత్యం. ప్రతిఫలాపేక్ష లేకుండా తనను కొలువుమని గీతాచార్యుడు చెప్పాడు. ఆధునిక కాలంలోనూ ఇదే పద్ధి కొనసాగుతోంది. గుడికి వెళ్లడం భక్తితో చేయాలని అంటారు. భగవంతుని మీద పరిపూర్ణమయైన ప్రేమ కలిగి ఉండడమే భక్తి. అది అమృతానంద స్వరూపం. త్యాగరూపం మైనది అయి ఏ కోర్కెలూ లేని స్థితిలో ఉండాలి. అదే మోక్ష అని నారద భక్తి సూత్రాలు చెబుతున్నాయి. భగవద్గీతలోని 'భక్తియోగం' భక్తి తత్వాన్నీ, లక్షణాల్నీ విపులంగా తెలిపింది. శ్రీమద్భాగవతం భగవద్భక్తుల లక్షణాలను, భక్తి స్వరూపాన్నీ సవిస్తరంగా ఆవిష్కరించింది. మానవునికి క్రోధం, శోకం లాంటి ఎన్నెన్నో అనుభూతులు ఉన్నా ప్రేమ లాంటి మధురమైన అనుభూతి మరేదీ లేదు! ప్రేమ పొందడం కన్నా ప్రేమించడం ఇంకా మధురం. మానవునికి స్వతహాగా ప్రేమించే లక్షణం ఉన్నా... ఆ ప్రేమ ఒక వ్యక్తికో, ఒక వస్తువుకో మాత్రమే పరిమితమవుతుంది. అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తూ, స్వార్థభావంతో కలుషితమౌతూ, విచ్ఛిన్నమైపోతూ ఉంటుంది. దీనినుంచి బయటపడి ప్రేమతత్వాన్ని అలవర్చుకుంటే భగవంతుడు వశమవుతాడని పురాణాలు చెబుతున్నాయి. నిష్కామంగా ప్రేమించడాన్ని సాధన చెయ్యాలి. ఈ జగత్తులో భగవంతుడు సర్వవ్యాప్తి. సమష్టి రూపమైన భగవంతుని పట్ల... సాధకులు చేసే 'నిష్కామప్రేమ' అనే ఈ ఉపాసనాక్రమానికి కూడా 'భక్తి' అనేదే వ్యవహార నామం. భక్తి సార్వజనీనం, భేదరహితం కావడంవల్ల నిజమైన భక్తిలో లోపాలు ఉండవు. అనంతమైన భగవత్తత్వానికి అనంతమైన కళ్యాణ గుణాలు, రూపాలు, నామాలు ఉన్నాయి! వాటిలో రాముడు, కృష్ణుడు, శివుడు, లలిత తదితర సంపూర్ణ దేవతామూర్తుల్ని ఉపాసనా సౌలభ్యం కోసం వేద, పురాణాలు మనకు అందించాయి.



ఆధ్యాత్మికం

# వికాస్ హైస్కూల్లో మెడిసిన్ సీటు సాధించిన విద్యార్థినికి సత్కారం




**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** స్థానిక వికాస్ హై స్కూల్ పూర్వ విద్యార్థిని పోగు ప్రణీత నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడిసిన్ సాధించింది. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని వికాస్ హై స్కూల్ లో మెడిసిన్ సాధించిన విద్యార్థిని ప్రణీతను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించారు. పెద్దవంగర మండలం పోచారం గ్రామానికి చెందిన పోగు యమున- భాస్కర్ దంపతుల కుమార్తె పోగు ప్రణీత నీట్ లో 429 మార్కులతో 2801 ర్యాంకు సాధించింది. మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు పొందింది. వికాస్ పాఠశాలలో 3 నుండి 10 తరగతి వరకు చదువగా, ఇంటర్ హైదరాబాదులోని శ్రీ చైతన్య కళాశాలలో పూర్తి చేసింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ మాట్లాడుతూ.... వికాస్ హై స్కూల్ లో చదివిన ప్రణీత మెడిసిన్ సీటు సాధించడం అభినందనీ యమన్నారు. విద్యార్థులకు వికాస్ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని, భవిష్యత్తు లక్ష్యాలను సాధించడానికి పాఠశాల వేదికగా నిలుస్తుంది అని తెలిపారు. విద్యార్థులు లక్ష్యసాధనకు అంకితభావంతో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి నారాయణ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రేగురి వెంకన్న, డైరెక్టర్లు కె.వి.రెడ్డి, విజయ భాస్కర్, ప్రిన్సిపల్ లు వేణుమాధవ్, నాగరాజు,అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

**-పంటలు చేతికి వచ్చిన యూరియా అందించలేని ప్రభుత్వాలు: సిపియం**




**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్: 10(ది క్రైమ్ న్యూస్ ):** ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు ప్రత్తి, వరి,మిరప,మొక్క జొన్న పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి.శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల.సత్యవతి లు డిమాండ్ చేశారు.స్థానిక మంగపతిరావు భవనంలో జి.రాజారావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని, ఉన్న కొద్ది పంట లైన చేతికి వస్తున్నాయనుకుంటున్న తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత కారణంగా యూరియా కొరత ఉండటంతో పంటలకు సకాలంలో వేయాల్సిన యూరియా లేక పంటలు మరింత దెబ్బతిన్నాయని, ఇప్పటికైనా యూరియాను సకాలంలో పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నిబంధనలతో లబ్ధిదారులు నష్టపోయే ప్రమాదం ఉందని,ఇండ్ల నిర్మాణం లో నిబంధనలు సడలించాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఎం నాయకులు కె.ఈశ్వర్ లింగం, వి.వెంకటేశ్వర్లు, ఐ.గోవింద్, య. నాగమణి, సిహెచ్. ఎల్లయ్య, బి.ఉపేందర్ రెడ్డి, డి. కై బాబు, బి. లోకేశ్వరావు, సిహెచ్.మౌనిక, ఎ.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

# సీజేఐ పై దాడి అమానుషం

**- అంబేద్కర్ యువజన సంఘము పెద్దపల్లి జిల్లా నాయకులు అంబాల కుమార్**



**(ది క్రైమ్ న్యూస్) బ్యూరో:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై దాడి అమానుషమని అంబేద్కర్ యువజన సంఘము పెద్దపల్లి జిల్లా నాయకులు అంబాల.కుమార్ అన్నారు. ఈ మేరకు శు క్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగ విలువలను అవమానపరిచే విధంగా సీజేఐ గవాయిపై చేసిన దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. సనాతన హిందూ ధర్మం పేరుతో మతోన్మాద అడ్వకేట్ రాకేష్ కిషోర్ సుప్రీంకోర్టు ప్రాంగణంలోనే సీజేఐ గవాయ్ పై పాదరక్ష విసరడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇది కేవలం వ్యక్తిగత దాడి కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ పునాదులపై జరిగిన దాడి అని తెలిపారు. ఈ ఘటన వెనుక హిందూ మతోన్మాద శక్తుల హస్తం స్పష్టంగా కనిపిస్తోందని సంఘ్ పరివార్ ఆశ్రయంతో వీరిని పెంచిపోషిస్తోందని ఆరోపించారు. సనాతన ధర్మాన్ని తామే కాపాడుతున్నామని చెప్పుకునే జస్టిస్ గవాయ్ పై ఆర్ ఎస్ ఎస్ ముసుగులో ఉన్న అరాచక న్యాయవాది రాకేష్ కిషోర్ తన బూటు విసిరి దాడికి పాల్పడినాడని, ఇది ఆర్ఎస్ఎస్ పథకం ప్రకారం చేసిన దాడి అని అన్నారు. ఈ దాడులు కేవలం జస్టిస్ గవాయ్ పైన మాత్రమే కాదు, భారతదేశపు రాజ్యాంగం, స్వతంత్ర న్యాయ వ్యవస్థ, ప్రజాస్వామ్య విలువలపైన జరుగుతున్న దాడులుగానే భావించాల్సి ఉంటుందని అన్నారు. తక్షణమే సుప్రీంకోర్టు న్యాయవాది రాకేష్ కిషోర్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# సెపక్ తక్రా రాష్ట్ర స్థాయి పోటీలకై ఎంపిక పోటీలు



**మానకొండూర్, అక్టోబర్10(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికకై గురువారం పోటీలు నిర్వహించారు. ఈనెల 11,12 తేదీల్లో ఆసిఫాబాద్ జిల్లా గోలేటి టౌన్షిప్ లో నిర్వహించే సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగిందని ఉమ్మడి జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ సెక్రటరీ గన్ను విజయభాస్కర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ కరుణాకర్ రెడ్డి తెలిపారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులకు జస్బీర్ సింగ్, తమ్మిశెట్టి రాజేష్ టీషర్ట్లు పంపిణీ చేశారు. సీనియర్ క్రీడాకారులైన పిఈటిలు గొల్లెన కుమార్,శ్రీను, అజయ్ సుమన్, శ్రీకాంత్ పోటీలనిర్వహణలో పాల్గొన్నారు.

# తడిగుడ్డతో గొంతు కోయడం కాంగ్రెస్ పార్టీ నైజం

- తెలంగాణ బిసి బిడ్డలకు కాంగ్రెస్ నమ్మితే నట్టేట ముంచారు
- రాజ్యాంగంలోని 9 వ షెడ్యూల్లో చేర్చితేనే రిజర్వేషన్లకు చట్టబద్ధత
- ఆరు గ్యారంటీల తరహాలోనే 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు
- కాంగ్రెస్ నేతలను బిసి బిడ్డలు నిలదీయాలి
- రామగుండం మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తడిగుడ్డతో గొంతు కోయడం నమ్మించి నట్టేట నిలువునా ముంచడం నమ్మి ఓట్లేసిన బీసీ బిడ్డలకు కాంగ్రెస్ ధోకా ఇది నమ్మకద్రోహానికి విశ్వాసఘాతుకానికి పాల్పడిన రేవంత్ ప్రభుత్వం ఇపుడు బీసీలను దగా చేసిన సర్కారుగా సమాజం ముందు నిలబడిందని అవగాహన రాహిత్యంతో అసమర్థ సర్కారుగా తనకు తానే ప్రకటించుకున్నదని ఇది కాంగ్రెస్ పార్టీ నయవంచన అని రామగుండం మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం ఆయన మాట్లాడుతూ నాడు అధికారం కోసం బీసీ వాదాన్ని ఎత్తుకున్న కాంగ్రెస్, నేడు నమ్మించి మోసం చేసిందని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై 22 నెలలుగా మసిబూసిమారేడు కాయ చేసి నిండా ముంచిందన్నారు. ఆరు గ్యారంటీల తరహాలోనే 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతుందని మండిపడ్డారు. మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో బీసీలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ లబ్ధి పొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం, 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్ట బద్దత కోసం కేంద్రాన్ని పట్టుబట్టాల్సిన రేవంత్‌రెడ్డి తెలివిగా దాన్ని పక్క దోవ పట్టించారని.. బీసీల పట్ల తమకు నిజంగానే ప్రేమ ఉన్నట్లు చాటుకునేందుకు తూతూ మంత్రంగా జీవో ఇచ్చి కొత్త నాటకానికి తెరతీశారని స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేశారన్నారు. రిజర్వేషన్లు 50 శాతం దాటకుండా సుప్రీంకోర్టు పరిమితి ఉందని, కేంద్రం వద్ద బిల్లు క్లియర్ కాదని తెలిసి 42 శాతం బీసీ బిల్లు పేరుతో రేవంత్ ప్రభుత్వం డ్రామాలాడిందని, రాజ్యాంగ సవరణ లేకుండా అసెంబ్లీ తీర్మానబంతో కోటారాదని విపక్షాలు విద్యావంతులు చెప్పిమ వినకుండా ఎన్నికల నోటిఫికేషన్ దాకా తెచ్చి చివరకు కోర్టు ముందు చేతులెత్తేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా బీసీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే 42శాతం పెంపు విషయమై ఢిల్లీలో కొట్లాడాలని చెప్పారు. పార్లమెంట్‌లో చట్టం చేయించి, షెడ్యూల్ 9లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ విలేఖరుల సమావేశం లో నాయకులు గోపు అయులయ్య యాదవ్ మాజీ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు బోడ్డు రవీందర్ కల్వచర్ల కృష్ణ వేణీ, నారాయణదాసు మారుతి నూతి తిరుపతి మేతుకు దేవరాజ్ చల్లా రవీందర్ రెడ్డి మేడి సదానందం పిల్లి రమేష్ తోకల రమేష్ సట్టు శ్రీనివాస్ బండారి ప్రవీన్ ఆర్శనపల్లి శ్రీనివాస్ యాసర్ల తిమ్మెతి వెంకటేష్ ముద్దాసాని సంధ్యా రెడ్డి సాయి కుమార్ (చింటూ) కొడి రామకృష్ణ ఆవునూరి వెంకటేష్ బచ్చాల రాములు గుర్రం పద్మ ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లకు రెడ్డిలే అడ్డు

- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కందుల సదాశివ్




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు జనాభా దమాషా ప్రకారం దక్కాలిసిన రిజర్వేషన్లు దక్కకుండా అడ్డుపుడుతున్నది రెడ్డిలేనని బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కందుల సదాశివ్ అన్నారు.శుక్రవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లు పై స్టే వచ్చేలా రెడ్డి సంఘం నాయకులు బీసీలకు వ్యతిరేకంగా కోర్ట్ కేసులు వేశారన్నారు. హైకోర్టు లో కేసుల వేసిన రెడ్డి నాయకులకు డబ్బులు పంపింది, ఈ కేసుల వెనుక ఉన్నది రెడ్డి రాజకీయ నాయకులేనన్నారు. అందుకే రెడ్డి కులం నాయకులు కనీసం బీసీల తరపున సానుభూతిని ప్రకటించలేదని విమర్శించారు. అందుకే ఇకనుంచి ఎన్నికలలో పోటీచేసే రెడ్డి రాజకీయ నాయకులకు బీసీలను ఓట్లు అడిగే హక్కు లేదని, బీసీలం అందరం కలిసి రెడ్లకు రాజకీయ సమాధి కట్టాలని పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా కమిటీ నుంచి బీసీ అన్నదమ్ములకు,అక్క చెల్లెళ్లకు చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నాం, అగ్ర కులాల్లో ,ఉన్న బ్రాహ్మణులు, వైశ్యులు, వెలమలు, కమ్మలు, ఇతర అగ్ర కులాలు ఎవ్వరు, బీసీలపై వెయ్యని కేసులు రెడ్లే ఎందుకు వేశారో ఆలోచించాలన్నారు. కేవలం ఒక్క సామాజికవర్గంకి చెందిన వారు చేసే కుట్రలను బీసీలం అందరం గుర్తించి ఎన్నిక ఏదైనా బీసీలు రెడ్లకు ఓటు వేయకుండా బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ నాయకులు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ గారికి 42% బీసీ రిజర్వేషన్ల బిల్లును అమోదింపచేసేందుకు ఒక్కసారి కూడా ప్రయత్నించలేదని, పైగా కొంతమంది ఆ పార్టీ కి చెందిన రెడ్డి నాయకులు బీసీలకు వ్యతిరేకంగా తెరచాటుగా పని చేసారని విమర్శించారు. బీసీ ద్రోహుల పేర్లు త్వరలోనే బహిరంగగా ప్రకటించి వారిని సామాజికంగా బహిష్కరణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ చర్లపల్లి సురేష్ గౌడ్, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల అశోక్ పటేల్, పెద్దపల్లి మండల అధ్యక్షుడు సింగారపు రవికుమార్ యాదవ్, ఓదెల మండల అధ్యక్షుడు ఉప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థులపై ఫీజుల భారాన్ని తగ్గించాలి

- ఫీజులు తగ్గించకపోతే ఆందోళన చేపడుతాం..
- పి డి ఎస్ యూ రాష్ట్ర నాయకుడు మునగాల మహేష్ కుమార్




**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 (ది క్రైమ్ న్యూస్):-** కేయూ పరిధిలో డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ విద్యార్థులకు భారీగా పెంచిన వివిధ రకాల ఫీజులను తగ్గించాలని పి డి యస్ యూ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు ధర్నా నిర్వహించారు ఈ ధర్నాను ఉద్దేశించి పి డి ఎస్ యూ తెలంగాణ రాష్ట్ర నాయకుడు మునగాల మహేష్ కుమార్ మాట్లాడుతూ... కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్,ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలలో డిగ్రీ కోర్సులు 2025-26 ప్రవేశాలు పొందిన ఫస్ట్ ఇయర్ మొదటి సెమిస్టర్ విద్యార్థులకు వివిధ రకాల ఫీజులను ప్రభుత్వం భారీగా పెంచి పేద విద్యార్థులపై భారాన్ని మోపింది అని అన్నారు. ఒక్కో విద్యార్థికి రిజిస్ట్రేషన్ ఫీజు గతంలో 80 ఉండగా ఇప్పుడు 1200 రూపాయలకు పెంచారు. రికగ్నేషన్ ఫీజు గతంలో 400 ఉండగా ఇప్పుడు 800 కు ఐ యు డి ఎఫ్ ఫీజు గతంలో 60 ఉండగా ఇప్పుడు 300 కు ఎస్ డబ్ల్యు ఎఫ్ ఫీజు గతంలో 50 ఉండగా ఇప్పుడు 200 కు పెంపుదల చేసి విద్యార్థులపై తీవ్ర భారాన్ని మోపారు. ఒక్క పరీక్ష ఫీజు మాత్రమే 750 గతంలో మాదిరిగానే యధావిదంగా కొనసాగిస్తున్నారు.గతంలో ఒక్కొక్క విద్యార్థి ఆయా అన్ని రకాల ఫీజుల కింద 1340 చెల్లించేవారు.ఇప్పుడు ఏకంగా ఆ ఫీజులు అన్ని కలిపి 3,250 కి పెంపుదల చేశారు.గతం కంటే ఒకేసారి ఒక్కో విద్యార్థిపై 1910 రూపాయలు ఫీజు భారం పడుతుంది. ఒకేసారి ఇంత భారీ మొత్తంలో పెంచిన ఫీజులతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, పేద విద్యార్థులు ఏమాత్రం కట్టలేనటువంటి ఫీజుల భారాన్ని విద్యార్థులపై ప్రభుత్వం మోపడం సరికాదని తక్షణమే ప్రభుత్వం పున:ర ఆలోచించి ఫీజుల భారం తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ నాయకులు షేక్ షబ్బీర్, మనోహర్, బిక్షం, నికిత, సంధ్య, శ్రావణి, వేణు, తరుణ్ డిగ్రీ కళాశాల కమిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

# 90 రోజుల మధ్యవర్తిత్వ క్యాంపెయిన్ విజయవంతం

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ**



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 (ది క్రైమ్ న్యూస్):** భారత సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన 90 రోజుల మీడియేషన్ క్యాంపెయిన్ మెహబూబాబాద్ జిల్లాలో విజయవంతం అయినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ శు క్రవారం ప్రకటించారు. ఈ 90 రోజులలో జిల్లాలోని వివిధ న్యాయస్థానాలు మొత్తం 56 కేసులను మధ్యవర్తిత్వానికి నివేదించగా అందులో 14 కేసులు ఇరుపక్షాల రాజీతో పరిష్కారమయ్యాయి. వివిధ కోర్టులలో పెండింగ్లో ఉన్న కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం కూడా ఒక ప్రత్యామ్నాయ వేదిక అని కక్షిదారులకు తెలియజేయుటంలో ఈ క్యాంపెయిన్ సఫలీకృతమైనదని ఆయన అన్నారు. ఈ క్యాంపెయిన్ లో భాగంగానే కక్షిదారులకు మరియు ప్రజలకు మీడియేషన్ ప్రాధాన్యతను వివరించటానికి గాను న్యాయ సేవ సదన్ ముందు ఒక సూచి బోర్డును ఆవిష్కరించడం జరిగిందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన న్యాయవాదులు వై. చిన్న మల్లారెడ్డి, బి. కృష్ణ, డి చిన్న మహేందర్, వి సుభాష్, వి హరికృష్ణ, ఆర్ రఘునాధ రావు, టి సైదులు, బి శ్రీనివాస్ లు మధ్యవర్తిత్వ కేంద్రం ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. 90 రోజుల క్యాంపెయిన్ విజయవంతం కావడానికి సహకరించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలియజేశారు. మధ్యవర్తిత్వ కేంద్రం ద్వారా పరిష్కార ప్రక్రియ ఇక ముందు కూడా కొనసాగుతుందని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి కోరారు.

# ఓ.సి.పి -వన్ వర్క్‌షాప్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం

**- సమస్యల పరిష్కారానికి బలమైన వేదికగా యూనియన్ ఉండాలి - సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి**



**రామగిరి, అక్టోబర్ 10(ది క్రైమ్ న్యూస్):-** సింగరేణి క్యాలరీస్ లేబర్ యూనియన్ (ఐఎన్టీయూసీ) ఆధ్వర్యంలో ఓ.సి.పి -వన్ వర్క్‌షాప్‌లో సభ్యత్వ నమోదుకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమం ముఖ్య అధితిగా విచ్చేసిన సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ ధర్మపురి నేతృత్వంలో జరిగింది. అనంతరం మాట్లాడుతూ సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఐఎన్టియుసి యూనియన్ నిరంతరం కృషి చేస్తోంది. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా కార్మికుల సంఘటిత శక్తిని మరింత పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాము. ప్రతి కార్మికుడికి అర్హతైన ప్రతినిధిత్వం అందించేందుకు, సమస్యల పరిష్కారానికి బలమైన వేదికగా ఐఎన్టియుసి యూనియన్ నిలుస్తుంది. యువ కార్మికులు ముందుకు వచ్చి సంఘంలో చురుకుగా పాల్గొనాలి. సమష్టిగా పోరాడితేనే విజయం సాధ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్చి-త్రీ ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి,సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వడ్డేపల్లి దాస్, సెంట్రల్ కార్యదర్శి గడ్డం తిరుపతి, మైన్ పీట్ సెక్రటరీ సదానందం, వెంకటస్వామి, ప్రవీణ్ రెడ్డి, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ డిక్లరేషన్ పేరుతో మోసం చేసిన రేవంత్ సర్కార్

◆ బీసీ మంత్రులై సీఎం..మంత్రి దుద్దిళ్ల కు వత్తాసు పలుకుడా ◆ రిజర్వేషన్ లేటైనా డిక్లరేషన్ అంశాలు అమలు చేయచ్చుగా
◆ రాబోయే రోజుల్లో బీసీలతోనే కాంగ్రెస్‌కు భూస్థాపితం తప్పదు ◆ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**రామగిరి, అక్టోబర్ 10(ది క్రైమ్ న్యూస్):-** బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లతో పాటు మానీఫెస్టోను రాసిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ అనాడు కల్లు తాగి మానీఫెస్టో రాసి ఉండవచ్చని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. శుక్రవారం మంథని పట్టణంలోని పూలే చౌక్ లోని మహాత్మా జ్యోతిరావు పూలే పాదాలకు పూలు వేసి నివాళులు అర్పించి అనంతరం మీడియా తో ఆయన మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్‌లను 42శాతం ఇస్తామని ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్‌పేరుతో గొప్పగా కామారెడ్డిలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ద రామయ్య తీసుకువచ్చి సభ నిర్వహించి అనేక విషయాలను ప్రకటించారన్నారు. ఒక్క బీసీ డిక్లరేషన్ 42శాతమే కాదు అనేక విషయాలను పొందుపర్చారని ఆ మానీఫెస్టోకు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ చైర్మన్ అయితే రేవంత్‌రెడ్డి నాయకుడని అన్నారు. అయితే ఇప్పటి వరకు మానీఫెస్టో అమలు కాకపోవడాన్ని చూస్తుంటే కల్లు తాగి మానీఫెస్టో రాసిండా అనే అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. బీసీ డిక్లరేషన్‌లో 42శాతం రిజర్వేషన్‌లు ఆరు నెలల్లోనే పెంచుతామని చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు., రిజర్వేషన్‌ల విషయంలో అనేక ఆంక్షలు ఉండవచ్చని, రాజ్యాంగ బద్దంగా ఆలస్యం కావచ్చన్నారు. కానీ ఆరు నెలలలో ఎందుకు ప్రయత్నం చేయలేదని ఆయన ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్‌లో ప్రభుత్వ సివిల్ కాంట్రాక్టుల్లో 42శాతం రిజర్వేషన్‌లు, బీసీ చిరు వ్యాపారులకు వ్యాపారాలు చేసుకునేందుకు రూ. 10లక్షల వడ్డీలేని రుణాలు ఇస్తామని చెప్పి 22నెలలైనా ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు, కేవలం ఇటు ప్రజలను అటు బీసీలను మోసం చేయడానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌లు కుట్ర చేశారన్నారు. అంతేకాకుండా జనగామ జిల్లాకు సర్వాయి సర్ధార్ పాపన్న పేరు పెడుతామని చెప్పిండ్లని, కానీ పీసీసీ అధ్యక్షులుగా ఉన్న మహేష్‌కుమార్ గౌడ్ మాత్రం ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గౌడ్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. అంటే బీసీలు అయామకులు, తెలివితక్కువ వాళ్లని గ్రహించిన కాంగ్రెస్ 78ఏండ్ల తర్వాత కూడా భయపడకుండా రాజ్యం ఏలుతున్నారని అన్నారు. ఆనాడు సీఎం కేసీఆర్ హాయాంలో గౌడలకు మద్యం షాపుల్లో 15శాతం రిజర్వేషన్‌లు ఇచ్చారని, ప్రస్తుతం 25శాతం ఇస్తామని గొప్పలు చెప్పిండ్లే కానీ ఎక్కడా అమలు చేయలేదనే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. అంతేకాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ హాయాంలో మంథని ఎమ్మెల్యేగా ప్రతిపక్షంలో ఉన్న దుద్దిళ్ల శ్రీధర్ తనను సాధించాలని బీసీలను ఉసి గొల్పాలనే ఆలోచనతో మున్నూరు కాపు కార్పోరేషన్ కోరుకుంటున్నారని అన్నాడే తప్ప కావాలని చెప్పలేదన్నారు. అయినా బీసీ నాయకులు మాసారు గొప్పోడంటూ పాలాభిషేకాలు, సన్మానాలు చేశారన్నారు. కులగణన గొప్పగా చేశామని బీహార్‌లో చెప్పుకుంటూ అక్కడి ప్రజలను మోసం చేస్తున్నారని, కర్ణాటక, అస్సాం, తెలంగాణాలో మోసం చేస్తే మహారాష్ట్ర, హరియాణాలో ముఖం చెల్లని కాంగ్రెస్ ప్రస్తుతం బీహార్‌ను మోసం చేయాలని చూస్తుందన్నారు. ఆనాడు అర్డినెన్స్ తీసినం సరిపోతదని చెప్పి మళ్లీ గవర్నర్ దగ్గర ఉందన్నారని, మళ్లీ అది సరిపోతలేదని అసెంబ్లీలో బిల్లుపెట్టి ఇది పక్కగా ఉందని మంథని ఎమ్మెల్యే మాట్లాడినట్లు ఆయన గుర్తు చేశారు. అసెంబ్లీల్లో ఒక్కో మంత్రి ఒక్కో విదంగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. ఆరు నెలల్లో బీసీ డిక్లరేషన్ 42శాతం రిజర్వేషన్‌లు ఇస్తామని 22నెలలైనా అతీగతీ లేదని ఆయన విమర్శించారు. ఇంత పెద్ద బీసీ సమాజాన్ని చులకనగా చూస్తున్నారంటే అందుకు దుద్దిళ్ల





శ్రీధర్ కారణమన్నారు. మూడు ఓట్లు ఉన్న కుటుంబం ఈ సమాజాన్ని మాయచేసి వాడుకుంటుందని, ఎదిగిన వాళ్లను అణిచివేస్తూ అధికారం చేజిక్కించుకున్నారని అన్నారు. అయితే బీసీ సామాజికవర్గానికి చెందిన వారు మంత్రులుగా ఉండి కూడా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌లకు వత్తాసు పలుకడం ఏంటని ఆయన ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్‌పై ఎవరూ కోర్టుకు వెళ్లవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పితే రేవంత్‌రెడ్డితో ఉండే వ్యక్తి కోర్టుకు పోయాడని, ఈ విషయంపై మంత్రి పొన్నం ఎందుకు మాట్లాడటం లేదన్నారు. చట్టాలు, మానీఫెస్టోలు తయారు చేస్తూ గొప్పోళ్లుగా కీర్తించబడుతుంటే మంత్రులై ఉండి కోర్టుకు పోయి అబాసుపాలు అవుతారా అని అన్నారు. రిజర్వేషన్‌లో ఆలస్యం అయినా మిగిలిన అంశాలను అమలు చేయచ్చు కదా అనిప్రశ్నించారు. ప్రభుత్వ కాంట్రాక్ట్‌లో రిజర్వేషన్, బ్రాండి షాపులో 25శాతం కు ఇబ్బంది ఏంటన్నారు. తమ మంత్రులను సైతం మోసం చేసే చరిత్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌లదే అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన డిక్లరేషన్ అంతా మోసమేనని, దుద్దిళ్ల సొంత డిక్లరేషన్ చేసుకున్నాడని ఆయన విమర్శించారు. ఆనాడు పూలేను, అంబేద్కర్‌ను ఈ సమాజానికి అర్థం కాకుండా చేసింది కాంగ్రెస్ పార్టీనేనని, అప్పటి నుంచి ఇప్పటి వరకు బీసీలను మోసం చేస్తూనే ఉందన్నారు. రాబోయే రోజుల్లో బీసీలతో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం కాకతప్పదని ఆయన హెచ్చరించారు.

# మంత్రి శ్రీధర్ బాబు తోనే అన్ని వర్గాల వారి అభివృద్ధి సాధ్యం

◆ జిల్లా ఆర్టిఏ సభ్యులు మంథని సురేష్

**రామగిరి, అక్టోబర్ 10(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతోనే అన్ని వర్గాల వారి అభివృద్ధి సాధ్యమని జిల్లా ఆర్టిఏ మెంబెర్ మంథని సురేష్ అన్నారు. శుక్రవారం మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌక్ లో నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయి బ్రాహ్మణ శాశ్వత భవన నిర్మాణం కోసం రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు రూ. 20 లక్షల మంజూరు చేయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంథని మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, నాయి బ్రాహ్మణ రాష్ట్ర నాయకులు గొల్లపల్లి రాయమల్లు, మంథని సీనియర్ నాయకులు మంథని వేణుగోపాల్, మంథని రామ్ చందర్, విష్ణుభక్తుల రఘు, మంథని రమేష్, మంథని సతీష్, విష్ణు భక్తుల భాను, మంథని లక్ష్మణ్, మంథని సాగర్, మంథని శ్రీనివాస్, మంథని కిషన్, మంథని సదాశివ్, మంథని సది, సమ్మెట చంద్రశేఖర్, మంథని సాయికుమార్, మంథని సూరి, మంథని ప్రదీప్, అద్దూరి సాయి కిరణ్, అద్దూరి చరణ్,



మంథని వంశీ, వొల్లాది లక్ష్మణ్, విష్ణు భక్తుల శరత్, సిలువేరు సతీష్, మరియు క, గోటికార్ కిషన్, ఊదరి శంకర్, రవితేజ గౌడ్, ఆరెల్లి కిరణ్ గౌడ్, అజీం ఖాన్, దోరగొర్ల శ్రీనివాస్, మంథని శ్రీనివాస్, మైనార్టీ మండల అధ్యక్షుడు హలీం, పట్టణ అధ్యక్షుడు ఏజాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంకుష్, అజీమ్ ఖాన్, జమీల్ అహ్మద్, మజీద్ కమిటీ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మెట్ పల్లిలో పోషణ మాసోత్సవం



**శంకరపట్నం, అక్టోబర్ 10(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మెట్పల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం,శుక్రవారం సభను నిర్వహించారు. జిల్లా ఉప వైద్యాధికారి వైద్యులు చందు హాజరై ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తూ 5ఏండ్ల లోపు పిల్లలకు, కిషోర బాలికల నుండి గర్భిణీ స్త్రీల వరకు పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు న్యూట్రిషన్, డైట్ విలువలను ఆహర ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. వివిధ రకాల కూరగాయలను ప్రదర్శించి వాటి ద్వారా శరీరానికి అందే పోషకాలు వాటి విలువలను తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్, ఎంఎల్హెచ్పి వైద్యురాలు మనోచిత్ర, సూపర్వైజర్ అనీల్,సరోజన, ఐసీడీఎస్ సిడిపిఓ శ్రీలత, బ్లాక్ కో-ఆర్డినేటర్ ప్రణిత, సూపర్వైజర్ పద్మ పాల్గొన్నారు.

## బీసీ వర్గాల రిజర్వేషన్ న్యాయమైన హక్కు

**- బీసీల హక్కును కాపాడుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుంది -**
**ఆర్జీ-త్రి ఏరియా ఐఎన్టియుసి సోషల్ మీడియా ఇంచార్జ్ మేకల మారుతి యాదవ్**



**రామగిరి, అక్టోబర్ 10(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ రాష్ట్రంలోని బీసీ వర్గాల పక్షాన, సమాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంది. ఈ నేపథ్యంలో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 9 పై హైకోర్టు తాత్కాలిక స్టే ఇచ్చిన విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని ఐఎన్టియుసి సోషల్ మీడియా ఇంచార్జ్ మేకల మారుతి యాదవ్ పేర్కొన్నారు. అనంతరం మాట్లాడుతూ బీసీలకు 42% రిజర్వేషన్ అనేది కేవలం రాజకీయ నిర్ణయం కాదు ఇది దశాబ్దాలుగా హక్కుల కోసం చేస్తున్న పోరాటానికి గుర్తింపు. ఈ నిర్ణయాన్ని న్యాయస్థానం తాత్కాలికంగా నిలిపివేసిన తీర్పు కొంత నిరాశ కలిగించే విషయం అయినప్పటికీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రాష్ట్ర పరిశ్రమల, ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో హైకోర్టు స్టే కు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం పూర్తి స్థాయిలో లీగల్ ప్రిపరేషన్ చేసి, అత్యవసరంగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసి బీసీలకు న్యాయం చేస్తారని నమ్మకం ఉందని, బీసీ వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.ఇది కేవలం బీసీ వర్గాల సమస్య కాదు, ఇది సమాజంలోని అన్ని సామాజికంగా వెనుకబడిన వర్గాల సమస్యను పరిష్కరించడంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు.

## బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే తో బీసీలకు తీరని అన్యాయం

**- ఈ నెల14న రాష్ట్ర బంద్‌కు మద్దతు ప్రకటించిన జాతీయ బీసీ సంఘం కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్**




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టు స్టే విధించటంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని జాతీయ బీసీ సంఘం కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జాతీయ బీసీ సంఘం ఆధ్వర్యంలో పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అఖిలపక్ష రాజకీయ పార్టీలో ప్రజాసంఘాలు, ఉద్యమ సంస్థలు, కుల సంఘాల నాయకులతో హైద్రాబాద్‌లో జరిగినటువంటి కార్యక్రమంలో ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈనెల 14న రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వటం జరిగిందని, దానికి తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. బలహీనవర్గాల అభివృద్ధి, ఆత్మగౌరవం, రాజ్యాధికారం కోసం పోరాడుతున్నటువంటి సంఘాలన్నీ ఏకతాటి మీదికి వచ్చి ఈబంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. బీసీల ఐక్యతను చాటుతూ బంద్ ద్వారా బీసీల సత్తా ఏంటో ప్రభుత్వానికి చాటాలన్నారు. బీసీలంటే ప్రభుత్వానికి చులకనగా ఉందా? ముఖ్యమంత్రి పదవులు రావు మంత్రి పదవులు ఇవ్వరు. లేకలేక సర్పంచ్, ఎంపీటీసీలుగా అవకాశం వస్తే వాటిని కూడా లాగేసుకోవడం సరికాదన్నారు.ఈ సమాజంలో బీసీల సత్తా ఏంటో బంద్ ద్వారా చూపిస్తామన్నారు. ఒక చేతితో రిజర్వేషన్లు ఇచ్చి, మరో చేతితో రెడ్డి సంఘాలతో కేసులు వేయించి ఈ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను కోర్టుల ద్వారా అడ్డుకోవాడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయమైన టువంటి బీసీల 42 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నోమురి శ్రీధర్‌రావు, రాష్ట్ర నాయకులు కోమటిపల్లి రాజేందర్‌నేత, బీసీ ఐక్య సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు బూర్ల ధనుంజయ నేత, అమీర్‌శెట్టి సంజీవ్, రవికిరణ్ తదితరలు పాల్గొన్నారు.

### రామగిరి మండల సమైక్య కార్యాలయంలో

# వ్యక్తి దారుణ హత్య



**రామగిరి, అక్టోబర్ 10(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం సెంటనరీ కాలనీ సీటు200 క్వార్టర్ నెంబర్ మండల సమైక్య ( సేర్ఫ్) కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 8 క్లైన్ కాలనీ, న్యూ మరేడు పాకకు చెందిన కోట చిరంజీవి ( 38) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మండల సమైక్య కార్యాలయంలో అకౌంటెంట్ గా పనిచేసే మహిళ కోసం మృతుడు చిరంజీవి మండల సమైక్య కార్యానికి రాగా ఇద్దరు మధ్య వాగ్వాదం చోటుచేసుకాగా మహిళ తరుపు కుటుంబ సభ్యులు వచ్చి చిరంజీవి పై దాడికి పాల్పడ్డారు. వారి వెంట తెచ్చుకున్న కత్తులు ఇనుప రాళ్లతో మృతుడు చిరంజీవిపై విచక్షణ రహితంగా దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు చిరంజీవి 8 ఇన్ కాలనీ లోనీ న్యూ మరేడ్ పాకకు, చెందిన వాడు కాగా పోతన కాలనీలో మహదేవ మీసేవ సెంటర్ నిర్వహిస్తున్నాడు. మృతుని భార్య గత కొంత కాలం క్రితం చనిపోగా ఒక కుమారుడు కూతురు కలదు. అకౌంటెంట్ గా పనిచేసే మహిళతోపాటు మరో ఇద్దరీ నీ పోలీసులు అదుపులో తీసుకున్నట్టు సమాచారం. సంఘటన స్థలాన్ని మంతిని సిఐ రాజు, రామగిరి ఎస్సై శ్రీనివాస్ పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మున్నూరు కాపు సంఘం సభ్యత్వం నమోదు కార్యక్రమం..!



**రామగిరి, అక్టోబర్ 10(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండల కేంద్రంలోని సాయిరాం గార్డెన్ లో శుక్రవారం మున్నూరు కాపు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి సభ్యత్వాన్ని కుడిది చలం కి ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమీర్ శెట్టి రామస్వామీ, జిల్లా నాయకులు జడల సురేందర్ లు అందజేశారు. ఈ సందర్భంగా పెద్దపెల్లి జిల్లాలో మున్నూరు కాపు సంఘం సభ్యత నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో అన్ని గ్రామాల్లో మున్నూరు కాపు సంఘం సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. ఈ సభ్యత నమోదు కార్యక్రమంలో కుల బాంధవులందరూ తమ పేర్లను నమోదు చేసుకొని సభ్యత్వాన్ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పుల్లెల కిరణ్, తోట చంద్రయ్య,మైదం కుమార్, చిందం రమేష్ ,రొద్డ శ్రీనివాస్, రౌతు శివ, తోట శంకర్, కాశెట్టి తిరుపతి, పుప్పాల గట్టయ్య, కొప్పుల సునీల్, కొమ్ము నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





**రామగిరి,అక్టోబర్ 10(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం రత్నాపూర్, రాంనగర్ లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శుక్రవారం పలు కుటుంబాలను పరామర్శించారు. సీనియర్ నాయకుడు జక్కుల ఆశాలు కుమారుడు ఇటీవల మృతి చెందగా, దాంక లింగయ్య భార్య ఓదెమ్మ మృతిచెందగా, ఎరుకలి లింగయ్య అత్తమ్మ పోచమ్మ మృతిచెందగా, గడ్డం సదానందం భార్య రాజేశ్వరి మృతి చెందగా, కొండపర్తి రఘురాములు భార్య కమలమ్మ మృతి చెందగా, సీనియర్ నాయకులు పీట్ల రాజయ్య, పీట్ల రవి తల్లి సాయమ్మ మృతి చెందగా, యువజన నాయకుడు అల్లి రమేష్, సింగరేణి ఉద్యోగి అల్లి తిరుపతి తండ్రి అల్లి మల్లయ్య మృతి చెందగా, సీనియర్ నాయకులు ముక్కర శంకర్, ముక్కెర చిన్న గౌడ్ తండ్రి ముక్కెర లక్ష్మయ్య, తల్లి సుశీలమ్మ మృతిచెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. మాజీ వార్డు మెంబెర్ పంజా నర్మద అరుణ్ చెయ్యి విరగగా పరామర్శించారు.

## సాదా సీదాగా...సరదాగా కాసేపు....



**రామగిరి, అక్టోబర్ 10(ది క్రైమ్ న్యూస్):-** సాధారణంగా రాజకీయ నాయకులు ప్రజల్లోకి వస్తే ఎప్పుడు బిజీగా గడుపుతారు. ఇక ప్రతిపక్ష హెూదా ఉంటే మాత్రం క్షణం తీరిక ఉండదు.ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉండాల్సి ఉంటుంది. కొద్దిసేపు ఎక్కడైనా సరదాగా ఉండేందుకు ప్రయత్నించినా సమయం దొరకదు. కానీ ఇక్కడ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కాసేపు సరదాగా స్థానిక నాయకులతో ముచ్చటించారు. కమాన్ పూర్ మండల కేంద్రంలో ఓ కార్యక్రమానికి వచ్చిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్థానిక నాయకుల తో కలిసి ఇలా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలోనీ సయ్యద్ టీ స్టాల్ వద్ద సాధారణ వ్యక్తుల్లా టీ తాగుతూ ముచ్చటించారు.

# అథ్లెటిక్స్ పోటీలలో బంగారు పతకాలు సాధించిన సుల్తానాబాద్ విద్యార్థులు...




**సుల్తానాబాద్,అక్టోబర్ 10 (ది క్రైమ్ న్యూస్):** జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు బంగారు పథకాలు సాధించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం లో బుధవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్.జి. ఎఫ్.ఐ) ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో 14 సంవత్సరాల బాలుర విభాగంలో ఏం సంప్రీత్ 100, 200 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్ జి హర్షవర్ధన్ 600 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు.పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడంలో ఐపీఎస్ పాఠశాల ముందుంటుందని, శారీర దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ,శివ, సతీష్ మమత పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



**ముత్తారం. అక్టోబర్.10.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని పలు సబ్ స్టేషన్లలో నేడు మరమ్మత్తుల దృష్ట్యా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తారం సబ్ స్టేషన్ పరిధిలో గల పారుపల్లి, కేశనపల్లి ముత్తారం, ఖమ్మంపల్లి సబ్ స్టేషన్ పరిధిలో గల ఖమ్మంపల్లి, జిల్లెల్లపల్లి, రంగయ్యపల్లి, సీతంపేట గ్రామాలలో 33/11 కేవీ మరమ్మత్తుల దృష్ట్యా మధ్యాహ్నం 03:00 నుండి 4:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

# గ్యారిమి షరీఫ్ జెండా పండుగ కొరకు నిర్మాణ పనులు చేపట్టండి ..

**- కమిషనర్ కు వినతి పత్రం సమర్పించిన 3వ వార్డు ప్రజలు..**



**జమ్మికుంట అక్టోబర్ 10 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని రామన్న పల్లె మూడవ వార్డులో గత కొద్ది సంవత్సరాలుగా ముస్లింల పవిత్రమైన గ్యారిమి షరీఫ్ జెండా పండుగను రామన్న పల్లె సర్వే నెంబర్ 393,లో ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ పండుగలో ముస్లిం మైనార్టీలే కాకుండా మూడవ వార్డు రామన్న పల్లె ప్రజలు కూడా భక్తిశ్రద్ధలతో పాల్గొంటుంటారు. ఇట్టి గ్యారిమీ షరీఫ్ జెండా పండుగ కొరకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుండే క్రమంలో కనీస సౌకర్యాలు చుట్టూ ప్రహరీ గోడ,గద్దెలు, టైల్స్, హైమాస్క్ లైట్లు, సీసీ రోడ్డు,వంటి నిర్మాణాలు చేపట్టాలని, రామనపల్లె మూడవ వార్డు ప్రజలు మరియు ముస్లిం మైనార్టీ నాయకులు శుక్రవారం రోజున జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ కు ప్రభుత్వం తరఫున కనీస సౌకర్యాలు అందించాలని వినతిపత్రం సమర్పించారు. గతంలో కూడా ఎన్నో వినతి పత్రాలు అందించినప్పటికీ అధికారులు అభివృద్ధికి తోడ్పడలేదని ఇకనైనా మాపై దయతో కనీస సౌకర్యాలు కల్పించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రామన్న పల్లె మూడో వార్డు ప్రజలు ముస్లిం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**- బిజెపి జిల్లా కార్యదర్శి బిరుదు గట్టయ్య**



**ముత్తారం.అక్టోబర్.10.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండల కేంద్రంలోని అడవి శ్రీరాంపూర్ చౌరస్తాలో శుక్రవారం బిజెపి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలపై బిజెపి శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బిజెపి జిల్లా కార్యదర్శి బిరుదు గట్టయ్య,బిజెపి మండల అధ్యక్షుడు మారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామని మోసపూరిత నోటిఫికేషన్ ఇచ్చి బీసీలపై కపట ప్రేమ చూపిస్తూ నోటిఫికేషన్ ఇవ్వడం పట్ల నిరసన తెలిపారు. రాజ్యాంగ నిబంధనలు పాటించకుండా హడావుడిగా జీవో నెంబర్ 9 జారీ చేసి స్థానిక ఎన్నికలకు వెళ్లడం వారి అవివేకానికి నిదర్శమని అన్నారు. హైకోర్టులో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ పై స్టే ఇవ్వడం ప్రతిపక్షాల కుట్ర అని నిందెలు వేయడం సరికాదని అన్నారు.ప్రభుత్వం 420 హామీలు ఇచ్చి పాలనలో విఫలమైందని, బీసీలపై నిజంగా ప్రేమ ఉంటే రాజ్యాంగ బద్ధంగా రిజర్వేషన్లు వర్తించేలా చేయాలని అన్నారు. అనంతరం నినాదాలు చేస్తూ సీఎం దిష్టిబొమ్మ దహనం చేసే క్రమంలో పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు ఐద రమేష్, గుజ్జ గోపాలరావు, బియ్యాని శ్రీనివాస్, కంచం రమేష్, పరికిపండ్ల మొగిలి, లక్కం రాజగట్టు, రత్నం సమ్మయ్య, జంగమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత.... ముగ్గురు అరెస్ట్

**ఇల్లంతకుంట, అక్టోబర్ 10(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం చింతలకుంటపల్లి శివారులోని చెరువు కట్ట వద్ద శుక్రవారం గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. అనంతగిరికి చెందిన రెడ్డి రాకేష్ రెడ్డి, ఉప్పల ప్రణీత్ రెడ్డి,మాసం మనీష్ కుమార్ అనే ముగ్గురు యువకులు గంజాయి విక్రయించేందుకు రాగా పక్కా సమాచారంతో నిందితులను పట్టుకొని వాళ్ళ వద్ద 103 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అదనపు ఎస్సై జి.లక్పతి అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకోగా సిరిసిల్ల రూరల్ సిఐ.మొగిలి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు.

# ఎస్జిటి టీచర్స్ పోస్టులను పెంచాలి..



**జమ్మికుంట అక్టోబర్ 10 (ది క్రైమ్ న్యూస్):** ఎస్జిటి టీచర్స్ పోస్టుల తగ్గింపును వ్యతిరేకిస్తున్న జమ్మికుంట మండల ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులు. జమ్మికుంట మండలంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఎంఆర్సి జమ్మికుంట ముందు ఎస్జిటి సర్ ప్లేస్ పోస్టుల ను హైస్కూల్లో పీఈటి పోస్టుగా మార్చడం పై నిరసన తెలియజేయడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలోని ఎస్ జి ట సర్ ప్లేస్ పోస్టులను తగ్గించి హై స్కూల్లో ఇస్తూ ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయడమేఅని, ఇప్పటికే మే ము డిమాండ్ పెట్టిన తరగతికి ఒక ఉపాధ్యాయున్ని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు టీఎస్ హెచ్ఎం ఇవ్వాలని కోరుచు ఇలాంటి ప్రయోగాల వల్ల ప్రైమరీ పాఠశాల ఉనికిని కోల్పోవడం కోసం ప్రభుత్వం చర్యలకు పాల్పడడం చాలా దారుణమైన విషయమని, విద్యా వ్యవస్థలో ప్రాథమిక దశ చాలా ప్రాముఖ్యమైనది, ఇంటి నిర్మాణానికి పునాది ఎంత గట్టిదో విద్యలో ప్రాథమిక పాఠశాలలో తరగతికొక ఉపాధ్యాయుని ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయున్ని పోస్టులు మంజూరు చేసి ప్రాథమిక పాఠశాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలని అదే విధంగా ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రాథమిక తరగతిలో పూర్వ ప్రాథమిక తరగతుల అనుమతిని కేటాయించాలని ఈ సంవత్సరం కొన్ని పాఠశాల కేటాయించడం అది ప్రతి పాఠశాలకు పూర్వ ప్రాథమిక ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ తప్పనిసరి అయితేనే మన ప్రాథమిక పాఠశాలలో బలోపేతం ఉంటుందని , ఈరోజు ప్రతి తల్లిదండ్రులు మూడు రెండు మూడు సంవత్సరాలకే ప్రవేట్ పాఠశాలకు పంపిస్తున్న తరుణంలో మూడు సంవత్సరాలు ప్రైవేట్ పాఠశాలలకు అలవాటు అయిన వ్యక్తి మరి ఆరు సంవత్సరములు నిండగానే ఒకటో తరగతికి ఏ విధంగా ఏ విధంగా మళ్లీ వస్తాడు ఒకసారి ప్రభుత్వము ఆలోచన చేసి సర్ ప్లేస్ ఉన్న ఎస్జీటీ పోస్టులను పిటి పోస్టులుగా మార్చకుండా ఉండాలని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులందరూ మూకుమ్మడిగా తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎస్జిటి ఐక్యవేదిక కన్వీనర్ గుడిమల్ల బలరాం సభ్యులు దెబ్బేట రవీందర్ నాగరాజు, మేడుదుల నాగరాజు, రాజిరెడ్డి కుమారస్వామి, విజయ్ ,సురేష్, రాజు, సారంగం, అంజన్ ప్రసాద్, ప్రసాద్, వేణుగోపాల్, తిరుపతి, రాహుల్, ప్రవీణ, రాణి, సంధ్యారాణి, సంధ్య, శిరీష, సుమీర, హర్షియా, రాగిణి ఇతర ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

# కోల్ ఇండియా స్థాయిలో పోటీలలో రాణించాలి

## ◆ ఆర్జీ-త్రీ ఎస్వోటుజిఎం ఎం.రామ్మోహన్






**రామగిరి, అక్టోబర్ 10(ది క్రైమ్ న్యూస్):-** కోల్ ఇండియా స్థాయిలో పోటీలలో రాణించాలని రామగుండం-త్రీ ఏరియా ఎస్వోటుజిఎం ఎం.రామ్మోహన్ అన్నారు. రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు ఆర్.జి-త్రీ, ఎ.పి.ఎ, భూపాలపల్లి ఏరియాల క్రీడాకారుల మధ్య రీజినల్ స్థాయి కబడ్డీ, బాల్ బ్యాట్మెంటన్ పోటీలను నిర్వహించారు. ఇట్టి పోటీలను రామగుండం-త్రీ ఏరియా ఎస్వోటుజీఎం ఎం.రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి సంవత్సరం వివిధ క్రీడలలో పోటీలను నిర్వహిస్తుందన్నారు. కావున నిత్యం ఉద్యోగులు సాధన చేస్తూ, నైపుణ్యం సాధిస్తూ ముందుకెళ్లాలన్నారు. అంతేకాకుండా కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయిలలో నిర్వహించు పోటీలలో నైపుణ్యాన్ని ప్రదర్శించి మన రీజియన్ పేరు నిలబెట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు, బెల్లం శ్రీనివాస్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, గౌరవ కార్యదర్శి సాయి స్వరూప్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్సా శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జవ్వాజి అంజయ్య, ఇతర నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# పెన్షనర్స్ న్యాయపరమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి






## ◆ జమ్మికుంటలో భారీ ధర్నా..

**జమ్మికుంట అక్టోబర్ 10,** జమ్మికుంట రైల్వే స్టేషన్ ఆవరణలో ఏఐఆర్ఆర్ఎఫ్, ఎన్సిసిపిఏ, ఫోరమ్ ఆఫ్ నేషనల్ పెన్షనర్స్ అసోసియేషన్, ఎఫ్ ఓ సి పి ఏ పిలుపుమేరకు జమ్మికుంట బ్రాంచి ఆద్వర్యంలో బారీ ఎత్తున దర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జమ్మికుంట బ్రాంచ్ అధ్యక్షులు, జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ దాసరి రాజేశ్వర్ మాట్లాడుతూ పెన్షనర్స్ యొక్క న్యాయమైన డిమాండ్లు అయినటువంటి పెన్షన్ వాలిడేషన్ బిల్లు 2025ను రద్దు చేయాలి, అందరిక పాత పెన్షన్ విదానాన్ని అమలు చేయాలి, 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసి వెంటనే అమలు పరచాలి. కోవిడ్ సమయంలో నిలిపివేసిన 18 నెలల కరువు భత్యాన్ని వెంటనే చెల్లించాలి. లేని పక్షంలో రాబోవు కాలంలో వంతుల వారిగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్ పి డబ్ల్యు ఏ శాఖ కార్యదర్శి శీలం మల్లేశం మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్కు రైలు ప్రయాణంలో రాయితీలను పునరుద్దరించాలి. మరియు పెన్షనర్ల న్యామైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.వెంకటస్వామి, వైస్ ప్రెసిడెంట్ యం.డి ఖాజామొయినొద్దీనన్, ట్రెజరర్ యం.డి ఖాదర్ ఖాన్, బి.సాంబయ్య, అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.రాజయ్య, ఎస్ పోచయ్య, ఎన్సిసిపిఏ లో భాగస్వాములైన తాప్రా జమ్మికుంట శాఖ అధ్యక్షులు గరిగే చంద్రయ్య, శీలం సారభద్ర స్వామి నాతోపాటు 100 మంది పెన్షనర్స్, ఫ్యామిలీ పెన్షనర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రిజర్వేషన్ల కపట నాటకం బయటపడింది

## ◆ ప్రజాక్షేత్రంలో ప్రతిఘటన తప్పదు ◆ బిసి రిజర్వేషన్లపై బిజెపి నాయకుల రాస్తారోకో



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ రిజర్వేషన్ల కపట నాటకం బయటపడిందని, బహుజనుల ఆత్మగౌరవంతో కాంగ్రెస్ పార్టీ ఆటలాడుతోందని కనీస నిబద్ధతలేని చట్టాలను రూపొందించి బిసిల పట్ల వివక్ష ప్రదర్శిస్తోందని భారతీయ జనతా పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసి రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు వెలువడటంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాజీవ్ రహదారిపై బిజెపి శ్రేణులు రాస్తారోకో చేపట్టాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ముస్లీం మైనారిటీలను బిసి జాబితాలో చేర్చడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయంగా, ఆర్థికంగా, ఉపాధిపరంగా బిసిలు వెనకబడి ఉన్నారని, వారికి ప్రోత్సహకం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజల మనోభావాలతో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదని, ప్రతీ అంశాన్ని ఓట్లతో ముడిపెట్టి చూడటం కాంగ్రెస్ సర్కారుకు అలవాటేనని ఎద్దేవా చేశారు. అత్యున్నత న్యాయస్థానాల్లో కేసు నిలవదని తెలిసే ముఖ్యమంత్రి రేవంతరెడ్డి స్థానిక ఎన్నికలకు ముందు బిసి రిజర్వేషన్ల అంశాన్ని లేవనెత్తారని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైన బుద్ధిమార్చుకొని కేవలం బిసీల్కు లబ్ధి చేకూరేలా మాత్రమే చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. కాగా రాస్తారోకో సందర్భంగా రాజీవ్ రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళన చేస్తున్న నాయకులను పోలీసులు పక్కకు జరపడంతో ట్రాఫిక్ సమస్య తీరింది. ఈ రాస్తారోకోలో నాయకులు శిలారపు పర్వతాలు, పల్లె సదానందం, పర్స సమ్మయ్య, వెళ్ళంపల్లి శ్రీనివాసరావు, బెజ్జంకి దిలీప్, శివంగారి సతీష్, రాజం మహంతక్రిష్ణ, జెట్టి రాజు, వేల్పుల లక్ష్మినారాయణ, మోర మనోహర్, భూషనవేన శ్రీనివాస్ గౌడ్, పెంజర్ల రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి మరో అడుగు..!

◆ రూ.10 కోట్ల నిధులతో 60 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులకు ప్రారంభోత్సవం ◆ జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్‌కి ధన్యవాదాలు తెలిపిన ప్రజలు







**బోడుప్పల్ (ది క్రైమ్ న్యూస్):** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ సాయి రెసిడెన్సీ నుండి 28వ డివిజన్ బంగారు మైసమ్మ గుడి వరకు రూ.10 కోట్ల నిధులతో జరగనున్న 60 ఫీట్ల రోడ్డు విస్తరణ ప్రాజెక్ట్ కు మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ హెచ్ఎండిఎ 10 కోట్ల రూపాయల నిధులతో రూపుదిద్దు కోనుంది. ఈ సందర్భంగా మాజీ మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి ప్రజా ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని అన్నారు. బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ లు తమ వంతు సహాయ సహకారాలను పూర్తిగా అందించారని అన్నారు. ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, సుమన్ నాయక్,చీరాల నర్సింహా, రాములు, పులకండ్ల జంగా రెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబర్ రంగా బ్రాహ్మన్న గౌడ్, ప్రభాకర్ గౌడ్, కుర్రి శివ శంకర్, బొమ్మక్ శ్రీనివాస్, దిలీప్ రెడ్డి, చెంచల నర్సింగరావు, రాపోలు ఉపేందర్, ప్రశాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లు కేవలం కాంగ్రెస్ అడిన డ్రామా..!

◆ ఎన్నికలలో ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయాడంలో రేవంత్ సర్కారు విఫలం
◆ బీఆర్ఎస్ పార్టీ బోడుప్పల్ కార్పొరేషన్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి



**బోడుప్పల్ (ది క్రైమ్ న్యూస్):** చట్టబద్ధత లేని జీవోలు తీసుకువచ్చి బీసీలను మభ్యపెట్టి రిజర్వేషన్ల పేరిటా బీసీలను మోసం చేసిందని బోడుప్పల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు శుక్రవారం బోడుప్పల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో అత్యధిక శాతం జనాభాగా ఉన్న బీసీలను తడి బట్టతో గొంతుకోసి మోసం చేశారని అన్నారు. జీవో నెంబరు 9 ద్వారా బీసీలకు రిజర్వేషన్లు అంటూ ఆచరణకు సాధ్యంకాని విధంగా నాటకాలు అడి బహుజన సమాజాన్ని మోసం చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా బీసీ సమాజానికి కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. **గ్యారెంటీల అమలు ఎక్కడ..?** ఎన్నికలలో అధికారంలోకి వచ్చేందుకు నాడు కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యంకాని,ఆచరణకు సాద్యం కానీ హామీలను ప్రజలకు ఇచ్చి మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇచ్చిన గ్యారంటీలు ఎందుకు అమలు చేయాడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలోని అన్ని వర్గాలకు అన్యాయం చేసిన ఘనత రేవంత్ సర్కారుకే దక్కిందని అన్నారు. ఇచ్చిన గ్యారంటీలు అమలు చేసే వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులను, ముఖ్యమంత్రిని, మంత్రులను నిలదీయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నాయకులు కొత్త రవిగౌడ్,కాటపల్లి రాంచంద్రారెడ్డి,కాటం రాజారెడ్డి, బొమ్మక్ విశ్వనాథ్, చంటి శ్రీనివాస్, బాందారం శ్రీధర్ గౌడ్ ఉప్పరి విజయ్, కామగళ్ల నరసింహా,తాల్కా శత్రజ్ఞా, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను దగా చేసిన మోసకారి కాంగ్రెస్ ప్రభుత్వం..!

◆ కమాన్ పూర్ క్రాస్ రోడ్డు వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా
◆ కమాన్ పూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ముందు బిజెపి నాయకుల రాస్తారోకో

**మంథని, (ది క్రైమ్ న్యూస్): అక్టోబర్ 10:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అవకాశం స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్పిస్తామంటూ ప్రగల్బాల్ పలికిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం దగా చేసిందని ఇలాంటి మోసపూరిత కాంగ్రెస్ పార్టీని బీసీ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పెద్దపెల్లి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ తీవ్రంగా ఆరోపించారు.

పెద్దపల్లి - మంథని ప్రధాన రహదారిపై కమాన్ పూర్ క్రాస్ రోడ్ వద్ద శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా - రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లని 9 జీవో ను జారీ చేసి బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు మోసపూరిత హామీలను ఇచ్చి నట్టేట ముంచిందన్నారు. బీసీ లకు 42% రిజర్వేషన్ పై కోర్టు "స్టే " ఇవ్వడం నూటికి నూరు వాళ్ళు ఇది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. ఇందుకు పూర్తి బాధ్యత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు. ఆచరణ సాధ్యం కానీ హామీలను ఎన్నికలకు ముందు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారం చేజిక్కాకా దాటవేత ధోరణితో వివరిస్తుందని ఆరోపించారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఏ ఎన్నికలు జరిగినా కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం మంథని నియోజకవర్గ అధ్యక్షులు తోట రాజకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, బీసీ నాయకులు రాచకొండ రవి, ఆకుల గట్టయ్య, కొండ వెంకటేష్, పల్లె నారాయణ, పూలు దాసరి సాయికుమార్, జాబు సతీష్, చిందం తిరుపతి, పెండ్లి నారాయణ, ఇజ్జగిరి సాకేత్, బొల్లపెల్లి శంకర్ గౌడ్, గసిగంటి అజయ్, ఎలాబోయిన రామ్మూర్తి, చొప్పరి శ్రీనివాస్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.






# కన్నాల రైల్వే గేట్ మూసివేతతో ప్రజలకు ఇబ్బందులు

- స్థానిక నాయకుల సేవా కార్యక్రమం ప్రశంసనీయం





**మంథని, (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాల గ్రామానికి చెందిన రైల్వే గేట్ నెం.46/ఎ ను మరమ్మత్తుల నిమిత్తం అక్టోబర్ 8 నుంచి 13 వరకు మూసివేయడంతో స్థానిక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గేటు కన్నాల కాకుండా చుట్టుపక్కల 20 గ్రామాలకు, గోదావరిఖని వరకు ప్రధాన మార్గంగా ఉపయోగపడుతుంది. మార్గం మూసివేయడంతో ప్రజలు పొడవు దారి తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజల సౌకర్యార్థం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (మాజీ), కన్నాల పీఎస్ఎస్ డైరెక్టర్ తొగరి తిరుపతి మరియు మండల కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అరుకాల సతీష్ స్వయంగా ముందుకు వచ్చి అందుగులపల్లి గేట్ రోడ్డు నుండి కన్నాల వరకు ట్రాక్టర్ సాయంతో తాత్కాలిక రోడ్డు రిపేర్ పనులు చేపట్టారు. వారి ఈ సేవా కార్యక్రమం గ్రామ ప్రజల నుండి అభినందనలు పొందింది.

# బిసీలపై కాంగ్రెస్ కపట ప్రేమ మరోసారి రుజువైంది

- టిఆర్పి రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా



**తిమ్మాపూర్, అక్టోబర్ 10(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూరు చౌరస్తాలో బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ కుట్ర పురితంగా వ్యవహరిస్తుందంటూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా ఆద్వర్యంలో నాయకులు శుక్రవారం ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అఖిల్ పాషా మట్లాడుతూ..... బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కామరెడ్డి డిక్లరేషన్ ను నేడు జివో9తో ప్రకటించి కోర్టు కేసులతో పెట్టిన బువ్వను లాక్కోవడంతో బిసిలపై కాంగ్రెస్ కపట ప్రేమ మరోసారి రుజువైందని మండిపడ్డారు. కాంగ్రెస్,బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు అధిపత్యవర్గ పార్టిలేనని ఆరోపిస్తూ టిఆర్పీ తోనే బిసిలకు న్యాయం జరుగుతుందన్నారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి బీసీల పట్లనే వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ రాష్ట్రంలో బీసీని ముఖ్యమంత్రిని చేసే దిశగా తీన్మార్ మల్లన్న నాయకత్వంలో టిఆర్పి పనిచేస్తుందని బీసీల ద్రోహి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని అఖిల్ పాషా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఆర్పీ నాయకులు భుత్కూరి మధు, శివరాత్రి మోహన్, బుర్ర అశోక్, దురుశెట్టి చెందు, నేరేళ్ళ శ్రీకాంత్, సిరిసిల్ల అంజయ్య, గుండ సాయి, మంథని శ్రీకాంత్, అరుణ్, బుర్ర మల్లేశం, వెంకటేష్, చామనపెల్లి లక్ష్మీ, శంకరా చారి, జింక లావణ్య, ఎగుర్ల రమేష్, సులేమన్, జడగల శ్రీనివాస్, మాచర్ల అక్షయ్ తదితరులు పాల్గోన్నారు.

# గంజి నీరు తాగితే ఘనమైన లాభాలు.. ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే వేస్ట్ చేయరు..!



గంజి నీరు అధిక బరువును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. మీరు బరువు తగ్గాలనుకున్నప్పుడు హైడ్రేటెడ్‌గా ఉండటం చాలా ముఖ్యం. గంజి నీరు మీ శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి గంజి నీళ్లు తాగడం మేలు చేస్తుంది. గంజి నీళ్లలో ఎక్కువ మొత్తంలో అమినో యాసిడ్స్ ఉంటాయి. ఇది శరీరంలోని కండరాల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. గంజి నీటిలో బి విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల మన శరీరానికి పోషణ లభిస్తుంది. విటమిన్ల లోపం రాకుండా చూసుకోవచ్చు. పిల్లలకు గంజి తాగిస్తే చాలా మంచిది. వారి ఎదుగుదల సరిగ్గా ఉంటుంది. పసిపిల్లలు పాలు సరిగ్గా తాగకపోతే వారికి కనీసం గంజి నీటిని అయినా తాగించాలి. దాంతో వారికి కావల్సిన ఆహారం అంది శక్తి లభిస్తుంది. పోషణ సరిగ్గా ఉంటుంది. విరేచనాలు అయిన వారు గంజి నీటిని తాగితే వెంటనే విరేచనాలు తగ్గుతాయి. విటమిన్లు, ఇతర యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉన్న గంజి నీరు చర్మ ఆరోగ్యానికి కూడా మంచిది. గంజిలో అల్లాంటన్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు.. మొటిమలను నివారిస్తాయి. అలాగే ఎమినో యాసిడ్స్ ఉండటం వల్ల..రంధ్రాలను క్లెన్స్ చేసి.. చర్మాన్ని బిగుతుగా మార్చి, కాంప్లెక్షన్ ని పెంచుతుంది. గంజి నీళ్లతో మీ ముఖాన్ని కడుక్కోవడం వల్ల మూసుకుపోయిన రంధ్రాలు తెరుచుకోవడంతోపాటు మొటిమలు రాకుండా ఉంటాయి. ఇది ముఖంపై ఉన్న నల్ల మచ్చలను పోగొట్టి, చర్మం కాంతివంతంగా, మృదువుగా మారుతుంది. బియ్యం కడిగిన నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే ముఖం కాంతివంతంగా తయారవుతుంది. అదేవిధంగా, గంజి నీరు జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. కేశ సంరక్షణలో రైస్ వాటర్ ఉపయోగించేందుకు ఒక కప్పు గంజి నీటిలో 20 గ్రాముల మెంతులు అవసరం. రాత్రంతా గంజి నీటిలో మెంతులు నానబెట్టాలి. ఆ మర్నాడు ఉదయం మెంతులను వేరు చేసి గంజిని స్ప్రే బాటిల్ పోసుకుని జుట్టు మీద స్ప్రే చేసుకోవాలి. లేదంటే, ఆ గంజినీటిని మొత్తం తలకు పట్టేలా బాగా అప్లై చేసుకోవాలి. పది నిమిషాల తర్వాత కడిగేయాలి. కేవలం గంజి నీటిని మాత్రమే తలకు అప్లై చేయడం వల్ల కూడా జుట్టు రాలడాన్ని నివారించవచ్చు. జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది.

# డబుల్ సెంచరీ ముంగిట యశస్వి జైస్వాల్..

**తొలి టెస్ట్ సెంచరీ మిస్ చేసుకున్న సాయి సుదర్శన్**

**అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా వెస్టిండీస్?తో రెండో టెస్టు**

**318-2స్కోర్?తో పటిష్ఠంగా టీమిండియా**



అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా వెస్టిండీస్?తో జరుగుతున్న రెండో టెస్టులో తొలి రోజు ఆట ముగిసింది. ఆట ముగిసే సమయానికి భారత్ స్కోర్?తో 318-2 పటిష్ఠంగా ఉంది. క్రీజులో యశస్వీ జైస్వాల్ (173), శుభ్?మన్ గిల్ (20) ఉన్నారు. రెండో రోజు కూడా ఇదే జోరు కొనసాగితే భారత్?కు భారీ ఖాయం. వెస్టిండీస్ బౌలర్లలో వారికన్ రెండు వికెట్లు పడగొట్టాడు. టాస్ నెగ్గిన టీమ్ఇండియా బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు జైస్వాల్- కేఎల్ రాహుల్ శుభారంభం ఇచ్చారు. 58 పరుగుల వద్ద భారత్ తొలి వికెట్ కోల్పోయింది. రాహుల్ (38 పరుగులు)ను వారికన్ ఔట్ చేశాడు. ఆ తర్వాత వచ్చిన సాయి సుదర్శన్?తో జైస్వాల్ జతకట్టాడు. ఈ ఇద్దరూ అద్భుతమైన భాగస్వామ్యం నెలకొల్పారు. విండీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ జట్టు స్కోర్? బోర్డును ముందుకు నడిపించారు. ఈ క్రమంలోనే జైస్వాల్ 145 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. అతడికిది టెస్టుల్లో 7వ శతకం. మరోవైపు సుదర్శన్ కూడా చక్కటి ఆటతో అలరించాడు. హాఫ్ సెంచరీ పూర్తి చేసి శతకం దిశగా సాగాడు. కానీ 87 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద సుదర్శన్?ను వారికన్ ఎల్?బీడబ్ల్యూగా పెవిలియన్?కు పంపాడు. దీంతో 2 వికెట్?కు 193 పరుగులు భారీ భాగస్వామ్యానికి తెర పడింది. టాస్ గెలిచిన గిల్.. ఏమాత్రం రెండో ఆలోచన లేకుండా బ్యాటింగ్ తీసుకున్నాడు. ఓపెనర్లు జైస్వాల్, కేఎల్ రాహుల్ (38) శుభారంభాన్నిచ్చారు. ముఖ్యంగా రాహుల్ కాస్త దూకుడుగా ఆడగా, జైస్వాల్ ఆరంభంలో కాస్త నెమ్మదిగా ఆడాడు. ఇక జోరు కొనసాగించిన రాహుల్.. వర్రీకన్ బౌలింగ్ లో స్టంపౌట్ అయ్యాడు. దీంతో 58 పరుగుల వద్ద తొలి వికెట్ ను కోల్పోయింది. ఈ దశలో వన్ డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ (165 బంతుల్లో 87, 12 ఫోర్లు)తో కలిసి జైస్వాల్ మరో వికెట్ పడకుండా లంచ్ విరామానికి వెళ్లారు. ఆ తర్వాత వీరిద్దరూ పర్యాటక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. లంచ్ విరామం తర్వాత ఫిఫ్టీ పూర్తి చేసుకున్న జైస్వాల్.. సెంచరీ వైపు దూసుకెళ్లాడు. మరో ఎండ్ లో సాయి సుదర్శన కూడా ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేశాడు. వీరిద్దరూ చకచకా పరుగులు చేయడంతో స్కోరు బోర్డు కాస్త వేగంగానే సాగింది. ఈక్రమంలో కెరీర్ లో ఏడో సెంచరీని జైస్వాల్ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్ లో సెంచరీ వైపు దూసుకెళుతున్న సుదర్శన్ ను చక్కని బంతితో వర్రీకన్ ఎల్బీగా ఔట్ చేశాడు. దీంతో రెండో వికెట్ కు నమోదైన193 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఇక జైస్వాల్ మాత్రం జోరు కొనసాగిస్తూ 150 పరుగుల మార్కును కూడా చేరుకున్నాడు. మరో ఎండ్ లో గిల్ కూడా సాధికారికంగా బ్యాటింగ్ చేశాడు. వీరిద్దరూ అబేధ్యమైన మూడో వికెట్ కు 67 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇక పస లేని బౌలింగ్ తో వెస్టిండీస్ ఏమాత్రం ప్రమాదకరంగా కనిపించలేదు. కేవలం వర్రీకన్ మాత్రమే పిచ్ కు తగినట్లుగా బౌలింగ్ చేయగా, మిగతా వారు ఘోరంగా విఫలం అయ్యారని చెప్పుకోవచ్చు. సాయి సుదర్శన్ తన తొలి టెస్టు సెంచరీకి కేవలం 13 పరుగుల దూరంలో ఆగిపోయాడు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ వారికన్ వేసిన బంతిని అర్థం చేసుకోలేక అతను ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. 87 పరుగుల వద్ద అవుట్ కావడంతో సుదర్శన్ చాలా నిరాశ చెందాడు. అయితే, ఇక్కడ ఒక ఆసక్తికరమైన ట్విస్ట్ ఉంది.. సుదర్శన్‌ను అవుట్ చేసింది, అంతకుముందు అతనికి లైఫ్ ఇచ్చిన ప్లేయరే. సాయి సుదర్శన్ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌తో కలిసి అద్భుతమైన పార్టనర్ షిప్ నెలకొల్పాడు. ఈ ఇద్దరు యంగ్ బ్యాటర్లు కలిసి రెండో వికెట్‌కు ఏకంగా 193 పరుగులు జోడించారు. సుదర్శన్ తన బ్యాటింగ్‌తో ఆకట్టుకొని, తన టెస్ట్ కెరీర్‌లో రెండవ హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అతను కేవలం 87 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. ఈ భాగస్వామ్యం కారణంగా టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో పటిష్టమైన స్థితికి చేరుకుంది.

## స్పోర్ట్స్



## రోడ్డు ప్రమాదంతో నా జీవితం పూర్తిగా మారింది

**ఆ రోజులను తలుచుకోవడమే కష్టంగా ఉంది**

**ఆ బాధను భరించలేక చచ్చిపోవాలనుకున్నా**

**పలుమార్లు ఆత్మహత్యాయత్నం చేశా..**

**సౌతాఫ్రికా మహిళా ఓపెనర్ టాజ్మిన్ బ్రిట్స్ భావోద్వేగం**

జీవితంలో ఎదురైన అనూహ్య ఘటనతో చచ్చిపోవాలనుకున్నానని, పలుమార్లు ఆత్మహత్యాయత్నం కూడా చేశానని సౌతాఫ్రికా మహిళా ఓపెనర్ టాజ్మిన్ బ్రిట్స్ తెలిపింది. 2011లో జరిగిన కారు ప్రమాదంతో తన జీవితం ఒక్కసారిగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. భారత్ వేదికగా జరుగుతున్న వన్డే ప్రపంచకప్ 2025లో టాజ్మిన్ బ్రిట్స్ అసాధారణ ప్రదర్శన కనబరుస్తోంది.భారత్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో టాజ్మిన్ బ్రిట్స్(0) విఫలమైనా.. న్యూజిలాండ్‌పై భారీ శతకం సాధించింది. గత 6 వన్డేల్లో 4 సెంచరీలతో సూపర్ ఫామ్‌లో ఉంది. మహిళల వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా ఏడు సెంచరీలు చేసిన బ్యాటర్‌గా మెగ్ లానింగ్‌తో సహా పలు రికార్డులను బద్దలుకొట్టింది. అయితే టాజ్మిన్ బ్రిట్స్ క్రికెట్ జర్నీ విభిన్నమైనది.వాస్తవానికి ఆమె అథ్లెటిక్స్ కెరీర్‌ను ఎంచుకుంది. జావెలిన్ త్రోయర్‌గా 2012 లండన్ ఒలింపిక్స్‌కు సిద్దమైంది. 16 ఏళ్ల వయసులోనే ప్రపంచ అథ్లెటిక్స్ యూత్ ఛాంపియన్‌షిప్స్‌లో బంగారు పతకం సాధించింది. 2010 అథ్లెటిక్స్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలిచి ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. కానీ లండన్ ఒలింపిక్స్‌కు కొన్ని నెలల ముందు బ్రిట్స్ ఘోర కారు ప్రమాదానికి గురైంది.ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. హిప్,పెల్విస్ ఎముకలు విరిగిపోయాయి. దాంతో ఆమె రెండు నెలల పాటు ఆసుపత్రిలోనే గడపాల్సి వచ్చింది. ఈ ప్రమాదం కారణంగా తన ఒలింపిక్ కల చెదిరింది. రోడ్డు ప్రమాదంలో అచేన స్థితిలో ఉన్న ఆమెను చూసి నడవడం కూడా కష్టమని అంతా అనుకున్నారు. కానీ ఓ స్నేహితుడి సూచనతో సరదాగా క్రికెట్ ఆడటం ప్రారంభించిన ఆమె.. ఆ తర్వాత కెరీర్‌గా ఎంచుకుంది. 2018లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసి పరుగుల మోత మోగిస్తుంది. తాజాగా మాజీ క్రికెటర్ అంజుమ్ చోప్రాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన జీవిత ప్రయాణాన్ని గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురైంది.'రోడ్డు ప్రమాదంతో నా జీవితం పూర్తిగా మారిపోయింది. ఆ రోజులను తలుచుకోవడమే కష్టంగా ఉంది. ఆ బాధను భరించలేక చచ్చిపోవాలనుకున్నాను. పలుమార్లు ఆత్మహత్యాయత్నం కూడా చేశాను. నిరంతరం నన్ను ఆత్మహత్య ఆలోచనలు వెంటాడేవి. కానీ నాకు నా తల్లిదండ్రులు అండగా నిలిచారు. ముఖ్యంగా మా అమ్మ నేను కోలుకోవడంలో కీలక పాత్ర పోషించింది. అయితే అది అంత సులువుగా జరగలేదు. ఓ రోజు నేను బార్‌లో కూర్చున్నప్పుడు నార్త్ వెస్ట్ క్రికెట్ కోచ్.. మహిళా క్రికెటర్ల కోసం వెతుకుతూ మా వైపు వచ్చాడు. నా ఫ్రెండ్స్ వెంటనే నేను క్రికెట్ ఆడుతానని ఆయనతో చెప్పారు. ఆ సమావేశం నా జీవితాన్ని మలుపు తిప్పింది. అయితే క్రికెట్‌లోకి వచ్చే ముందు నేను మళ్లీ జావెలిన్ త్రోయర్‌గా రాణించేందుకు ప్రయత్నించాను. కానీ ఆ దేవుడు నా విధిరాతలో క్రికెటర్ కావాలని రాసాడేమో.. అందుకే జావెలిన్ త్రోయర్ కావాల్సిన నేను క్రికెటర్ అయ్యాను.'అని టాజ్మిన్ బ్రిట్స్ చెప్పుకొచ్చింది. జీవితంలో ప్రతీ ఒక్కరికి రెండో ఛాన్స్ లభిస్తుందని, ఆ అవకాశం కోసం ఎదురు చూడాలని బ్రిట్స్ జీవిత ప్రయాణం సూచిస్తోంది.

## సెమీఫైనల్ చేరాలంటే మూడు గెలవాల్సిందే!

మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో టీమిండియాకు తొలి పరాజయం ఎదురైంది. వైజాగ్ వేదికగా గురువారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా 3 వికెట్ల తేడాతో టీమిండియాను ఓడించింది. దాంతో హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన హర్మన్‌సేనకు ఊహించని షాక్ తగిలింది. టాపార్డర్ వైఫల్యం.. పేలవ డేత్ బౌలింగ్ టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ ఓటమితో టీమిండియా పాయింట్స్ టేబుల్‌లో మూడో స్థానానికి పడిపోయింది. అయితే టీమిండియా తమ తదుపరి మూడు మ్యాచ్‌ల్లో పటిష్టమైన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌తో తలపడనుంది. టోర్నీ ఫార్మాట్ ప్రకారం పాయింట్స్ టేబుల్‌లో టాప్-4లో ఉన్న జట్లే సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ క్రమంలో టీమిండియా సెమీఫైనల్ చేరాలంటే తమ తదుపరి నాలుగు మ్యాచ్‌ల్లో మూడు గెలవాలి. రెండు మ్యాచ్‌లు ఓడినా.. సెమీఫైనల్ సమీకరణాలు సంక్లిష్టంగా మారుతాయి. ఇతర జట్ల ఫలితాలు, నెట్‌రన్‌రేట్‌పై ఆధారపడాల్సి ఉంటుంది.ఆఖరి నాలుగు మ్యాచ్‌ల్లో మూడు ఓడితే మాత్రం సెమీస్ ఆశలు గల్లంతవుతాయి. మరో అవకాశం లేకుండా టీమిండియా ఇంటిబాట పడుతుంది. ఈ క్రమంలోనే కనీసం మూడు మ్యాచ్‌లు గెలవాలి. అయితే బంగ్లాదేశ్ మినహా మూడు జట్లు టీమిండియాకు కఠినమైనవే. ఆదివారం ఆస్ట్రేలియాతో జరిగే మ్యాచ్‌లో గెలిస్తే టీమిండియా ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుంది. అలా కాకుండా ఈ మ్యాచ్‌లో ఓడితే మాత్రం టీమిండియా మరింత నైరాశ్యంలోకి వెళ్తుంది. ఏ ఒక్కరి ప్రదర్శనపైన ఆధారపడకుండా సమష్టిగా రాణిస్తేనే టీమిండియాకు సెమీస్ బెర్త్ దక్కుతుంది. బ్యాటింగ్‌లో స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, ప్రతికా రావల్, జెమీమా రోడ్రిగ్స్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చెలరేగాల్సి ఉంది. లోయరార్డర్‌లో రిచా ఘోష్ సూపర్ ఫామ్‌లో ఉండటం, రిచా ఘోష్, స్నేహ్ రాణా రాణిస్తుండటం టీమిండియాకు కలిసొచ్చే అంశం. గత మూడు మ్యాచ్‌ల్లో లోయరార్డర్ రాణించడంతోనే టీమిండియా పోరాడే లక్ష్యాన్ని అందుకుంది. టాపార్డర్ కూడా చెలరేగితే భారీ స్కోర్లు నమోదవుతాయి.బౌలింగ్ బాగానే ఉన్నా.. పూర్తిగా స్పిన్నర్లపైనే ఆధారపడుతున్నారు. సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో స్పిన్నర్లు దీప్తి శర్మ, స్నేహ్ రాణా ఓవర్ల కోటా పూర్తి కావడంతో మిగతా బౌలర్లు ఒత్తిడికి గురయ్యారు. డెత్ ఓవర్లలో క్రాంతి గౌడ్, అమన్ జోత్ ధారళంగా పరుగులిచ్చుకున్నారు. స్పిన్నర్లతో పాటు పేసర్లు కూడా బాధ్యతగా రాణిస్తేనే హర్మన్‌సేనకు తిరుగుండదు. ఫీల్డింగ్ పరంగానూ భారత్‌కు తిరుగులేదు.

## క్వాలిఫయర్‌లో కువైట్‌ను చిత్తు చేసిన జపాన్

**ఏకంగా సూపర్ సిక్స్‌కు అర్హత**



టీ20 క్రికెట్‌లో పెద్దగా పేరు లేని జపాన్ జట్టు ఒక అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది. ఒమన్ వేదికగా జరిగిన ఐసీసీ టీ20 వరల్డ్ కప్ ఈస్ట్ ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్స్‌లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో జపాన్ జట్టు కువైట్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించి సంచలనం సృష్టించింది. ఈ చారిత్రక విజయంతో జపాన్ జట్టు సూపర్ సిక్స్ దశకు అర్హత సాధించింది.ఐసీసీ టీ20 వరల్డ్ కప్ ఆసియా అండ్ ఈస్ట్ ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్ 2025 టోర్నమెంట్‌లో భాగంగా అల్ అమెరాత్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో జపాన్ జట్టు, కువైట్‌పై ఐదు వికెట్ల తేడాతో చారిత్రక విజయాన్ని సాధించింది. ఈ విజయంతో జపాన్, అంతకుముందు నెగ్గిన నేపాల్ జట్లు ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే టోర్నమెంట్‌లో కీలకమైన సూపర్ సిక్స్ దశకు అర్హత సాధించాయి. మరోవైపు, తమ తొలి మ్యాచ్‌లో నేపాల్ చేతిలో 58 పరుగుల తేడాతో ఓటమి పాలైన కువైట్, ఈ ఓటమితో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. మొదట బ్యాటింగ్ చేసిన కువైట్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. కువైట్ బ్యాటర్లలో అలీ జహీర్ 31 బంతుల్లో 41 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అతనికి యాసిన్ పటేల్ (40), క్లింటో అంటో (34), మీట్ భావ్‌సర్ (29) గట్టి సపోర్ట్ ఇచ్చారు. అయితే, ఇతర కువైట్ బ్యాటర్లు సింగిల్ డిజిట్స్ దాటలేకపోయారు. జపాన్ బౌలర్లలో డెక్లాన్ సుజుకి-మెక్‌కాంబ్ అత్యంత ప్రభావవంతంగా బౌలింగ్ చేసి 3 వికెట్లు (3-22) పడగొట్టాడు. ఎస్. రవిచంద్రన్ రెండు వికెట్లు, అబ్దుల్ సమద్ ఒక వికెట్ తీసుకున్నారు. 178 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జపాన్ జట్టు అద్భుతంగా ఆడింది. ముఖ్యంగా ఈసామ్ రెహమాన్ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. రెహమాన్ కేవలం 39 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 64 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఓపెనర్ కెండల్ ఫ్లెమింగ్ 19 బంతుల్లో 28 పరుగులు చేయగా, ఎస్. రవిచంద్రన్ (39), ఇబ్రహీం తకహషి (15 బంతుల్లో 26 పరుగులు) తమ వంతు సహకారం అందించారు. చివరికి జపాన్ జట్టు 19.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. కువైట్ బౌలర్లలో మహమ్మద్ ఆఖిఫ్ ఫరూఖ్, యాసిన్ పటేల్, షిరాజ్ ఖాన్ తలో ఒక వికెట్ తీశారు. ఈ విజయంతో సూపర్ సిక్స్‌లోకి అడుగుపెట్టిన జపాన్ జట్టు, తమ గ్రూప్ స్టేజ్‌లో చివరి మ్యాచ్‌లో శుక్రవారం నేపాల్‌తో తలపడనుంది. కాగా, ఇదే క్వాలిఫయర్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో యూఏఈ జట్టు ఖతార్‌ను ఏడు వికెట్ల తేడాతో ఓడించి సునాయాసంగా విజయాన్ని నమోదు చేసింది.

## ఐపీఎల్ వేలానికి నవంబరు 15వరకు గడువు

క్రికెట్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ఏడాదికి గాను వేలం డిసెంబర్‌లో జరగనుంది. డిసెంబరు 13 లేదా 15 తేదీల్లో మినీ వేలం జరగనున్నట్లు బీసీసీఐ వర్గాల నుంచి సమాచారం లీక్ అయ్యింది. అయితే ఫ్రాంచైజీ ఓనర్లతో బీసీసీఐ చర్చించిన తర్వాత ఓ తేదీని ప్రకటించే అవకాశం ఉంది. అయితే ఐపీఎల్ పాలకమండలి మాత్రం ఐపీఎల్ వేలానికి ఇంకా ముహూర్తం ఖరారు చేయలేదు. అయితే గత రెండు సీజన్లలో జరిగినట్లుగా వేలాన్ని విదేశాల్లో నిర్వహించే అవకాశం ఈసారి లేనట్టుగా తెలుస్తోంది. 2023లో దుబాయ్, 2024లో సౌదీ అరేబియాలోని జెడ్డాలో ఈ ఐపీఎల్ వేలాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే 2026 ఏడాదికి గానూ, 2025లో మినీ వేలాన్ని స్వదేశంలోనే నిర్వహించాలని సమాలోచనలు చేస్తుంది భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ).

# జస్‌ప్రీత్ బుమ్రా అరుదైన ఘనత..



టీమిండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అరుదైన ఘనతను సాధించాడు. భారత క్రికెట్ చరిత్రలో మూడు ఫార్మాట్లలో టెస్టులు, వన్డేలు, టీ20లు 50కి పైగా మ్యాచ్‌లు ఆడిన ఏకైక పేస్ బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. అక్టోబర్ 10న భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య ప్రారంభమైన రెండో టెస్టు మ్యాచ్‌లో తుది జట్టులో చోటు దక్కించుకోవడం ద్వారా.. బుమ్రా ఈ ఘనతను అందుకున్నాడు. 31 ఏళ్ల బుమ్రా ఇప్పటివరకూ టీమిండియా తరుపున 50 టెస్టులు, 89 వన్డేలు, 75 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. టెస్టుల్లో 222 వికెట్లు, వన్డేల్లో 149 వికెట్లు, టీ20ల్లో 96 వికెట్లు సాధించాడు బుమ్రా.ఇక మూడు ఫార్మాట్లలో 50కి పైగా మ్యాచ్‌లు ఆడిన భారత ఆటగాళ్ల లిస్ట్‌లో దిగ్గజ ఆటగాళ్లు %మీ% ధోని, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, కేఎల్ రాహుల్‌లు.. బుమ్రా కన్నా ముందు ఉన్నారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఫస్ట్ డే లంచ్ బ్రేక్‌కి టీమ్ఇండియా మొదటి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 94 పరుగులు చేసింది. క్రీజ్‌లో యశస్వి జైస్వాల్ (40), సాయి సుదర్శన్ (16) ఉన్నారు. అంతకముందు ఓపెనర్ కేఎల్ రాహుల్ 38 పరుగులు చేశాడు. టీమిండియా తరుపున 3 ఫార్మాట్లలో 50కి పైగా మ్యాచ్‌లు ఆడిన ఆరుగురు ఆటగాళ్లు.. 1. విరాట్ కోహ్లీ-123 టెస్టులు, 302 వన్డేలు, 125 టీ20 మ్యాచ్‌లు (మొత్తం 550 అంతర్జాతీయ మ్యాచ్‌లు) 2. %మీ% ధోని-90 టెస్టులు, 350 వన్డేలు, 98 టీ20 మ్యాచ్‌లు (మొత్తం 538 మ్యాచ్‌లు) 3. రోహిత్ శర్మ-67 టెస్టులు, 237 వన్డేలు, 159 టీ20 మ్యాచ్‌లు (మొత్తం 499 మ్యాచ్‌లు) 4. రవీంద్ర జడేజా-86 టెస్టులు, 204 వన్డేలు, 74 టీ20 మ్యాచ్‌లు (మొత్తం 364 మ్యాచ్‌లు) 5. రవిచంద్రన్ అశ్విన్-106 టెస్టులు, 116 వన్డేలు, 65 టీ20 మ్యాచ్‌లు (మొత్తం 287 మ్యాచ్‌లు) 6. జస్‌ప్రీత్ బుమ్రా-50 టెస్టులు, 89 వన్డేలు, 75 టీ20 మ్యాచ్‌లు (మొత్తం 214 మ్యాచ్‌లు)

# రూ.1.17 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

**విజయనగరంలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు**
**ఓర్వకల్లులో రిలయన్స్ కన్జ్యూమర్ ప్రాజెక్టు**
**పర్యాటక ప్రాంతాల్లో స్టార్ హోటళ్ల నిర్మాణం**
**గేమ్ చేంజర్‌లా టూరిజం పాలసీ**
**కేబినెట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి**



అమరావతి,అక్టోబర్10 : మొత్తం రూ.1.17 లక్షల కోట్ల పెట్టుబడులకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం మంత్రివర్గ సమావేశం జరిగింది. కేబినెట్ నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వెల్లడించారు. విజయనగరంలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు, ఓర్వకల్లులో రిలయన్స్ కన్జ్యూమర్ ప్రాజెక్టుకు, పర్యాటక ప్రాంతాల్లో స్టార్ హోటళ్ల నిర్మాణ ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. శ్రీశైలం ఆలయాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. పలు సంస్థలకు భూ కేటాయింపులు, సబ్సిడీలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇలా కేబినెట్ కీలక నిర్ణయాలకు అమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంపై ఆయన మాట్లాడారు. క్యాబినెట్ రాష్ట్ర ఆర్థిక పురోగతికి, ఏఐ అభివృద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఎస్ఐపీబీ మీటింగ్‌లో చర్చించిన నిర్ణయాలకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి స్పష్టం చేశారు. గడిచిన 15 నెలల కాలంలో రాష్ట్ర అభివ్రద్ధికి, ప్రజల శ్రేయస్సుకు అనేక పాలసీలు ఇచ్చామని కొలుసు పార్థసారథి తెలిపారు. వివిధ పాలసీలకు అనుగుణంగా ప్రోత్సాహకాలు ఇచ్చి రూ.1.17లక్షల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు చెప్పారు. సుమారు 70 వేల ఉద్యోగాలు వచ్చేలా క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. అలాగే టాటా పవర్ రెన్యూవబుల్ లిమిటెడ్ ప్లాంటు, చింతా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ప్రాజెక్టులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. తోటపల్లి బ్యారేజి నుంచి 24 ఎంసీఎం నీటి ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. దీనితో పాటు ఎవాపరేషన్ లాసెస్‌కు కూడా నీటిని కేటాయించినట్లు తెలిపారు. రిలయన్స్ కన్స్యూమర్ ప్రాడెక్ట్‌ల కింద కర్నూలు జిల్లాలో రూ.758 కోట్లతో ప్యాక్టరీ నెలకొల్పడానికి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా 500 మందికి ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. టూరిజం పాలసీ ఒక గేమ్ ఛేంజర్ అందుకే దానిపై కేబినెట్ ప్రత్యేక దృష్టిపెట్టినట్లు చెప్పుకొచ్చారు. దానికోసం ప్రత్యేకమైన ల్యాండ్ పార్సిల్స్ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు.

# అఫ్ఘన్ గడ్డపై భారత్ వ్యతిరేక చర్యలను అనుమతించం

**తాలిబాన్ విదేశాంగ శాఖ మంత్రి అమిర్ ఖాన్ ముత్తకీ**

న్యూఢిల్లీ,అక్టోబర్10 : అఫ్ఘాన్ భూభాగంలో ఇతర దేశాలకు వ్యతిరేకంగా ఎలాంటి కార్యకలాపాలను అనుమతించబోమని తాలిబాన్ విదేశాంగ శాఖ మంత్రి అమిర్ ఖాన్ ముత్తకీ హామీ ఇచ్చారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న ఆయన మీడియా సమావేశంలో పాక్‌ను ఉద్దేశిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. అఫ్ఘానిస్థానీల ధైర్యసాహసాలకు పరీక్ష పెట్టొద్దని కూడా గట్టి వార్నింగ్ ఇచ్చారు. కాబుల్‌లోని తెహ్రీక్ ఏ తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులను టార్గెట్ చేస్తూ పాక్ దాడులకు తెగబడుతున్న నేపథ్యంలో ఆయన ఈ హెచ్చరిక చేశారు. అయితే, అఫ్ఘాన్ కేంద్రంగా చేసుకుని తమపై దాడులు చేస్తున్న ఉగ్రవాదుల తీరుతో సహనం నశించి ప్రతి దాడి చేస్తు?న్నామని పాక్ పేర్కొనడం గమనార్హం. పాక్ దాడులపై అఫ్ఘాన్ మంత్రి ముత్తకీ స్పందించారు. 'సరిహద్దుకు సమీపంలోని ప్రాంతాలపై దాడులు జరిగినట్టు తెలుస్తోంది. పాక్ తప్పు చేస్తోంది. దాదాపు 40 ఏళ్ల తరువాత అఫ్ఘానిస్థాన్‌లో శాంతి నెలకొంది. అభివృద్ధి కనిపిస్తోంది. ఈ సమయంలో మా ధైర్యసాహసాలను పరీక్షించే ప్రయత్నం చేయొద్దు. ఇలా చేస్తే ఏం జరుగుతోందో రష్యా, అమెరికా, నాటోలను వెళ్లి అడగొచ్చు. అఫ్ఘాన్‌తో గేమ్స్ వద్దని వారు చెబుతారు' అని ముత్తకీ వార్నింగ్ ఇచ్చారు. సీమాంతర ఉగ్రవాదం అంశంలో గత కొన్ని నెలలుగా పాక్, అఫ్ఘానిస్థాన్ మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో తాలిబన్ ప్రభుత్వం భారత్‌కు దౌత్య బంధాలు మెరుగు పరుచుకునేందుకు ప్రయత్నించడం పాక్‌కు కంటగింపుగా మారింది. ఈ క్రమంలోనే సీమాంతర దాడులకు దిగొద్దంటూ పాక్‌ను అఫ్ఘాన్ మంత్రి హెచ్చరించారు. ఇలాంటి చర్యలతో సమస్యలు పరిష్కారం కావని హెచ్చరించారు. ఇక అఫ్ఘానిస్థాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, స్వాతంత్ర్యానికి తాము పూర్తి మద్దతు ఇస్తామని భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ ముత్తకీకి భరోసా ఇచ్చారు.

# అలకబూనిన అంజన్ కుమార్ యాదవ్

**బుజ్జగించిన కాంగ్రెస్ పెద్దలు**
**కలసి పనిచేయాలని నిర్ణయం**

హైదరాబాద్,అక్టోబర్10 : జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో అలకబూనిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌ను ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ బుజ్జగించారు. అంజన్‌కుమార్ ఇంటికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. ఏ పరిస్థితుల్లో టికెట్‌ను వేరే వాళ్లకు కేటాయించాల్సి వచ్చిందనే విషయాన్ని ఆయనకు వివరించారు. అనంతరం అంజన్‌తో పాటు పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. పార్టీ చర్యలతో మనస్తాపానికి గురైనట్లు అంజన్‌కుమార్ యాదవ్ తెలిపారు. కష్టకాలంలో పార్టీ వెంట ఉన్న తనను ఇప్పుడు పక్కనపెడతారా? అని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో నేను చాలా సీనియర్ నేతను. నేనెప్పుడూ ఓడిపోలేదు.. అందరూ కలిసి ఓడగొట్టారు. నాకు టికెట్ ఇస్తే గెలిచేవాడిని. కరోనాతో వెంటిలేటర్‌పై వైద్యం చేయించుకున్నా. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేశాను. కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు చేపట్టాను. రెండు సార్లు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశాను. రాహుల్‌గాంధీ ప్రధాని కావడమే నా ముఖ్య ఉద్దేశం అని అంజన్‌కుమార్ అన్నారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అందరూ జూబ్లీహిల్స్‌లో అంజన్‌కుమార్ యాదవ్ పోటీచేయాలని భావించారని.. అధిష్ఠానం వేరేవాళ్లకు టికెట్ కేటాయించిందన్నారు. కరోనా సమయంలో అంజన్‌కుమార్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని.. ఆయన కూడా కరోనా బారిన పడ్డారని చెప్పారు. నగరంలో కాంగ్రెస్‌కు పెద్దదిక్కుగా ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుస్తుందని, అంజన్ సారథ్యంలోనే ఎన్నికల్లో పార్టీ ముందుకు వెళ్తుందని తెలిపారు. ఉప ఎన్నికలో అందరం కలిసి పనిచేస్తామని పొన్నం పేర్కొన్నారు.

# ములకల చెరువులో నకిలీ మద్యం కేసు

**గన్నవరం ఎయిర్‌పోర్టులో జనార్దన్‌రావు అరెస్ట్**

విజయవాడ,అక్టోబర్10 : అన్నమయ్య జిల్లా ములకల చెరువులో నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఏ1గా ఉన్న విజయవాడకు చెందిన జనార్దన్‌రావును గన్నవరం ఎయిర్‌పోర్టులో ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దక్షిణాఫ్రికా నుంచి జనార్దన్ విజయవాడ వస్తున్నాడని తెలుసుకున్న పోలీసులు.. గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకొని అతడిని అదుపులోకి తీసుకున్నారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు కలిసి ములకలచెరువు కనుగొండ అర్చి ప్రాంతంలో ఓ ఇంటిని అ÷-దదెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల దాడులు నిర్వహించి రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే.

# జిఎస్టీ సంస్కరణలతో వైద్యరంగంలో విప్లవం

**ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం: కలెక్టర్**

విజయవాడ,అక్టోబర్10 : ముఖ్యమంత్రి చొరవతో అందుబాటులోకి వచ్చిన జీఎస్‌టీ సంస్కరణల ఫలాలతో సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందని.. సూపర్ జీఎస్‌టీ – సూపర్ సేవింగ్స్‌తో సామాన్యుల జీవితాల్లో కొత్త వెలుగులు వస్తున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సూపర్ జీఎస్‌టీ 2.0తో వివిధ రంగాల్లో భారం తగ్గిందని.. జీవిత బీమాపై పాత రేటు 18 శాతం ఉంటే ఇప్పుడది సున్నా శాతం అయిందని, ఆరోగ్య–కుటుంబ బీమాలోనూ ఇదే రకమైన మినహాయింపు అందుబాటులోకి వచ్చిందన్నారు. గతంలో ప్రాణ రక్షక మందులపై జీఎస్‌టీ 12 శాతం ఉంటే ఇప్పుడది సున్నా శాతం అయిందన్నారు. వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ కిట్లుపై 12 శాతం ఉన్న పన్ను 5 శాతానికి తగ్గిందన్నారు. ఈ సంస్కరణలతో జరుగుతున్న మేలుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రులు, రైతు సేవా కేంద్రాలు, అంగన్వాడీలు, విద్యా సంస్థలు.. ఇలా ప్రతిచోటా అవగాహన కల్పిస్తున్నామన్నారు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో ఆదా అయిన సొమ్ము ప్రజల జీవితాలకు కొత్త దిశను చూపిస్తాయని, ఈ డబ్బు పెట్టుబడి కోసం, చదువుకోసం, డిపాజిట్ల కోసం.. ఇలా వివిధ రకాలుగా సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కొత్త జీఎస్‌టీ సంస్కరణలతో రాష్ట్ర ప్రజలకు రూ. 8 వేల కోట్లు, జిల్లా ప్రజలకు దాదాపు రూ. 300 కోట్లు మేర ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇంత మంచి అవగాహన కార్యక్రమంలో భాగస్వాములైన జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, ఆసుపత్రులు, డయాగ్నిస్టిక్ కేంద్రాలు.. ఇలా ప్రతిచోటా కొత్త జీఎస్‌టీ సంస్కరణలతో కలుగుతున్న ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జీవిత, ఆరోగ్య బీమాలకు సంబంధించి అధిక ప్రయోజనాలు సామాన్యులకు చేరువవుతున్నాయన్నారు. జీవిత బీమాలో తక్కువ ప్రీమియంతో ఎక్కువ కవరేజ్ లభిస్తుందని, ఆరోగ్య కుటుంబ బీమాలో ప్రతి రెన్యువల్‌లోనూ 18 శాతం ఆదా అవుతుందని వివరించారు. చికిత్సా ఖర్చులు, పరీక్షల ఖర్చులూ తగ్గుతాయని వెల్లడించారు. సాధారణ మందులపై పాత జీఎస్‌టీ 12 శాతం ఉంటే ఇప్పుడది 5 శాతానికి తగ్గిందని, టెస్టింగ్ కిట్లుపై పాత జీఎస్టీ 12 శాతం ఉంటే ఇప్పుడది 5 శాతానికి తగ్గిందన్నారు. వైద్య ఆరోగ్య రంగంతో పాటు వివిధ రంగాల్లో జీఎస్‌టీ సంస్కరణలతో కలుగుతున్న ప్రయోజనాలపై ప్రత్యేక ప్రచార కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

# నందగోకులం కొత్త ఎక్స్‌పీరియన్స్

**లైఫ్ స్కూల్‌కు చంద్రబాబు శ్రీకారం**
**సేవ్ ద బుల్ నినాదం ఆకట్టుకుంది**
**విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్ ప్రారంభం**
**పేద విద్యార్థులను తీర్చిదిద్దుతున్న తీరు అద్భుతం**
**నెల్లూరు పర్యటనలో సిఎం చంద్రబాబు నాయుడు**



నెల్లూరు,అక్టోబర్10 : సమాజం వల్ల పైకి వచ్చిన ప్రతి ఒక్కరూ సమాజానికి తిరిగి ఇవ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు. సమాజం రుణం తీర్చుకోవాలని అన్నారు. నెల్లూరు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ నేపథ్యంలో నందగోకులం లైఫ్ స్కూల్‌కు చంద్రబాబు శ్రీకారం చుట్టారు. అనంతరం విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్‌ను సందర్శించారు. అలాగే.. విశ్వసముద్ర గ్రూప్ ప్రాజెక్ట్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. నందగోకులంలో పశువుల పరిరక్షణ, లైఫ్ స్కూల్, ఇథనాల్ ప్లాంట్‌ను ప్రారంభించడం తనకు కొత్త ఎక్స్‌పీరియన్స్ అని చంద్రబాబు తెలిపారు. బొగ్గు, నీరు, సోలార్, గాలితో విద్యుత్ ఉత్పత్తి కాగా.. ప్రస్తుతం ఎద్దులతో విద్యుత్ ఉత్పత్తి చేయడం ఇదే తొలిసారి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 2047 నాటికి ప్రపంచ దేశాల్లో భారత్ ప్రథమ స్థానంలో ఉంటుందన్న సీఎం.. అందులో ఏపీ నెంబర్ వన్‌గా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడుల అంశాన్నీ సీఎం ప్రస్తావించారు. విశ్వసముద్ర ప్రాజెక్టులను ప్రారంభించడం సంతోషంగా ఉంది. వినూత్న ప్రయోగాలతో మూడు ప్రాజెక్టులను నెలకొల్పారు. మన రాష్ట్రంలో ఒంగోలు జాతి ఎద్దులు కనుమరుగయ్యాయి. కానీ, బ్రెజిల్‌లో ఒంగోలు జాతి బ్రీడ్‌ను ప్రపంచానికి అందించే పరిస్థితికొచ్చారు. 'నందగోకులం –సేవ్ ది బుల్' కార్యక్రమం చాలా విశిష్టమైనది. పేద విద్యార్థులను తీసుకొచ్చి నందగోకులం–లైఫ్ స్కూల్‌లో శిక్షణ ఇస్తున్నారు. సాధారణ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. సమాజం వల్ల పైకి వచ్చిన ప్రతి ఒక్కరూ సమాజానికి తిరిగి ఇవ్వాలని సీఎం అన్నారు. 15,000 టన్నుల ధాన్యం నూకలతో ఇథనాలు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. దీని ద్వారా రైతులకి ఆదాయం పెరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రకృతి పరిరక్షణకి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలని అందిపుచ్చుకున్నారని చెప్పారు. ఎద్దులతో విద్యుత్తు ఉత్పత్తి చేయడం ఎక్కడా లేదని చెప్పారు. పవర్ ఆఫ్ బుల్స్ చాటుతూ.. 5 యూనిట్లు విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారని చంద్రబాబు వివరించారు. నందగోకులం సేవ్ ది బుల్ అనే నినాదం ఎంతో విశిష్టమైందని చంద్రబాబు గుర్తు చేశారు. నందగోకులం లైఫ్ స్కూల్లో పేద పిల్లలకి చదువులు చెబుతున్నారని చెప్పారు. సామాన్య పిల్లలని అనితరసాధ్య వ్యక్తులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. సమాజం వల్ల పైకొచ్చిన వారు సమాజానికి డబ్బు ఇవ్వడం కాదు. పిల్లలకి అన్ని సదుపాయాలు కల్పించి, బెస్ట్ సిటిజన్స్‌లా తయారు చేయాలని ఆయన సూచించారు. చింతా శశిధర్ ఫౌండేషన్ ది బెస్ట్ స్కూల్ నడుపుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. దగదర్తిలో ఎయిర్ పోర్టు, కృష్ణపట్నంకి సీ పోర్టు, నేషనల్ హైవే, రైల్వే కనెక్టవిటీలు వస్తాయని స్పష్టం చేశారు. 2047లో ప్రపంచంలోనే మనదేశం ఒక శక్తిగా ఎదగబోతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అందులో మన ఏపీ మరింత శక్తిగా ఎదుగుతుందని వివరించారు. విశాఖలో రూ.87వేల కోట్లతో ఆర్టిఫిషియల్ సెంటర్ రాబోతుందని చెప్పారు. పేదలని బయటకి తీసుకువచ్చే బాధ్యత అందరూ తీసుకోవాలని సీఎం చంద్రబాబు వెల్లడించారు

# అక్రమాలు బయట పడతాయనే భయం

**అందుకే అసెంబ్లీకి మొఖం చాటేస్తున్న జగన్**
**అధికారంలో ఉన్నా..విపక్షంలో ఉన్నా మారని నైజం**
**ఘాటు విమర్శలు చేసిన అనకాపల్లి ఎంపి సిఎం రమేశ్**

అనకాపల్లి,అక్టోబర్10 : అక్రమాలు, అవినీతి బయటపడతాయనే భయంతో ఏపీ అసెంబ్లీకి జగన్ రావడం లేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై అనకాపల్లి ఎంపీ రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ తీరుపై విమర్శలు గుప్పించారు. అనకాపల్లిలో ఎంపీ రమేశ్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు కుర్చీలో ఉన్నప్పుడు జగన్ అసెంబ్లీకి వెళ్తే.. తాను సెల్యూట్ కొడతానని స్పష్టం చేశారు. ఇటీవల పులివెందులలో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు చూస్తే జగన్‌కి ప్రజా మద్దతు ఎలా ఉందో తెలుస్తోందని విమర్శించారు. గతంలో తమిళనాడులో ఒక్కరే గెలిచిన కరుణానిధి కూడా అసెంబ్లీకి వెళ్లారని గుర్తుచేశారు. గురువారం జగన్‌కి వచ్చిన జనం.. ఒక ఎమ్మెల్యే రోడ్ షో చేసిన కూడా వస్తారని ఎద్దేవా చేశారు. పీపీపీ విధానంలో ఏపీలోని 17 కాలేజీలను నిర్మిస్తే, తన అవినీతి బయటపడుతోందని జగన్ భయపడుతున్నారని విమర్శించారు. అధికారంలో ఉండి జగన్ రాష్ట్రాన్ని ఎంత సర్వనాశనం చేశారో.. ప్రతిపక్షంలో ఉండి కూడా అలాగే వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మెడికల్ కళాశాలల పీపీపీ విధానంపై జగన్‌కి కనీస అవగాహన లేదని ఎంపీ రమేశ్ ఆక్షేపించారు. దేశంలో గుజరాత్, యూపీ రాష్ట్రాల్లో పీపీపీ విధానంలో వైద్య కళాశాలలు ఎలా నిర్వహిస్తున్నారో పరిశీలించి జగన్ మాట్లాడాలని హితవు పలికారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుంటే.. జగన్ అండ్ కో అడ్డుకోవాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు. ఏపీకి పరిశ్రమలు రాకుండా పారిశ్రామికవేత్తలకు మెయిల్ పంపించి జగన్ అండ్ కో బెదిరిస్తున్నారని ఆరోపించారు. జగన్ ఎన్ని నాటకాలు ఆడినా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యదీక్షతతో ఏపీని అభివృద్ధి చేసి తీరుతామని ఉద్ఘాటించారు. జగన్‌కి ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని.. దేనికైనా సమాధానం చెప్పడానికి కూటమి పార్టీల నాయకులు సిద్ధంగా ఉన్నారని, చర్చకు రావాలని ఎంపీ రమేశ్ సవాల్ విసిరారు. ఒక్కసారైనా అసెంబ్లీకి వెళ్తే జగన్‌కు సెల్యూట్ చేస్తా అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం చూడలేక వైఎస్ జగన్ భయంకర వాతావరణ సృష్టిస్తున్నారని మండిపడ్డారు.. పులివెందులలో జడ్పీటీసీ ఎన్నికల్లో డిపాజిట్లు పోయినా ఇంకా జగన్ మారలేదన్నారు.. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలపై జగన్ అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్న ఆయన.. గుజరాత్‌లో విజయవంతంగా నడుస్తున్న పిపిపివిధానాన్ని కూటమి ప్రభుత్వం ఇక్కడ అమలు చేస్తుందన్నారు.. 50 సంవత్సరాల రాజకీయ జీవితం ఉన్న అయ్యన్నపాత్రుడు గురించి జగన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.. స్పీకర్ అయ్యన్నపాత్రుని ఎదుర్కొనే ధైర్యం ఉంటే జగన్ ఒకసారైనా అసెంబ్లీకి వెళ్లాలని సూచించారు.. నీ కోసం ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కోరతానని తెలిపారు. వైఎస్ జగన్ అసెంబ్లీకి వెళ్తే తన ప్రభుత్వంలో చేసిన అక్రమాలు బయటపడతాయన్న భయం ఉందని దుయ్యబట్టారు.. అసెంబ్లీని ఫేస్ చేయలేని ప్రతిపక్ష నాయకుడు జగన్ అని సెటైర్లు వేశారు..

## ఈ నెల 23న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

విజయవాడ,అక్టోబర్10 : యువతలో కళా నైపుణ్యం, జాతీయభావం పెంపొందించడంలో భాగంగా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన సంక్షేమాధికారి యు.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ కొత్తపేట కేబీఎన్ కళాశాలలో యువజనోత్సవాలు నిర్వహించనున్నామని.. 2025, సెప్టెంబర్ 1 నాటికి 5-29 ఏళ్ల వయసుకలిగిన, జిల్లాస్థానికత ఉన్న యువత పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వికసిత్ భారత్ జిల్లా స్థాయి – కల్చరల్ అండ్ ఇన్నోవేషన్ ట్రాక్ విభాగంలో ఫోక్ డ్యాన్స్, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, పొయెట్రీ, డిక్లమేషన్, ఇన్నోవేషన్ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు ఈ నెల 22లోపు పేర్లు నమోదు చేసుకోవాలని లేదా వేదిక వద్ద 23వ తేదీ ఉదయం పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయి విజేతలు, జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. పూర్తి వివరాలకు 9949522694, 9032115987 నంబర్లలో కార్యాలయ పని వేళల్లో సంప్రదించవచ్చని యు.శ్రీనివాసరావు తెలిపారు.

## బిజెపి అభ్యర్థి..బిఆర్ఎస్సే

**కాంగ్రెస్ నేత సామా కామెంట్స్**

హైదరాబాద్,అక్టోబర్10 : హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఎన్నికల నగారా మోగడంతో అభ్యర్థుల ఎంపికపై రాజకీయ పార్టీల నేతలు, అధినేతలు కసరత్తు చేస్తున్నారు. ఆ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్ యాదవ్ పేరును ఆ పార్టీ అధిష్టానం ఇప్పటికే ఖరారు చేసింది. ఇక బీఆర్ఎస్ పార్టీ మాత్రం దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీతను బరిలో నిలిపింది. బీజేపీ సైతం అభ్యర్థిని ప్రకటించేందుకు సిద్ధమవుతుంది. తాజాగా బీజేపీలో చోటు చేసుకుంటున్న వరుస పరిణామాల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి శుక్రవారం తన ఎక్స్ ఖాతా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో.. బీజేపీ అభ్యర్థి బీఆర్ఎస్సే అంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. కారు గుర్తుకు ఓటు కమల పార్టీ బలోపేతానికే అంటూ హింట్ సైతం ఇచ్చారు. దిక్కుతోచని స్థితిలో బీజేపీ కార్యకర్తలు, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు అంటూ ఆయన ఎద్దేవా చేశారు. చివరగా బీజేపీ ఈక్వల్ టూ బీఆర్ఎస్ అంటూ ఇంగ్లీష్ అక్షరాలతో రాసుకొచ్చారు. చివరగా జూబ్లీహిల్స్ బై ఎలెక్షన్స్ అంటూ ట్యాగ్ చేశారు. కారు, కమలం గుర్తులు ఉన్న ఫోటోలను ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు.

## కళ్లు చెదిరేలా ఆస్తులు రిటైర్డ్ ఇంజనీర్

**తనిఖీల్లో భారీగా నగదు, బంగారం పట్టివేత**
**ఫామ్‌హౌజ్‌లో 17టన్నుల తేనె లభ్యం**

భోపాల్,అక్టోబర్10 : మధ్యప్రదేశ్‌లో పదవీ విరమణ పొందిన ఓ ప్రభుత్వ ఇంజనీర్ సంపద చూసి అధికారులే అవాక్కయ్యారు. లోకాయుక్త అధికారులు ఆయన ఇళ్లల్లో సోదాలకు వెళ్లగా.. నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం, వెండి లభించాయి. ఇక ఆయన ఫామ్‌హౌస్‌లో దొరికిన 17 టన్నుల తేనెను చూసి వారు ఆశ్చర్యపోయారు. భోపాల్‌లో ప్రజా పనుల విభాగంలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసి రిటైర్ అయిన జీపీ మెహ్రా లగ్జరీ లైఫ్‌స్టైల్ చూసి అతా ముక్కున వేసేసుకున్నారు. ఓ అప్రకటిత ఆస్తుల వ్యవహారంలో తీగ లాగితే.. మెహ్రా బండారం బయటపడిందని ఆంగ్ల మీడియా కథనం వెల్లడించింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దర్యాప్తు చేస్తుండగా జీపీ మెహ్రా పేరు వినిపించింది. దీంతో అధికారులు ఆయనపై దృష్టిసారించారు. ఈ క్రమంలోనే భోపాల్, నర్మదాపురంలోని మెహ్రా నివాసాల్లో లోకాయుక్త అధికారులు తనిఖీలు చేపట్టారు. నలుగురు డీఎస్పీ ర్యాంక్ అధికారుల నేతృత్వంలో ఏకకాలంలో ఈ సోదాలు జరిగాయి. మణిపురంలోని మెహ్రా నివాసంలో అధికారులు 8.79లక్షల నగదు, రూ.50లక్షల విలువ చేసే ఆభరణాలు, రూ.56లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను గుర్తించారు. ఇక, దనా పానీలో మెహ్రాకు ఓ లగ్జరీ అపార్ట్‌మెంట్ ఉంది. అందులో అధికారులు తనిఖీలు చేయగా.. భారీగా నోట్ల కట్టలు, రూ.3 కోట్ల విలువ చేసే రూ.2.6 కిలోల బంగారం, 5.5 కిలోల వెండిని గుర్తించినట్లు సదరు కథనం పేర్కొంది. నర్మదాపురంలో మెహ్రాకు చెందిన ఫామ్‌హౌస్‌కు వెళ్లగా కళ్లుచెదిరే ఆయన విలాసాలు చూసి అధికారులు కంగుతిన్నారు. ప్రైవేటు సామ్రాజ్యాన్ని తలపించేలా ఆ వ్యవసాయ క్షేత్రంలో 32 అధునాతన కాటేజీలు నిర్మాణ దశలో ఉన్నాయి. మరో ఏడు కాటేజీలను పూర్తిచేశారు. మధ్యలో చెరువు, గోశాల, ఆలయం, నాలుగు లగ్జరీ కార్లు కన్పించాయి. అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. ఆయన ఫామ్‌హౌస్ నుంచి 17 టన్నుల తేనెను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అనుమతి లేకుండా ఆయన తేనె సాగు చేస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఆయన ఆస్తుల లెక్కింపు కొనసాగుతోందని, మెహ్రా సంపద రూ.వందల కోట్లలో ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఆయన బ్యాంకు రికార్డులు, డిజిటల్ ÷ళ్లెను ఫోరెన్సిక్ బృందాలు తనిఖీ చేస్తున్నాయి. మెహ్రా బినామీ పెట్టుబడుల పైనా అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి.

## వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను గట్టెక్కించాం

**ఇంజనీరింగ్ కాలేజీలో భారీ చోరీ**

రంగారెడ్డి,అక్టోబర్10 : రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఓ ఇంజనీరింగ్ కాలేజీలో భారీ చోరీ జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కాలేజీలో దుండగులు రూ.కోటి ఎత్తుకెళ్లారు. గుర్తించిన కాలేజీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. కాలేజీని పరిశీలించారు. కళాశాల పరిసరాల్లో సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ఈ ఘనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.




## వర్కింగ్ అవర్స్ కారణంగా భారీ ప్రాజెక్ట్‌లకు దూరం

### దీపికపై ఆరోపణల నేపథ్యంలో సంచలన కామెంట్స్

కల్కి 2 నుంచి ఔట్ అయ్యాక దీపికా పదుకొణె ఏదో విషయంలో ఈ మధ్య వార్తల్లో ఉంటున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇండస్ట్రీలో చాలామంది హీరోలు 8 గంటలు మాత్రమే పని చేస్తున్నారని అగ్ర కథానాయిక దీపికా పదుకొణె అన్నారు. వర్కింగ్ అవర్స్ కారణంగా ఆమె భారీ ప్రాజెక్ట్‌ల నుంచి వైదొలిగారని వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. దీనిపై ఎట్టకేలకు తాజాగా ఆమె స్పందించారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఒక ఆత్మాభిమానం ఉన్న నటిగా నన్ను ఇబ్బందిపెట్టే వాటిని అంగీకరించను. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో చాలామంది సూపర్‌స్టార్‌లు, అగ్ర హీరోలు ఎన్నోఏళ్లుగా 8 గంటలు మాత్రమే పని చేస్తున్నారు. ఇదేం రహస్యం కాదు. కానీ, ఇన్నేళ్లలో ఈ విషయం ఎప్పుడూ వార్తల్లో నిలవలేదు. ఇప్పుడు వాళ్ల పేర్లు చెబితే మొత్తం విషయం తప్పుదోవ పడుతుంది. అందుకే వాళ్ల పేర్లు చెప్పాలనుకోవడం లేదు. కానీ, చాలామంది హీరోలు 8 గంటలే పని చేస్తారని అందరికీ తెలిసిన విషయమే. అంతేకాదు.. వారిలో చాలామంది సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే షూటింగ్‌లలో పాల్గొంటారు. వారాంతాల్లో పని చేయరని తెలిపారు. న్యాయంగా పోరాటం చేస్తున్న కారణంగా మీరు ఇబ్బందిపడ్డారా అని అడిగిన ప్రశ్నకు దీపిక స్పందించారు. నేను దీన్ని చాలాసార్లు ఎదుర్కొన్నాను. ఇది కొత్తేం కాదు. దీన్ని ఎలా వెల్లడించాలో కూడా నాకు తెలియడం లేదు. ఎన్నో పోరాటాలను నిశ్శబ్దంగా ఎదుర్కొన్నాను. కానీ, కొన్ని కారణాల వల్ల అవి బహిరంగంగా మారతాయి. నేనెప్పుడూ దేనిపైనా స్పందించను. నిశ్శబ్దంగా యుద్ధాలను చేయడం మాత్రమే నాకు తెలుసు. అలా చేస్తేనే అది గౌరవంగా, హుందాగా ఉంటుంది' అని దీపిక సమాధానమిచ్చారు.






## 500 కోట్ల క్లబ్‌లో కాంతారా

రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాంతార చాప్టర్ 1' భారీ అంచనాల మధ్య దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా మరో ఘనతను సొంతం చేసుకుంది. విడుదలైన 9 రోజుల్లోనే రూ.500 కోట్ల క్లబ్‌లో స్థానం సొంతం చేసుకుంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా సాధించిన వసూళ్లను తెలుపుతూ నిర్మాణసంస్థ తాజాగా పోస్టర్ విడుదల చేసింది. వరల్డ్ వైడ్‌గా రూ.509 కోట్లు సాధించినట్లు తెలిపింది. ఇప్పటికే పలు సినిమాల రికార్డులు తిరగరాసిన 'కాంతార 1'.. ఇప్పుడు 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన రెండో సినిమాగా నిలిచింది. త్వరలోనే మొదటి స్థానంలోకి వెళ్లే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ ఏడాదిలో విడుదలైన 'ఛావా' రూ.600 కోట్లతో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల వరుసలో టాప్‌లో ఉంది. 'కాంతార 1' థియేటర్‌లలో హౌస్‌ఫుల్ బోర్డులతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. దీంతో ఈ రికార్డును మరికొన్ని రోజుల్లోనే బీట్ చేసి టాప్‌వన్‌లో నిలిచే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సినిమా విజయం సాధించడంతో రిషబ్ వరుస ఇంటర్వ్యూలతో దీన్ని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఇండస్ట్రీలో ఎంతోమంది టాలెంటెడ్ దర్శకులు ఉన్నారు. వారందరితో పోలిస్తే నేను చిన్న పిల్లాడిని. కానీ, వాళ్లందరూ కాంతారపై ప్రశంసలు కురిపిస్తుంటే ఆనందంగా ఉంది. ఈ విజయం నా బాధ్యతను రెట్టింపు చేసిందని చెప్పారు.

## మరోమారు రష్మిక-విజయ్ కాంబో

టాలీవుడ్ స్టార్ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా మరోసారి కలిసి నటించబోతున్నట్లు- తెలుస్తుంది. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో వచ్చిన గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ వచ్చి మంచి విజయాలు అందుకున్నాయి. దీంతో ఈ హిట్ జోడి మళ్లీ తెరపై రోమాన్స్ చేయబోతున్నట్లు- వార్తలు వస్తున్నాయి. టాక్సీవాలా, శ్యామ్ సింగరాయ్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రాహుల్ సాంకృత్యాయన్ విజయ్ దేవరకొండతో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. టాక్సీవాలా తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో మంచి అంచనాలు ఉన్నాయి. వీడీ 14గా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ నిర్మిస్తుండగా.. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో రాయలసీమ నేపథ్యంలో ఈ చిత్రం రాబోతుంది. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే షూటింగ్ ప్రారంభించనుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాలో కథానాయికకు సంబంధించి ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ మూవీలో కథానాయికగా మేకర్స్ రష్మిక మందన్నాని అనుకుంటున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే ఫ్యాన్స్‌కి పండగనే చెప్పుకోవాలి. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.






## రామ్..ఆంధ్రా కింగ్ మూవీ


టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, దర్శకుడు మహేష్ బాబు పి కాంబోలో తెరకెక్కుతున్న యూనిక్ ఎంటర్‌టైనర్ ఆంధ్రా కింగ్. ఇందులో కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తుండగా, రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఈ సినిమాకి వివేక్ / మెర్విన్ సంగీతం అందిస్తుండగా. ఫస్ట్ ట్రాక్ నువ్వుంటే చాలే ప్రోమోస్ పాట పై చాలా బజ్ క్రియేట్ చేశాయి. మేకర్స్ లిరికల్ వీడియోను రిలీజ్ చేసి మ్యూజిక్ ప్రమోషన్‌లను ప్రారంభించారు. ఇక ఈ సాంగ్ రిలీజ్ అయిన కొద్ది సేపటికే ట్రెండింగ్ అయింది కూడా. ఇటీవల ఈ మూవీని ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 28న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' అనౌన్స్ చేసింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేసింది.. ' ఈ ఏడాది మీ జీవితాన్ని బిగ్ స్క్రీన్‌పై తిరిగి చూడడానికి రెడీగా ఉండండి. ఆంధ్ర కింగ్ తాలూకా నవంబర్ 28న గ్రాండ్ రిలీజ్' అంటూ రాసుకొచ్చారు. అలాగే తాజాగా ఈ మూవీకి సంబంధించి మరో అప్‌డేట్ వచ్చింది.. మేకర్స్ ఈ మూవీ టీజర్ రిలీజ్ వివరాలను వెల్లడించారు. అక్టోబర్ 12న విడుదల కాబోతున్న టీజర్‌లో రామ్, భాగ్యశ్రీ మధ్య ఉండే సీన్ సినిమాటిక్ థీమ్‌ను హైలైట్ చేసేలా ఉన్నయట. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు ప్రేక్షకుల్ని ఆకట్టుకోగా.. మరి టీజర్ ఎలాంటి బజ్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



## జక్కన్న పుట్టిన రోజు

### మరో అద్భుతం త్వరలోనే అంటూ మహేశ్ విషెస్

టాలీవుడ్‌కు ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన దర్శకుడు.. ఆర్‌ఆర్‌ఆర్‌తో తెలుగు చలనచిత్ర పరిశ్రమను అంతర్జాతీయంగా అందలం ఎక్కించిన దర్శక ధీరుడు రాజమౌళి. అక్టోబర్10న జక్కన్న పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు ఒక స్పెషల్ ఫొటోతో విషెస్ చెప్పారు. రాజమౌళితో దిగిన ఫొటో పంచుకున్న మహేశ్.. 'ఇండస్ట్రీలో ఉన్న ఒకేఒక్క దర్శకధీరుడు రాజమౌళికి పుట్టినరోజు శుభాకాంక్షలు. మీరు తెరకెక్కించేవన్నీ అద్భుతాలే. మీ నుంచి మరో అద్భుతం త్వరలోనే రానుంది' అని రాసుకొచ్చారు. అందులో మహేశ్ ఎస్ఆర్ఎంబి29 లుక్‌లో ఉండడంతో ఈ ఫొటో వైరల్ అవుతోంది. ప్రస్తుతం మహేశ్ – రాజమౌళిల కాంబినేషన్‌లో ఈ మూవీ తెరకెక్కుతోంది. భారీస్థాయిలో రానున్న ఈ ప్రాజెక్ట్‌కు 'వారణాసి' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. నవంబర్ 16న దీన్ని అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. ఇందులో మహేశ్ సరసన ప్రియాంకచోప్రా కథనాయికగా నటించనున్నారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు.



## బాహుబలికి తొలుత నెగెటివ్ టాక్

### దిమ్మ తిరిగినంత పనైందన్న రాజమౌళి

బాహుబలి విడుదలయిన వెంటనే బ్యాడ్ టాక్ రావడంతో రాజమౌళి ఆధపడ్డారు. దీన్ని ఎలా తట్టుకోవాలన్న ఆలోచనలో పడిపోయారు. అయితే క్రమంగా పాజిటివ్ టాక్ రావడంతో పాటు చిత్రం భారీ హిట్ కొట్టింది. ఎస్.ఎస్.రాజమౌళి వలం పేరు మాత్రమే కాదు.. ఇదొక బ్రాండ్. ఆయన మేకింగ్, టేకింగ్‌తో భారతీయ సినిమా, ముఖ్యంగా తెలుగు సినిమాను ప్రపంచవ్యాప్తం చేశారు. ఇన్నేళ్ల సుదీర్ఘ సినీ కెరీర్‌లో ఆయన అపజయం అంటూ చూడలేదు. కానీ, తాను తీసిన ఓ సినిమా విడుదల సందర్భంగా వచ్చిన టాక్ విని నిరాశకు గురయ్యారట. ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని జక్కన్నే స్వయంగా పంచుకున్నారు. బాహుబలి: ది బిగినింగ్' విడుదలైన రోజున వచ్చిన టాక్ విని చాలా నిరాశకు గురయ్యా. అది తొలి పాన్ ఇండియా ఫిల్మ్. తెలుగుతో సహా దక్షిణాది భాషలతో పాటు, ఉత్తరాదిలోనూ విడుదల చేశాం.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com